ఆంధ్ర సచిత్ర వారపత్రిక

17-2-84
150 పైసలు



విఖ్యాతి గాంచిన విమల్ వస్త్రాలు

కన్నులకింపైన రంగులు-వినూత్న డిజైన్లు

వివాహాది శుభకార్యాలకు ఆడవారిని, మగవారిని అలరించే విస్తృత శ్రేణి



చీరెలు

మోనోలిస, సిల్కీ హాట్రిక్, పద్మిని, దీపాళి

సూటింగ్స్

ఫ్రంట్‌లైన్, ట్రెండ్స్, టెరెక్స్, లీరాయి, 24 కె ఆల్‌టైమ్స్

షర్టింగ్స్

సూపర్‌టెస్ట్, పోర్ట్‌నాక్స్, స్పైడర్‌మాన్, ఎవర్‌గ్లేడ్


VIMAL®
A RELIANCE PRODUCT

విమల్ వస్త్రాల ప్రత్యేక షోరూమ్

విమల్ దీప్

ప్రకాశంరోడ్, గవర్నరుపేట సెంటర్
విజయవాడ 2. PHONE:755558





సంక్రాంతి సంచిక

సంక్రాంతి సంచిక ముఖచిత్రం ఎంత బాగుందో చెప్పలేను! ''బాబు''గారు వేసిన చిత్రం, జోకు రెండూ ఎంతగానో నాకు నచ్చాయి

సుదేశ్ కుమార్, జంషెడ్ పూర్

బ్రతుకుధర్మం

తొమ్మిది నెలలు మోసి, కని, పెంచి, చివరికి బిడ్డను మంచి ప్రయోజకుడిగా చేసిన తల్లిదండ్రుల్ని దగ్గరకు చేర్చుకోని సత్యంలాంటి వాళ్ళను ఏం చేసినా పాపం లేదు

అది తెలిసి కూడా తన బ్రతుకు ధర్మం కోసం చూసుకున్న మాధవరావుది మంచి ప్రవర్తన

రావెళ్ళ శ్రీనివాసరావు, బలిజేపల్లి.

పూర్ణిమ

ముద్ద మందారం పూర్ణిమను చాలా అందముగాను, చూడ ముచ్చటగాను ప్రచురించిన మీకు నా థ్యాంక్స్

చె ఆర్ విజయచంద్రారెడ్డి, పేలేరు

* * *

ముగ్ధ మనోహర సుందరి ముద్దమందారం ''పూర్ణిమ'' మమ్మల్ని ఆకర్షించింది

పి ఉమామోహన్, ఆశాజ్యోతి, విశాఖపట్నం

లాటరీలు

''లాటరీలు'' వ్యాసం నేడు లాటరీలు ఆడే ప్రేక్షకమహాశయులకు కనువిప్పు కలిగించేలా వుంది, నిజానికి యీ లాటరీల జోరు ప్రజలలో విపరీతంగా ప్రాకింది. నరేంద్రగారన్నట్లు యీ టిక్కట్లు అవకతవకలుగా ముద్రించకుండా చూడడం అవసరం

షేక్ మస్తాను, గాలిబీబి, ముమ్మలనేనివారిపాలెం

మారేడుదళం

''మారేడు దళం'' ప్రారంభంలోనే కొత్త మలుపు తిరిగి ఇంట్రెస్ట్ గా సాగుతోంది.

యస్ పర్వీన్ బేగం, గిరింపేట

* * *

జొన్నలగడ్డ లలితాదేవి రచించిన కొత్త సీరియల్ ''మారేడుదళం'' ప్రారంభములోనే మమ్ములను ఆకట్టుకొన్నది.

పెద్దకోట్ల శ్రీనివాసులు, రమణ, ఉరవకొండ

సంక్రాంతి ముగ్గులు

''అనురాగ తరంగాలు''సీరియల్ బాగున్నది ముగ్గులు చాలా అందముగాయున్నవి మగవారిని మమ్మే ఆకర్షిస్తున్నవి ఇక ఆడవారిని ఎంత ఆకర్షిస్తాయో!

పి మరిన్ కుమార్, ఏలూరు

పీఠికాపురాధీశ ప్రభుత్వ కళాశాల కాకినాడ శతవార్షికోత్సవాలు

విజ్ఞప్తి

పీఠికాపురాధీశ ప్రభుత్వ కళాశాల శతవార్షికోత్సవాలు ఫిబ్రవరి 11, 12, 13 తేదీలలో భారీ యెత్తున జరపాలని కళాశాల సిబ్బంది, పాత విద్యార్థుల సంఘం, శతవార్షికోత్సవాల కమిటీల సంకల్పము.

పీఠికాపురాధీశ్వరుని దాన నిరతికి ప్రతీకగా శ్రీ రఘుపతి వెంకటరత్నం నాయుడు, వేమూరి రామకృష్ణారావు, పెద్దాడ రామస్వామి గార్ల ఆధ్వర్యంలో పురోగమించిన ఈ విద్యాలయంలో చదివిన వారెందరో దేశవిదేశాలలో ఖ్యాతి గడించారు.

ఈ సందర్భముగా కళాశాలలో చదివిన సాహిత్య కళా, చలనచిత్ర, వైజ్ఞానిక, రాజకీయ, క్రీడారంగాలలో ప్రముఖులను సన్మానించాలని, కళాశాలకు సంబంధించిన ప్రముఖుల వ్యాసాలలో సావనీర్‌ను ముద్రించాలని, కేంద్ర, రాష్ట్ర రాజకీయ నాయకులను ఆహ్వానించి సన్మాన, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని తలపెట్టాం

ఈ సదవకాశాన్ని పురస్కరించుకొని, కళాశాల విద్యార్థులు ఇతోధికంగా విరాళాలను అందచేసి, శతవార్షికోవాలను దిగ్విజయం చేయాలని కోరుచున్నాము ఈ కళాశాలలో చదివిన ప్రముఖుల గురించి మీకు తెలిసిన విశేషాలు, ఫొటోలను, ప్రిన్సిపాల్, పి ఆర్ కాలేజికి పంపవలసిందిగా మనవి చేస్తున్నాము రు 25/-లు తక్కువ కాకుండా పంపినవారికి సభ్యత్వం, ఆహ్వాన పత్రములు పంపబడతాయి రు 116/-లు తక్కువ కాకుండా పంపిన వారికి, సావనీర్ ఉచితముగా పంపబడుతుంది చెక్కులు, డ్రాఫ్టులు, ''పి ఆర్ గవర్నమెంటు సెంటినరీ సెలబ్రేషను - కమిటీ''కి పంపవలసిందిగా, విజ్ఞప్తి చేస్తున్నాము రశీదులు, కృతజ్ఞతా పత్రంతోపాటు పంపబడును

ఇట్లు

పీఠికాపురాధీశ్వర కళాశాల శతవార్షికోత్సవ సంఘం, కాకినాడ — 533 001

అచ్చుతప్పు

ఆహారం— ''నేరప్రవృత్తి'' టైటిల్‌తో ఆంధ్రసచిత్రవారపత్రిక [27–1–84] లో ప్రచురించిన నా ఉత్తరంలో నాలుగువ వాక్యం అనగా ''అంతేగాని నేరాలు పెరుగుతుంటే పోలీసు బలగం పెంచుకుంటూ పోతూండడం, ధరలు పెరుగుతుంటే జీతాలు పెంచుతున్నట్లుగా వుంటుంది'' పదవ లైనులో అచ్చుతప్పు పడిందనుకుంటాను. అర్థం లేకుండా పోయింది. తప్పు మీదైనా మాదైనా సవరణ ఇవ్వగలరని ఆశిస్తున్నాను తప్పు తప్పే కదా! ఒప్పుకుంటే మంచిది

యం. జయభారతి, విజయనగరం.

* * *

20–1–84 వారపత్రికలో 'వ్యక్తిగతం' శీర్షిక క్రింద శ్రీ గవాస్కర్ 31 టెస్ట్ సెంచరీలు చేసారని వ్రాశారు. ఇది తప్పు గవాస్కర్ 30 టెస్ట్ సెంచరీలు చేసి, డాన్ బ్రాడ్‌మన్ రికార్డును అధిగమించారు.

ఒక ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ చేసినా, దానిని ఒకటిగానే లెక్కకడతారు.

పి యస్. శ్రీనివాసరావు, విశాఖపట్టణం

★ పొరపాటుకి చింతిస్తున్నాము —సం. ★

త్వరలో ప్రారంభం!

కొత్త సీరియల్ నవల

కర్మయోగి

రచన:

డాక్టర్ కె. వి. కృష్ణకుమారి

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :

దేశోద్ధారక కాశీనాథుని

వాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం 1908

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు :

[1938–1972]

శుక్రవారం 17–2–'84

రుధిరోద్గారి నామ సం. మాఘ బ. పాడ్యమి

సంపుటము 76 : సంచిక 23

సంపాదకుడు :

శివలెంక రాధాకృష్ణ


విడి ప్రతి వెల	రు.	1-50
ఆరు మాసాల చందా	రు.	42-90
పోస్టులో ఏడాది చందా	రు.	85 80

ఆంధ్రపత్రిక కార్యాలయము,

గాంధీనగరం, విజయవాడ-520 003.


విషయానుక్రమణిక

లోకం పోకడ — డౌమెన్



అభివృద్ధి అంటే ఏమిటి ?

న్యూఢిల్లీ లేఖ




డా. జయదుబాషి

రిపబ్లిక్ దినాలు వచ్చి వెడుతూ ఉంటాయి "మన పరిస్థితి మునుపటికన్నా బాగా ఉందా, లేదా ?" అన్న ప్రశ్న మాత్రం మిగిలిపోతుంది. ఈ ప్రశ్నకి సమాధానం కావాలంటే ముందు "మనం" అనే మాటకీ, "బాగా ఉండటం" అనే మాటకీ అర్థం చెప్పుకోవాలి. లెక్కల సహాయంతో ఎన్ని అబద్ధాలనయినా చెప్పవచ్చు నేను ఆర్థిక శాస్త్రజ్ఞుడిని కాబట్టి వాటికి ఎలాగ వక్రార్థాలు చెబుతారో నాకు బాగా తెలుసు మనం ఒక రిపబ్లిక్‌గా మారినప్పటికన్నా ఇప్పుడు మన జనాభా ఎక్కువ అప్పటికీ ఇప్పటికీ మనం కొంత అభివృద్ధి, సాధించినమాట నిజమే కాని అంకెలని మించి వేరే ఏమీ లేదా జీవితంలో ? "లేదు" అనే నమ్ముతారేమో శ్రీమతి గాంధీ కాని, ఆమె అనుచరుడు అబ్దుల్ రహమాన్ అంతూలే కాని అభివృద్ధిగా పిలువబడేది ఇటు నెహ్రూ కుటుంబానికీ, అటు అంతూలే లాంటి వారికీ బాగా లాభసాటిగా ఉంటూ వచ్చింది వాళ్ళకేకాదు వాళ్ళ చుట్టూ వాళ్ళకి కూడా బాధాకరంగానే ఉంటూ వచ్చింది. ఇక తాతా, బిర్లాల సంగతి సరేసరి భారతదేశంలో వాళ్ళంతా కలిసి ఒక 'పరికల్పిత వర్గం'గా రూపొందారు ఈ వర్గానికి కావలిసినంత ధనం ఉంది అందుకనే, అంతూలే కూతురు పెళ్లి అయితే 50,000 మంది అతిథులు వగయిరా వచ్చారు బొంబాయి ప్రధాన న్యాయమూర్తి ఏమిటి, రాష్ట్రపతి ఏమిటి అంతా వచ్చారు. బొంబాయి ప్రధాన న్యాయమూర్తి మహారాష్ట్ర హైకోర్టులోనే విచారణకి గురి అవుతున్నారు. బొంబాయి గవర్నరు సయితం పెళ్లికివచ్చారు. రాష్ట్రపతి కొత్త ఢిల్లీనుంచి పనిగట్టుకుని బొంబాయికి వచ్చారు రాష్ట్రపతిగారే రిపబ్లిక్ దినం ఊరేగింపులలో 'సెల్యూట్' తీసుకుంటారు. అటు ఈ సెల్యూట్, ఇటు అంతూలే ఇంట్లో పెళ్లి— అది ఒక పెద్ద విశేషం, అంతూలే చేసిన మోసాలు ఏమిటి ? రాష్ట్రపతికి ఇది తగునా ? ఫరవాలేదని మీలాంటి వాళ్ళకి అనిపిస్తే అది మనదేశం దురదృష్టం. కాదు, అనుచితం అని మీకు అనిపించినా మీరు చెయ్యగలిగింది ఏముంది ? మనం అంత హీనస్థితికి చేరుకున్నాము మరి.

అభివృద్ధి అనబడే దానిని వదిలివేద్దాము, మన ఉక్కు ఉత్పత్తి వివరాలని వదిలివేద్దాము (వీటి వివరాలని తెలిపే కాగితాల కట్టలు శ్రీమతి గాంధీవద్ద ఎన్ని ఉంటాయో !), నినాదాలు పలికే కాంగ్రెసు (ఇందిర) వారితో నిండిన 5—చుక్కల హోటళ్లని వదిలివేద్దాము; అలాగే ఉపగ్రహాలనీ, పొక్రాన్ అణుప్రయోగాన్నీ, అతి వేగంగా వెళ్లే కొన్ని రైలు బళ్లనీ, అంత వేగంగా పోలేని రైలు బళ్లనీ విస్మరిద్దాము (ఇలాంటివి లేని దేశాలు ప్రపంచంలో తక్కువే, ఎందుకంటే వాటిని తయారు చెయ్యలేనివాళ్ళు వాటిని కొనుక్కోగలరు) — 34 సంవత్సరాల అభివృద్ధి మంచి చెడ్డలని పరిశీలిస్తే మనకి అనిపించేది ఏమిటి ? మురికివాడలూ, మట్కీ, అంతూలేలూ, గుండురావులూ, మొయిలీ టేపులూ, బ్రహ్మచారుల తుపాకులూ, పాల్ ల 'నాన్ రెసిడెంట్' నిధులూ, అజిత్ కేర్కర్ ప్రభృతుల 5 – చుక్కల హోటళ్లూ మినహా మనం సాధించినది ఏమిటి ? అనిపించదూ ? [5 – చుక్కల హోటళ్లలో ఎందరో హత్య చెయ్యబడుతూ ఉంటారు లేదా ఆత్మహత్య చేసుకుంటూ ఉంటారు.] 1950లో భారతదేశం ఆశయాలతో ఉత్సాహపూరితంగా ఉంటే, 1984లో ఈ దేశంలో చీకట్లు బాగా ఆవరించాయి. "చీకట్లు ఆవరించటం" అంటే కవిత్వం కాదు. కలకత్తాలో నిజంగానే చీకటి ఎక్కువే ! వి. ఎస్. నైపాల్ అనే రచయిత "చీకటి ప్రాంతం" అనే పుస్తకం రాశాడు. ఆయన మానసికంగా వైకల్యం చెందినవారు అయినాసరే ఆయన పుస్తకం శీర్షిక ఇప్పుడు మనకి బాగా పనికి వస్తోంది.

కొందరు అంటారు· "మన అభివృద్ధి జరుగవలిసినంత వేగంగా జరగటం లేదు. జపాన్ లాగే మనమూ బాగా వేగంగా అభివృద్ధి చెందితే, అంటే ఎక్కువ విద్యుత్ కేంద్రాలు నెలకొల్పి, ఎక్కువ ఉక్కు మిల్లులు స్థాపించి, ఎక్కువ మోటారుకారులు తయారుచేస్తే, ఇంకా ఇలాగ ఏదేదో చేసి ఉంటే, మన పేదరికం తొలగిపోయి మనం బాగుపడేవాళ్లము" అని ఇది పట్టిభ్రమ. మన అభివృద్ధి ఇంతకన్నా వేగంగా జరగనందుకు నాకు సంతోషంగా ఉంది మనలో ఇందరు పేదలు ఉన్నా ఫరవాలేదు. (అందరూ తిండిలేక మాడటంలేదు కదా ?) మనకి తగిన వనరులు లేకపోగా అమెరికా సంయుక్త రాష్ట్రాల వంటి దేశాలు మనకి అప్పులు ఇవ్వటానికి వెనుకాడుతున్నారంటే నాకు తెరిపిగానే ఉంది. ఎందుకంటే, మనవాళ్ల చేతులలో డబ్బు ఎక్కువగా తిరిగితే అదికాస్తా మరిన్ని 5—చుక్కలహోటళ్లకీ, అతివేగమయిన రైలు బళ్లకీ, పెద్ద విమానాలకీ ఖర్చు చేసేవాళ్లు. ఇంత దుబారా చేసి మనం బాగుపడగలమా ? ఇంకా ఎన్ని పేచీలు వస్తాయో మన దేశానికి !

ఈ మధ్యనే 'గార్డియన్' పత్రిక యొక్క సావ్‌పాలో విలేఖరి రాసిన వ్యాసం ఒకటి చదివాను. సావ్‌పాలో కన్నా పెద్ద నగరం బ్రెజిల్‌లో లేదు. బ్రెజిల్ బాగా అప్పులు తీసుకుని విపరీతంగా అభివృద్ధి చెందుతోంది. భారతదేశాన్ని మించి పోయింది పారిశ్రామికాభివృద్ధిలో. కాని, గార్డియన్‌లో పడిన వ్యాసం చదివితే మనస్సు కలతచెందుతుంది. సావ్‌పాలోలో చీకటి పడిన




ప్రేమ్ సబ్బుతో స్నానం
రోజంతా ఉల్లాసం
మీ శరీరమునకు మృదుత్వమునిచ్చి సహజ
సౌందర్యమును పెంపొందించు సబ్బు ప్రేమ్.
దీని స్వచ్ఛమైన నురగ, పరిమళము
మీ మనసును పులకింపజేయును.
PREM
Prem
REFRESHING SOAP
గులాబి మరియు ఆకుపచ్చ
రంగులలో లభించును
Prem
జయలక్ష్మి
గుంటూరు వారి తయారీ
Imageads M-1783

న్యూఢిల్లీ లేఖ

తరువాత వీధులలోకి వెడితే ప్రాణాలకే ముప్పు రావచ్చు. అక్కడ విడాకులు బాగా పెరిగి పోయాయి. గృహచ్ఛిద్రాలు అధికం అవుతున్నాయి ఒక సావ్‌పాలో వీధిలో తమ పెద్దవారి చేత వదిలివెయ్యబడిన ఇద్దరు ఆడపిల్లల బొమ్మ ఒకటి గార్డియన్ ప్రచురించింది. వాళ్ల మొహాలని చూస్తే దిగులుగాఉంటుంది సావ్‌పాలోలో పోలీసు వాళ్లే బందిపోటు దొంగతనాలు చేస్తారుట ఇదంతా ఇలాగ జరుగుతూ ఉంటే ప్రభుత్వం వారు నిస్సహాయంగా చూస్తూ ఉండిపోతున్నారు బ్రెజిల్‌లో ప్రభుత్వానికి తగినంత ధనం లేదు అక్కడ ''నల్లధనం'' బేరాలే ఎక్కువ కాబట్టి పన్నులు కట్టేవారి సంఖ్య తక్కువ.

ఇలాంటి బ్రెజిల్‌నే ఒక ఆదర్శప్రాయమయిన దేశంగా వర్ణించేవాళ్ళు కొందరు. ఎమ్. ఆర్ మసానీ లాంటి వాళ్లు తైవాన్, సింగపూర్, బ్రెజిల్‌లని పొగడుతూనే ఉంటారు మూడూ పోలీసు రాజ్యాలే కాని మొదటి రెండింటి కన్నా మూడవది మరీ అన్యాయం తైవాన్‌లో, సింగపూర్‌లో ఒకేపార్టీ ఉంటుంది ఈ పార్టీ అన్ని పేచీలనీ అదుపులో పెడుతూ ఉంటుంది బ్రెజిల్ లోనూ ఇలాంటి ప్రయత్నమే జరుగుతోంది కాని అది మరీ పెద్దదేశం అక్కడ జనాన్ని అదుపులో ఉంచటం అంత తేలిక కాదు బ్రెజిల్‌లో విదేశాల వాళ్ల ప్రాబల్యం అధికం అక్కడ బహుళ జాతి సంస్థల ప్రాబల్యమూ ఎక్కువే విదేశీయులకీ, ఇటువంటి సంస్థలకీ బ్రెజిల్ మీద ఏమి అభిమానం ఉంటుంది ? వాళ్ల లాభాలు వాళ్లు చేసుకుంటారు దేశం ఏమయితే వాళ్లకి ఏమిటి ?

భారతదేశంలో నూ సావ్‌పాలో అవతరించింది. ఇక్కడ 11 వాణిజ్య సంస్థలు 26000 కోట్ల రూపాయల ప్రభుత్వ నిధుల మీద తమ అధికారం చెలాయిస్తున్నాయని పార్లమెంటులో ఈ మధ్యనే ప్రకటించబడింది ఇవి వివిధ యూరోపు దేశాలలో 25000 కోట్ల రూపాయలు రహస్యంగా బాంకులలో దాచుకున్నాయిట కాని, భారతదేశం 6000 కోట్ల రూపాయల అప్పుకోసం చిప్ప చేతిలో పట్టుకుని అంతర్జాతీయ ద్రవ్యనిధిని ఆశ్రయించవలసి వచ్చింది భారతదేశంలో వాణిజ్య సంస్థలని ప్రభుత్వం వారు అదుపులో ఉంచలేరు ఎందుకంటే, వాణిజ్య సంస్థలే ప్రభుత్వాన్ని అదుపులో ఉంచుతాయి అభివృద్ధి పేర మనం మనదేశాన్ని త్యాగం చేశాము ఇంకా మనకి బ్రెజిల్‌కి పట్టిన గతి పట్టలేదుకాని ఎంత నాగరికతకల సమాజమయినాసరే ఆ సమాజంయొక్క పాలకులలో నేరప్రవృత్తి ఏర్పడితే ఎంత కాలం నిలబడగలదు ? ఇక్కడా కొన్ని దుశ్శకునాలు గోచరిస్తూనే ఉన్నాయి ★

"అయ్యా శ్రీరామనవమి వచ్చే ఆదివారం నుంచి, ప్రతియేడులాగనే మీ చందా వెయ్యి నూటపదహార్లు రాసుకున్నాం. అది కాస్త యిప్పిస్తే" వినయంగా అన్నారు వచ్చిన పెద్దలు.

పెద్దరెడ్డి చుట్టపాయతీసి చుట్ట చుట్టి నోట్లో పెట్టుకొని కొస కొరికి తుపుక్కున ఊసాడు.

"సాయంకాలం కనపడండి యిస్తాను."

బుంగమీసాలు సవరించుకుంటూ అన్నాడు.

"ధర్మప్రభువులు, నాలుగు కాలాలపాటు చల్లగా వుండాలి. ఆ రోజు కళ్యాణంకూడా మీ చేతి మీదగనే, రాములోరి పెళ్ళి చేసేది మీరే" అన్నారు.

ఆయన ఛాతి ఉప్పొంగింది.

"వస్తాం రెడ్డిగారు" అని వచ్చిన పెద్దలు వెళ్ళిపోయారు.

పెద్దరెడ్డి ఆ వూరికి మకుటంలేని మహారాజు. వంద ఎకరాలపైన సుక్షేత్రమైన భూమి, ఓ డాబా యిల్లు వున్నాయి

ఊళ్ళో జరిగే జాతరల దగ్గర్నుంచి, కళ్యాణంవరకు ఆయన చేయి పడకుండా ఏది జరగదు. పెద్దరెడ్డికి ఊళ్ళో ఎదురులేదు

ఊరివాళ్ళందరు కల్సి ఆయన్ని ప్రెసిడెంటుగా నిలబడమంటే, "ముసలి వయస్సు నాకెందుగ్గాని, ఆ కట్టబెట్టే పదవేదో మా బామ్మర్దికి యివ్వండి" అన్నాడు.

పెద్దరెడ్డి బామ్మర్ది శంకర్రెడ్డి ఆ వూరి ప్రెసిడెంటయ్యాడు దేవుడన్నా,ఆయన ఉత్సవాలన్న పెద్దరెడ్డికి భయం, భక్తి ఎక్కువ పెద్దరెడ్డి చేయిలేకుండా ఏ రథం కదలదు ఏ దేవుడు ఉత్సవం బయల్దేరదు.

డబ్బు విషయాల్లో ఆయన కొంచెం కరుకు. వడ్డీలకు డబ్బును తిప్పి వంద ఎకరాలు సంపాదించాడు ఎవరికైనా ఎడ్డీకిస్తే వాడిపని అంతటితో సరి వాడి పొలమో, యిల్లో పెద్దరెడ్డి ఆస్తిలో కల్సిపోవాల్సిందే!

* * *

"రేయ్ ఈ చెక్కు తీసుకువెళ్ళి పట్నంలో బ్యాంకులో డబ్బు తీసుకురా" పెద్దరెడ్డి సంతకంపెట్టి చెక్కును శేఖర్‌కు యిచ్చాడు.

"రేయ్ సాయంకాలంలోపు రావాలి" అని అన్నాడు

"అలాగే నాన్నా" అని చెక్కు తీసుకొని జేబులో పెట్టుకొని బయటికి వచ్చాడు శేఖర్

వసరాలో రాఘవయ్యగారు కూర్చునివున్నారు రాఘవయ్యగారు చిన్నప్పుడు శేఖర్‌కు చదువు చెప్పిన మాస్టారు

మాస్టారుగార్ని చూడగానే,

"నమస్కారం మాస్టారుగారు ఎప్పుడొచ్చారు" అని అన్నాడు శేఖర్.



బొమ్మల పెళ్ళి

రాఘవయ్యగారు అరిగిపోయిన చెప్పులు, చిరిగిన చొక్కాకు అతుకులు, మురికిగావున్న పంచె. మనిషి దీనంగా వున్నారు.

''ఇప్పుడే బాబు. నాన్నగారు వున్నారా ?''

''వున్నారు యింతకు మీరేపనిమీద వచ్చారు ?'' అని ప్రశ్నించాడు.

రాఘవయ్యగారు యిబ్బందిగా కదిలారు. ఆయన్ని మళ్ళీ అడగటానికి మనస్కరించలేదు శేఖర్‌కు

''ఇంతకీ ఊర్నించి ఎప్పుడొచ్చావు బాబు?''

''వారం రోజులైంది ''

''పరీక్షలు బాగా రాసావా ?''

''రాసానండి ''

''బి ఎ చివరి సంవత్సరం కదూ.'

''అవునండి'' అని అన్నాడు శేఖర్.

యింతలో పెద్దరెడ్డిగారు వచ్చారు.

''ఏం పంతులు, యిలా వచ్చావు'' అన్నాడు గంభీరంగా.

''ఏరా, యింకా వెళ్ళలేదా'' అన్నాడు శేఖర్ వంక చూసి

''వెళుతున్నాను నాన్నా'' అని బయటికి కదిలాడు శేఖర్

రాఘవయ్యగార్ని చూడగనే శేఖర్‌కి పాత స్మృతులు గుర్తుకు వచ్చాయి.

స్కూల్లో పాఠం చదవక పోయినా, హోంవర్క్ చేయకపోయినా బెంచీ ఎక్కించేవారు. బెంచీ ఎక్కి పాఠం చదివి అప్పచెబితే కాని విడుదల లభించేది కాదు. ఒకోసారి పేము బెత్తంతో అరచేయి వెనక్కి తిప్పి కొట్టేవారు. శేఖర్ తట్టుకోలేక అప్పుడప్పు ఏడ్చేవాడు శేఖర్ యింట్లో సరిగా చదవటంలేదని మాస్టారు దగ్గరకు ప్రైవేటుకు పంపేవారు సాయంకాలం రాత్రి అక్కడే చదువుకోవటం. పిల్లలందరితో కల్సి లాంతర్ల వెలుగులో చదువుకోవటం అదో వింతగా వుండేది.

''ఎవ్వనిచే జనించు, జగమెవ్వని లోపల నుండు'' అని పద్యం చదువుతుంటే మాస్టారు గారి వీధి అంతా కళకళలాడుతూ వుండేది. రాఘవయ్యగారి ఒకగానొక్క కూతురు నిర్మల

''రేయ్ నిర్మల సరిగా చదువుతుందో లేదో చూస్తూవుండు'' అని మాస్టారు చెప్పేవారు మాస్టారు కనుమరుగు కాగానే జేబులోనుంచి ''అచ్చంగిల్లాలు'' తీసి ఆడుకొనేవాళ్ళు నిర్మల, శేఖర్ ఒక జట్టు. ఓసారి శేఖర్ ఆటలో ఓడిపోయి, కోపంతో నిర్మల తలమీద రపీ, రపీ మని మొట్టికాయలు మొట్టాడు నిర్మల బిగ్గరగా ఏడ్చింది

''మా అమ్మకదు, మా బుజ్జి కదూ, ఏడుపు ఆపితే నీకు 'పెన్ను'కొని పెడతాను'' అన్నాడు నిర్మల టక్కున ఆపేసింది.

నిర్మల ప్రస్తుతం ఏం చేస్తుందో !

ఎప్పుడో తొమ్మిదేళ్ళ క్రితం చూసాడు శేఖర్‌కు హైస్కూల్ చదువు పూర్తికాగానే కాలేజి కోసం పట్నం వెళ్ళిపోయాడు


ఏడోక్లాసుతో చదువు ఆపిన నిర్మలకు శేఖర్ పట్ల అభిమానం పోలేదు.

''అన్నయ్యా నాకు మెట్రిక్ కట్టాలని వుంది నాన్నేమో చదివించాలనుకుంటున్నాడు అమ్మ మాత్రం నాకు చదువొద్దని పోరుపెడుతుంది ఏం చెయ్యమంటావు'' అని ఉత్తరం వ్రాసింది.

అప్పుడు శేఖర్ యింటర్ సెకండ్ యియర్ చదువుతున్నాడు

''నిర్మలా నిజంగా చదువుకోవాలనుంటే ఆ డబ్బు నేను కడతాను ఇతరుల సాయం పొందుతున్నావు అని అనుకోవద్దు నన్ను పరాయి వాడిగా భావించవద్దు. మీ నాన్న నిన్ను చదివించ పోవటానికి కారణం నీకు తగ్గ భర్తను తీసుకు రాలేను అనే భయం నీ పేర ఫీజు నేనేకడతాను కనీసం మెట్రిక్ వరకైనా చదువు ఆ చదువు జీవితంలో దేనికైనా పనికి వస్తుంది''— నీ అన్నయ్య శేఖర్.

అప్పట్నుంచి నిర్మల శేఖర్‌కు ఉత్తరాలు రాసేది యింటి పరిస్థితి, తండ్రి ఆరోగ్యం, తన చదువు, అన్నీ శేఖర్‌కు వ్రాసేది కానీ గత మూడేళ్ళనుంచి నిర్మల ఉత్తరాలు రాయటం



ఆపేసింది. శేఖర్ నిర్మలను కలుద్దామని ఊర్లోకి వస్తే కనపడేది కాదు. ఎప్పుడు శేఖర్ యింటికి ఛెంగుఛెంగున వచ్చేది. ఎదురుపడినా తప్పుకొని పోవటం గనించేసరికి శేఖర్‌కు ఏమీ అర్థంకాలేదు

తరువాత అర్థం చేసుకున్నాడు.

అతనితో మాట్లాడితే లోకం మరోరకంగా భావిస్తుందని తెలుసుకున్నాడు నిర్మలలో అతని పట్ల అభిమానం గౌరవం ఏ మాత్రంతగ్గలేదు నిర్మల తెలివితేటలకు అభినందిచకుండా ఉండలేక పోయాడు.

*　　*　　*

డబ్బుతెచ్చి యిచ్చాడు శేఖర్.

పెద్దరెడ్డి లెక్కపెట్టుకొని బీరువాలో పెట్టాడు

"నాన్నా ఉదయం రాఘవయ్యగారువచ్చారు ఎందుకోసం" అని అడిగాడు.

పెద్దరెడ్డిగారు శేఖర్ వంక వింతగా చూసాడు పై కండువా దులుపుకొని జేబులో నుంచి పొగాకుపాయ తీశాడు

"ఆయన కూతురు పెళ్ళికి అప్పుకావాలట" చుట్టచుట్టి నోటితో కొస కొరికి తుపుక్కున ఊసాడు.

"మీరేమన్నారు."

"ఆ య న కు ఆస్థి, పాస్తి, లేదు పొమ్మన్నాను" పొగాకు చుట్ట నోట్లో పెట్టి అగ్గిపుల్ల వెలిగించారు.

"అదేమిటి నాన్నా ఆయనకు యిల్లుందిగా."

చుట్ట వెలిగించుకొని చిద్విలాసంగాచూస్తూ చిరునవ్వు నవ్వారు పెద్దరెడ్డిగారు

"ఆ యింటిమీద అప్పు పాపంలా పెరిగింది. రేపో, మాపో మన లెఖ్ఖలో రాయించేస్తాను" తాపీగా అన్నాడు.

"వెర్రి బ్రాహ్మడు, మనదగ్గరేవో రత్నాల రాసులున్నాయనుకుంటున్నాడు" చుట్టను తన్మయంగా పీలుస్తూ కుర్చీలో జారిగిలపడ్డాడు

శేఖర్‌కు గుండెల్లో కలుక్కుమంది. తండ్రి అలా ఖరాఖండిగా మాట్లాడటం బాధ కలిగించింది పాపం అందుకనేకాబోలు బిడయబడ్డారు రాఘవయ్యగారు తనతో చెప్పటానికి. నిర్మల పెళ్ళికి తండ్రి ఏ మాత్రం సాయం చెయ్యక పోవటం అమానుషంగా, దారుణంగా తోచింది శేఖర్‌కు.

"అయ్యా పెద్దరెడ్డిగారు" బయటనుంచి పిల్పు. శేఖర్ చూసాడు. ఉదయం శ్రీరామనవమి చందాకోసం వచ్చిన భక్తబృదం.

పెద్దరెడ్డిగారు లోపల్నుంచి వెయ్యి నూట పదహార్లు లెఖ్ఖపెట్టి బయటికి వచ్చారు

"ఇదిగో మీ చందా" జాగ్రత్తగా వాళ్ళకు అందించాడు.

శేఖర్‌కు రాఘవయ్యగారి దీనమైన ముఖం కళ్ళముందు కదిలింది. పెళ్ళికెదిగిన కూతురు గుండెలమీద కుంపటిలా వుంది

"బాబు, పదేళ్ళుగా ఈ వూళ్ళో రాముల వారి కళ్యాణం చేయిస్తున్న ధర్మప్రభువులు మీ వంశం పిల్లాపాపలతో ఆయురారోగ్య, ఐశ్వర్యాలతో కళ కళలాడుతూ వుండాలి" పెద్దరెడ్డిని దీవించారు భక్తబృందం

శేఖర్ చిన్నగా నవ్వుకున్నాడు

శ్రీరామ కళ్యాణానికి వెయ్యి నూట పదహార్లు యిచ్చిన తండ్రి, ఓ పేద బ్రాహ్మడి కూతురు పెళ్ళికి దమ్మిడీ రాల్చలేదు. ఎంత విచిత్రం ! ప్రాణంలేని బొమ్మలకు పెళ్ళిళ్ళు !

ప్రాణంవున్న బొమ్మలకు చావు బాజాలు !

అప్రయత్నంగా అతని కంట కన్నీరు తిరిగింది.

*　　*　　*

"మాస్టారుగారు, మాస్టారుగారు" శేఖర్ పిల్చాడు.

"ఎవరూ" లోపల్నుంచి నిర్మల బయటికి వచ్చింది.

శేఖర్ ఆమె వంక విచిత్రంగా చూసాడు. నిర్మల చాలా మారిపోయింది. పెద్దెనిమిదేళ్ళ యవ్వనం, కుటుంబ బాధ్యతలు ఆమెకో పెద్దరికాన్ని తెచ్చిపెట్టాయి

"నిర్మలా" అన్నాడు ఉద్వేగంగా.

"ఎవ్వరూ" అని పరీక్షగా చూసి—

"శేఖరన్నయ్యా, చాలా మారిపోయావు" అంది. అన్నయ్యను చూడగానే ఆమె కళ్ళు మెరిసాయి

"లోపలికిరా, ఎన్నాళ్ళయిందో నిన్ను చూసి" గబగబ వెళ్ళి కుర్చీవేసింది శేఖర్ కుర్చీలో కూర్చున్నాడు. నిర్మలను చూడగానే అతనికి ఆనందంగా వుంది

"ఏం ఏమిటే, నీ పెళ్ళి అని విన్నాను నిజమేనా ?"

"ఫో, అన్నయ్య" అని సిగ్గుపడింది

"నాతో చెప్పలేదు మీ నాన్న"

"నాన్నగారు నాకూ చెప్పలేదు నువ్వు కలిసావని" అంది.

"నాకు చెప్పినట్లయితే ఏదో సహాయం దొరికేది."

నిర్మల మౌనంగా టేబుల్ మీదున్న పుస్తకాన్ని తిరగేస్తూ నిలబడింది ఇతరుల సహాయ సహకారాలు పొందే స్థితిలో వున్నందుకు ఆమె బాధపడింది

"ఏం నిర్మల మాట్లాడవు

మీ నాన్నగారు ఉదయం మా నాన్నగార్ని కలిసారు"

"మీ మాన్నగారు డబ్బులు యివ్వనని చెప్పారు, నాన్నొచ్చి అన్నం తినకుండా పడుకున్నారు" చటుక్కున వెనక్కి తిరిగింది ఆమె కళ్ళల్లో కన్నీళ్ళు

"నాన్నకు, ఈ యింటికి, చెప్పలేని అనుబంధం, నా కోసం ఈ యిల్లు అమ్మేద్దామనుకున్నారు. కానీ, కానీ . మీ నాన్నగారు నాన్నకు ఆ ఆశకూడా లేకుండా చేసారు. కుదుర్చుకున్న పెళ్ళి పురుటిలోనే సంధికొట్టింది" ఆమె చెంపలమీద నుంచి కన్నీళ్ళు జారి పోతున్నాయి.

"అన్నయ్యా, నాన్నతో చెప్పేస్తాను నాకు పెళ్ళి వద్దని, లేకనేతే నాన్న పిచ్చివాడైపోతాడు నా పెళ్ళికాక, యిల్లులేక నాన్న చిత్రవధ అను

భవిస్తున్నాడు'' నిర్మల కంఠం దుఃఖంతో పూడుకుపోయింది.

''వరుడెవరు నిర్మలా ?''

''రామాపురంలో పూజారి, ఆయన కూడా పేదవాడే. కట్నం అడక్కపోయినా పెళ్ళి జరిగితే చాలు అనుకుంటున్నాడు నాన్న. పాపం కనీసం నా పెళ్ళి చూసే అదృష్టం లేదు నాన్నకి'' బాధగా అంది. చెంపలమీద జారుతున్న కన్నీళ్ళను తుడుచుకుంది

''నిర్మలా, మీ నాన్నగార్ని పిలువు'' అన్నాడు శేఖర్.

నిర్మల లోపలికి వెళ్ళింది

శేఖర్ యింటి వంక చూశాడు సున్నంలేక గోడలు పెచ్చులూడిపోతున్నాయి. కప్పుకి వేసిన బంగాళా పెంకు అక్కడక్కడా పగిలిపోయింది. నేడో, రేపో కూలిపోవటానికి సిద్ధంగా వున్న కొంపలా వుంది.

రాఘవయ్యగారు వచ్చారు.

''బాబు శేఖర్ నువ్వా! ఏమిటి బాబు ''

అప్పుడే లేచినట్లున్నారు కాబోలు. ముఖం కడుక్కొని వచ్చి పడక్కుర్చీలో కూర్చున్నారు. కుర్చీ భారంగా మూల్గింది.

''పెళ్ళి ఎప్పుడు నిశ్చయం చేసారు మాస్టారు.'' సూటిగా అడిగాడు శేఖర్.

రాఘవయ్యగారి కళ్ళల్లో అవ్యక్తమైన బాధ కన్పించింది. అది కనపడకుండా చూపు మరో వైపు తిప్పారు.

''నవమి వెళ్ళిన మూడోరోజున పెళ్ళి అని లగ్నపత్రిక రాయించాం'' అని అన్నారు

''నాన్నగారు డబ్బేమైనా యిచ్చారా మాస్టారు.''

ఆయన తలెత్తాడు. అనుభవాలను ప్రోది చేసుకున్న నుదురు బాధతో ముడుచుకున్నారు

''లేదు బాబు''

''నాన్నగారేమన్నారు ''

''పూర్వపు బాకీలకు యిల్లు తనఖాకి తీసుకున్నారు. దానితాలుకు మిగులు ఓ రెండు వందలు యిచ్చారు ''

''ఇల్లు తన పేర రాయించుకుంటాడు, అంతేనా'' ఆవేశంగా అన్నాడు శేఖర్.

ఆయన అంత బాధలోను చిరునవ్వు నవ్వారు

''బాబు నువ్వు చిన్నవాడివి, నీకు యింకా అనుభవం రాలేదు. ఈ విషయంలో నాన్నగార్ని ఏమీ అనకు'' అన్నారు.

ఆయన ఔదార్యానికి శేఖర్‌కు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి

''మాస్టారు, పెళ్ళి కెంత కావాలి.''

''నీకెందుకు బాబు మా తిప్పలేవో మేం పడతాం'' బాధగా అన్నాడు ఆయన

''కాదు మాస్టారు. చెప్పండి.''

బొమ్మల పెళ్ళి

''ఓ వెయ్యి రూపాయిలైతే ఈ పేదవాడింట్లో ఓ పెళ్ళి జరిగిపోతుంది.''

నిర్మల కాఫీ తీసుకువచ్చి యిచ్చింది. శేఖర్ కాఫీ తీసుకున్నాడు

రాఘవయ్యగారి పరిస్థితి శేఖర్ని కలిచి వేసింది.

ఈ దేశంలో ఓ సామాన్యుడు తన కూతురు పెళ్ళి చేయాలంటే యిల్లు అమ్ముకొని నిరాశ్రయుడు కావటమో, అప్పులపాలవ్వటమో జరుగుతుంది.

''మాస్టారు పెళ్ళి నవమినాడు జరిగినా అభ్యంతరంలేదుగా.''

''ఏం బాబు'' అనుమానంగా అడిగారు

''నేనా డబ్బు సర్దుతాను మాస్టారు, కానీ పెళ్ళి నవమినాడు చెయ్యాలి.'' శేఖర్‌లో ఓ నిర్ణయం స్థిరంగా రూపుదాల్చింది

రాఘవయ్యగారు యిబ్బందిగా చూసాడు

''మాష్టారు మీకో పెద్దకొడుకుంటే తన చెల్లెలు పెళ్ళి కోసం కష్టపడడా ?'' అని అన్నాడు శేఖర్.

రాఘవయ్యగారు ముఖంలో సంతృప్తి చోటు చేసుకుంది

* * *

''నాన్న ఈ సంవత్సరం నేను శ్రీరామ కల్యాణం చేయిస్తున్నాను నాకు మొదట నీ చందా వెయ్యాలి'' అన్నాడు శేఖర్

కొడుకువంక విస్మయంగా చూసాడు పెద్దిరెడ్డి.

''మనవూరిలో చాల సంవత్సరాలనుంచి ఒకే పందిరిలో శ్రీరామ కల్యాణం జరిగింది ఈ సంవత్సరం మంచి నా రెండో పందిరిలో కూడా శ్రీరామ కల్యాణం జరుగుతుంది'' అన్నాడు శేఖర్

''ఉన్న ఆ ఒక్కటే చాలురా.''

''ఊరు పెరిగింది, నీ ప్రెస్టేజీ పెరిగింది ఈ ఊరికి ఇంకో పందిరి కూడా వుంటే నీ ప్రెస్టేజీ ఎంత పెరుగుతుందో తెలుసా నాన్నా'' అన్నాడు

పెద్దరెడ్డి సుముఖుడు కాలేదు.

''దేవుడు నాన్నా! దేవుడు కళ్యాణం రెండు చోట్ల చేయిస్తే మన ఆదాయం రెట్టింపవుతుంది.'' పెద్దిరెడ్డిని ఎక్కడ కొట్టాలో అక్కడ కొట్టాడు

కొడుక్కి మాటపదహార్లివ్వబోయాడు

''నీ ప్రెస్టేజీకి కనీసం అర్ధ వెయ్యిమాట పదహార్లు యివ్వాలి'' పెద్దరెడ్డి యిచ్చాడు. శేఖర్ సరాసరి మావయ్య శంకర్రెడ్డి దగ్గరకు వెళ్ళాడు

''మావయ్య, నువ్వు ఈవూరికి ప్రెసిడెంటువు. మా నాన్న ఓ పెద్ద పందిరిలో కళ్యాణం చేయిస్తే కనీసం నువ్వు మరో పందిరిలో నన్నా కళ్యాణం చేయించాలి'' అన్నాడు

శంకర్రెడ్డి దగ్గర ఒక అర్ధ వెయ్యిమాట పదహార్లు ! సర్పంచుల దగ్గిర మాటపదహార్లు చొప్పున వసూలు చేశాడు చిన్నచిన్న కుర్రాళ్ళకు ''శ్రీరామ నవమి చందా'' అని రాసిన డబ్బాలిచ్చి ప్రజల దగ్గర చందా వసూలు చేసాడు.

డబ్బు బాగానే పోగయింది. శేఖర్ సంతృప్తి పడ్డాడు. ఊరంతా సంబరంగా వుంది. రెండో రోజు ఆదివారం ఊర్లో పెద్ద పందిరి అప్పటికే తయారైంది.

రామాలయం మంచి వీధివరకు చాలా పొడుగు వుంది పందిరి. ట్యూబ్ లైట్లు, మైకులు, సినిమాపాటలు అన్నీ సిద్ధమయ్యాయి.

అట్టహాసం, రంగుల లైట్లు, ఆ ఊర్లో శ్రీరామనవమి తొమ్మిది రోజులు చేస్తారు డ్రామాలు, హరికథలు, చివరిరోజు సిన్మాతో మంగళహారతి పాడేస్తారు

శేఖర్ పందిరి మాస్టారుగారి యింటి ముందు వేసాడు అది సగం వీధిని ఆక్రమించింది ఆ రెండో పందిరి ఊళ్ళో చాలా మందిని ఆకర్షించింది

పందిరికి మామిడి తోరణాలు కట్టారు

మాస్టారుగారి గడపలకు పసుపు రాసారు ఇల్లంతా సున్నం కొట్టించారు అందరి ముఖాల్లో సంతోషం తాండవిస్తోంది

తెల్లవారితే శ్రీరామ కళ్యాణం

శేఖర్‌కు సంతృప్తిగా వుంది

తాను అనుకున్నది సగం సాధించాడు మిగతా సగంకూడా సక్రమంగా జరిగితే నిర్మల ఓ యింటిదవుతుంది

ఆ రాత్రి పెద్దరెడ్డి శేఖర్ని అడిగారు

''ఆ పందిరి మాస్టారిగారి యింటిముందు ఎందుకు వేయించావు ''

''అంతకన్నా మంచివీధి ఈ వూర్లోలేదు'' అని కరుకుగా సమాధానమిచ్చాడు. విస్మయంగా కొడుకువంక చూసాడు పెద్దరెడ్డి ఆయనకు కొడుకు ప్రవర్తన విచిత్రంగా అన్పించింది

శేఖర్ ఆ రాత్రంతా అలంకరణలు చేస్తున్నాడు పందిరి చాలా అందంగా, అద్భుతంగా తయారైంది

* * *

శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుడి విగ్రహాలు అలంకరించి వున్నాయి వివాహవేదిక రంగు రంగుల కాయితాలతో అలంకరింపబడి క్రొత్త శోభలీనుతోంది ఆ వివాహ వేదికకు ప్రక్కనేవున్న చిన్న మందిరంలో విగ్రహాలు వున్నాయి

పురోహితుడు మంత్రాలు చదువుతున్నాడు!

నిర్మల పెళ్ళికూతురు దుస్తుల్లో పీటల మీద కూర్చోనివున్నది ఆమె ప్రక్కనే వరుడు పెళ్ళి దుస్తుల్లో ఆసీనుడై వున్నాడు

శేఖర్ ఓ ప్రక్కగా నిలబడి ఆ దృశ్యాన్ని చూస్తున్నాడు.

క్రింద అంతా పిల్లలు కూచునివున్నారు రాఘవయ్యగారి కళ్ళల్లో కోటి వెలుగులు

శంకర్రెడ్డి గబగబ అక్కడకు వచ్చాడు. ఆయన వెనక సర్పంచులు, ఆ వూరి ప్రజలు వచ్చారు.

వివాహ వేదికను చూసేసరికి ఆయన నిప్పు తొక్కిన కోతిలా లేచాడు.

"ఒరేయ్ శేఖర్ ఏమిట్రా యిది, మమ్మల్ని పిల్చి యిలా అవమానం చేస్తావా ?"

"ఏం చేసాను మామయ్యా, యివాళ కళ్యాణం వుంది. నువ్వు దగ్గరుండి చేయించమని అడిగాను అంతేగా" అన్నాడు తాపీగా. ఆయన కోపం తారాస్థాయి నందుకుంది.

"తెలుసులేవోయ్. పవిత్రమైన దేవుడి పెళ్ళిలో ఈ పనేమిటి ? యిందుకనేనా మా దగ్గర నువ్వు చందాలు తీసుకుంది."

"మామయ్యా, కొంచెం ప్రశాంతంగా మాట్లాడు"

"ఎవరో దారినపోయే దానయ్యల పెళ్ళి చేయటానికి నీకేవన్నా లక్షలున్నాయా ! అయినా ప్రజల డబ్బుతో ఆ పని చేయటానికి నీకు సిగ్గులేదు ఏం మీరు మాట్లాడరు" అన్నాడు తన వెనక వున్న సర్పంచుల నుద్దేశించి.

"అవును. అవును మా డబ్బుతో దిక్కుమాలిన వాళ్ళ పెళ్ళి చెయ్యటానికి నీకు సిగ్గులేదు" ఆవేశంగా అన్నారు వాళ్ళు.

"ఈ పెళ్ళి జరగటానికి వీల్లేదు" ముక్తకంఠంతో అన్నారు.

"ఏం, ఎందుకు జరగటానికి వీల్లేదు. శ్రీరాముడు, సీతా భార్యాభర్తలు. వీళ్ళిద్దరి పెళ్ళి ఎప్పుడో కృతయుగంలోనే జరిగిపోయింది అప్పట్నుంచి వాళ్ళ బొమ్మల్ని పెట్టి మనం బొమ్మల పెళ్ళిళ్ళు చేస్తున్నాం, వడపప్పు తింటున్నాం పానకం తాగుతున్నాం చిన్నపిల్లలు చిన్న చిన్న బొమ్మలతో లక్కపిడతలతో గుప్పెడు శనగలతో బొమ్మల పెళ్ళిళ్ళు చేసుకుంటారు వాళ్ళకు మనకు తేడా ఏమిటి ? ఈ దేశంలో ఆడపిల్లల తల్లిదండ్రులు పెళ్ళికెదిగిన కూతుళ్ళ పెళ్ళిళ్ళు చెయ్యలేక మరణించేవాళ్ళు ఎంతమందో! పెళ్ళిచేసి బిచ్చగాళ్ళైపోయిన వాళ్ళెందరో! వాళ్ళందర్ని మర్చిపోయి, మనం లక్షలకొద్దీ ధనాన్ని శ్రీరామ కళ్యాణం పేరిట వృథా చేస్తుంటే ఆ రాముడు సంతోషిస్తాడా ? ఎందరో స్త్రీలు పెళ్ళికాక పతితలుగా, భ్రష్టులుగా మారుతుంటే ఆ సీతమ్మ తల్లి సంతోషిస్తుందా ?"

అందరూ మౌనంగా వింటున్నారు

"శ్రీరామ కళ్యాణం రోజున ఓ పేదవాడి కూతురు పెళ్ళి తన పందిట్లో తన పేరుమీద జరిగిందంటే ఆ భగవంతుడికి అంతకన్నా కావల్సిందేవుంది బొమ్మలపెళ్ళి చేసే పని మనస్సును దాటి వచ్చేసాం ! అంతగా ఆ కోర్కెవుంటే ప్రాణం వున్న బొమ్మలకు పెళ్ళిచేయండి అదే శ్రీరామ కళ్యాణం చేయించినంత ఫలం. అంతేకాని ధనాన్ని మాత్రం వృథా చేయవద్దు." శేఖర్ ఉద్వేగంగా అన్నాడు.

శేఖర్ అన్న మాటల్లోని సత్యం అక్కడకు వచ్చిన పెద్ద మనుషుల బుర్రలోకి చొరబడింది శేఖర్ పని సబబుగానే కన్పించింది

అందరి ముఖాల్లోని ప్రశాంతతను చూసి శంకర్రెడ్డి లాభంలేదు అనికొని ముందుకు వచ్చి అభినందిస్తున్నట్లు శేఖర్ భుజం చరిచారు


రాఘవయ్యగారి కళ్ళల్లో కొత్త వెలుగు వచ్చింది.

"భజంత్రీలు వాయించండి" అన్నాడు పురోహితుడు

"మాంగల్యం తంతు నా మే మమజీవన హేతునా."

మంత్రాలు వినపడుతుండగా, శేఖర్ చేతిలో ఎవరో అక్షతలు వుంచారు ★

ఇవేమన పద్యాలు




కులమువలన కొంత బలమువలన కొంత
తలిమివలన కొంత గర్వమునను
పెంతె చదువు చదివి మంకులైపోదురు
విశ్వదాభిరామ వినుర వేమ.

వ్యక్తిగతం



శ్రీమతి శాలినీ తాయి ఇటీవలే లోక్‌సభకి ఎన్నిక అయ్యారు ఆమె తరచు బెంగుళూరుకు వెళ్లివస్తూ ఉంటారుట ఎందుకు?

శ్రీ హెగ్డేని ముఖ్యమంత్రి పదవినుంచి తొలగించటానికా?



మహారాష్ట్ర ముఖ్యమంత్రి సతీమణి (ఆమె పార్లమెంటు సభ్యురాలుకూడా) శ్రీమతి శాలినీ తాయి ఇటీవలే బెంగుళూరు వెళ్లారు ఎందుకో సరిగ్గా తెలియటంలేదుకాని ఆమె దిగిన 5 చుక్కల హోటలు గదులు ఇంకొకరి పేర బుక్ అయ్యాయట, ఆ గదులమీద ఆదాయప్పన్నువారు దాడి చేశారుట అయితే, కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ కె హెచ్ పాటిల్ అప్పుడు అక్కడికి వచ్చి దాడి చేస్తున్న అధికారులని బెదిరించి పంపివేశారుట ఇంకొక విచిత్రం ఏమిటంటే, దాడికోసం అధికారులు తీసుకున్న 'సోదా పత్రం' శ్రీ గిద్వానీ అనే ఆయనపేర ఉందిట



కలకత్తాలోని బిర్లా సంస్థ ఒకదాని జనరల్ మేనేజరు శ్రీ ఎస్ కె జైన్ హత్య కేసులో భయంకరమైన నేరస్థుడు సమద్ ఖాన్‌ని అనుమానంపై పోలీసులు అరెస్టు చేశారు ఇతడు బొంబాయిలోని కిరాయిగూండాల నాయకుడు కరీమ్‌లాలా మేనల్లుడు హత్యలు, మానభంగాలు, మనుషులని ఎత్తుకుపోవడం వంటి అనేక దారుణమైన నేరాలలో నిందితుడు వయసు 27 సంవత్సరాలు.

వారఫలం

17-2-1984 శుక్రవారం మొదలు 23-2-1984 గురువారం వరకు

♈ మేషం: గ్రహ గతులందు కొన్ని మార్పులు వచ్చాయి. అవి మీకు అనుకూలం. వస్తు విక్రేతలకు అనుకూలవారం కథారచయితలకు, పత్రికాధినేతలకు లాభించే మార్గాలు అవసరంగా కనిపిస్తాయి, స్త్రీలకు ఉద్యోగాన్వేషణ ఫలిస్తుంది. శ్రమించటం అవసరమే.

♉ వృషభం: అధికారుల ద్వారా జరుగవలసిన పనులున్నా ధనికుల నుండి పొందతగిన సహాయం ఉన్నా, కళా సాహిత్య రంగాలలో రావలసిన అవకాశాలు ఉన్నా, ఈవారం చాలమందికి సత్ఫలదాయకాలు కానున్నవి. స్త్రీలకు రచనా వ్యాసంగం ఫలించటం తద్వారా లాభదాయకం కావటం గమనిస్తారు

♊ మిథునం: కొందరకు కోర్టు వ్యవహారాలలో యిబ్బందులు కలగటం గమనించనున్నారు. వృత్తిలో గాని వ్యాపారమందు గాని ఎగుడు దిగుడు పర్శితులుంటాయి, గమనించండి. క్రయవిక్రయాలందు యథాతథంగా సంపాదించే లాభానికి యిబ్బంది రాదు. స్త్రీలకు నూతనాంశాలు గ్రహించుటకు, నూతన మిత్రులను కలిసికొనుటకు అవకాశమున్నది.

♋ కర్కాటకం: ధనాదాయం ఆశించిన విధంగా అవసరాలకు అందటం, అటంకాలు లేకుండా అన్ని వ్యవహారాలు సాగిపోవటం ఆదరించవలసిన వారిని ఆదరించుటను అనువుగా నెరవేరే వారం చాలమందికి ప్రయాణాలు చెప్పవచ్చు. కాని దూర ప్రాంతాలకు పయనించటం ఏమంత శ్రేయస్కరంగాదు స్త్రీలకు వ్యవహార విజయం, ఆనందం, విందు వినోద కార్యక్రమాలలో నిమగ్నులు కాగలరు

♌ సింహం. ప్రజ్ఞ రాణించే సన్నివేశాలు చేజిక్కించుకొంటారు అనవసరంగా ధనం వెచ్చింపవలసిన అవసరాలు కూడా ఏర్పడుతవి. వ్యాపారం బాహాటంగా జరిగే అవకాశం కూడా ఈవారం లేకపోలేదు. స్త్రీలకు ఉద్యోగమందు చెప్పదగిన అభివృద్ధి చేకూరటం నిశ్చయం

♍ కన్య: నూతనాంశాలు గ్రహించి నూతన మార్గాన ధనాదాయం సమకూర్చుకోగలుగుతారు. కొందరు విదేశ పర్యటనకు కావలసిన ధనం చేకూర్చుకొనుటకు యత్నిస్తారు సభా కార్యక్రమంలో కొందరు పాలు పంచుకోవటం కూడా సంభవమే. స్త్రీలకు చాల కాలంగా యత్నించి మానుకొన్న వ్యవహారం తిరుగ తోడి కాని సానుకూలం చేసికోగలుగుతారు. ధనలబ్ధికి అవకాశమున్నది

♎ తుల. అధికార వర్గం వలన జరుగదగిన

పనులున్నా, రాజ్యాంగరీత్యా జరుగవలసిన వ్యవహారాలున్నా మీకు అనుకూలంగా నెరవేరగలవు విందు వినోదాలలో కొందరు, కళా సాహితీ రంగాలలో కొందరు నిమగ్నులయ్యే అవకాశాలున్నాయి. వ్యాపారం గాని, వ్యవహారం గాని మీకు అనుకూలమే స్త్రీలకు నూతన మార్గాన ఆదాయం చేకూరుతుంది.

♏ వృశ్చికం: ఆదాయానికి లోపం లేని వారం. అలాగే అనుకొన్న దానికన్నా అధికంగా వ్యయించుట కూడా తప్పనిసరి అయి పోతుంది. పత్రికా రచనా, ప్రకటనలందు చాలమందికి ఉపయోగకరములయిన మార్పులుండగలవు. శుభకార్యాన్వేషణమున కొందరు నిమగ్నులు కాగల అవకాశాలుంటాయి స్త్రీలకు. ఆశించిన 'ప్రమోషన్ లభ్యం కాగలదు.

♐ ధనుస్సు గ్రహించండి. అనుకోకుండా బంధుమిత్రులు యిల్లు చేరగలరు విశేషం ఏమిటంటే, చాల కాలంగా విభేదాలతో యింటికి రాని మిత్రులు హటాత్తుగా యిల్లుచేరనున్నారు. ఉత్తమ కళాకారులకు ఉపయోగకరములయిన మార్పులు రాగలవు స్త్రీలకు. సాటివారిలో పేరు ప్రతిష్ఠలు తెచ్చుకోవటం, రచనా విధానాన ధనాదాయం సాధ్యం.

♑ మకరం: ఆదాయానికి లోపం రాదు అధిక విలువగల వస్తువులు సమకూర్చుకొనే అవకాశమున్నది కొందరకు 'వాహన మార్పిడి' ప్రత్యేకంగా చెప్పదగిన అంశం. స్త్రీలకు శ్రద్ధాసక్తులు సర్వవిధాలా లాభదాయకం. ప్రయాణానుకూలత కొందర విషయంలో చెప్పదగిన ముఖ్యాంశం

♒ కుంభం: ఓర్పుతో, చాకచక్యంతో, నిబ్బరంతో ఒకానొక విషయంలో అనుకూలత సాధింపగలరు. ఉద్యోగ వృత్తులందు లాభించే మార్గముంటుంది. రాజకీయంగా మేలు చేకూరుట కూడా కొందరు గమనిస్తారు స్త్రీలకు ధనలబ్ధి, వస్తు సేకరణ, విందు వినోద కార్యక్రమానుకూలత చేకూరగలదు

♓ మీనం. ధనాదాయం సంభవించటం వృత్తిలో పెంపు, ప్రయాణాల్లో అనుకూలత శుభ సంబంధ వార్తలను గూర్చిన చర్చలు అనుకూలంగా పరిణమించగలవారం స్త్రీలకు గృహ సంబంధ కార్యకలాపాలందు చెప్పదగిన ముఖ్యాంశం.

—విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి•

సీరియల్

యక్షగానం

స్వర్గీయ

శ్రీమతి మాదిరెడ్డి సులోచన

అతనికి వివాహమయిన రోజే, భార్యను వదలి రావటం చాలా బాధగా ఉంది. అయినా భవిష్యత్తు ఊహిస్తే ఈ వియోగం పెద్దదేం కాదు.

అతనా రాత్రి కష్టపడి అక్కడి వర్కర్స్ దగ్గర ఫారిన్ విస్కీ సంపాదించాడు. అది తీసుకుని, జీడిపప్పు తీసుకుని వచ్చాడు.

చైనులు కూతురు వచ్చింది ఆ అమ్మాయి ఆదిత్యను శల్యపరీక్ష చేసింది

''తీసుకోండిమామయ్యా! పని దొరక్కపోతే నేను దొంగతనం చేసేవాడిని . '' అన్నాడు, లిక్కర్ అతని చేతిలో పెట్టి

''చూచావా అమ్మడూ .'' కూతురు వైపు గర్వంగా చూచాడు మరో గంటకు అతని ముఖం ఎఱ్ఱబడింది, త్రాగటం వల్ల.

''ఆదిత్యా! యు ఆర్ గ్రేట్ నాకు నచ్చావు ఆ రాక్షసి, రాయుడుగాడు నీ గురించి ఏమేమో అన్నారు . వెధవలు '' అన్నాడు

''ఏమన్నారు మామయ్యా!'' కసిని మింగి, ఆప్యాయతను ఒలకబోస్తూ.

''యు డోంట్ వర్రీ! వాళ్ల మాటలు

(గత సంచిక తరువాయి)

ఎవరు వింటారు అమ్మడు నా మొదటి భార్య కూతురు . ఆఁ . అందుకే నా రెండవ భార్యకు కోపం. ముకుంద . . షి ఈజ్ గ్రేట్. ఏ మాటకా మాటే చెప్పకోవాలి'' అన్నాడు ఏదో లోకాలకు తేలిపోతూ

''ఏం మంచి ఏం మంచి అయ్యా నన్ను పోలీసులకు పట్టించింది ''

''ఏదో కోపం ఉండి ఉంటుంది నాకు తెలుసు పాపం నందనరావుతో ఏం సుఖ పడింది నేనయినా ఇవ్వాలనుకుంటే పాపం దేవత అయింది ఈ దేవత, ఈ దేవుడి సంగతులు మీకు తెలియదు అంతా ఇంతే పెద్ద స్మగ్లర్ పట్టుబడి దేవుడవుతాడు తప్పు చేస్తూ పట్టుబడితే అమ్మలవుతారు'' అతను చెబుతూపోతున్నాడు

ఆదిత్య ఆలోచించాడు అతను ఎంత తాగినా తనపై ఓ కన్నేసి ఉంచుతాడు త్వరపడాలి. చైనులు పట్టుబడితే అందరూ దొరుకుతారు. కాని పోలీసులకు రిపోర్ట్ ఇచ్చేదెలా!

''అబ్బాయ్ ఉత్తరం రాసేపాటి స్నేహితులెవరున్నారు ?''

పిడుగులాంటి ప్రశ్న! నిజంగా తనను అన్నివేళలా గమనిస్తున్నాడు అవును లేనిదే చైనులు ముకుందాదేవిచేత అంతపెద్ద నాటకం యెలా ఆడించేవాడు!

''అది కాదు మామయ్యా! డాక్టర్ శివాజి దగ్గర పనిచేసాను ఆయన డబ్బిచ్చాడు అతనికి డబ్బిస్తానని వ్రాయవద్దా!''

''అంతేనా!''

''మీలానే అతను మంచివాడు. .''

''నాతో పోల్చకు అతను కూతుర్నిచ్చాడా!''

''నిజమే ''

చైనులు వెయ్యిరూపాయలు తెచ్చి ఆదిత్య పైకి విసిరాడు

''ఇంకా ఏమేమి అప్పులున్నాయో తీర్చివెయ్యి'' అన్నాడు

''అలాగే'' అన్నాడు అతను నిదుర బోయాక ఆలోచించాడు ఫ్యాక్టరీలో ప్రతి చోట తనపై నిఘా వేసే ఉంటాడు యెలా శివాజికి తెలిపేది! మర్నాడు ఫ్యాక్టరీకి వెళ్లేసరికి, ఫ్యాక్టరీ యజమాని నిప్పులు కక్కుతున్నాడు. అతని క్లర్క్ రాలేదుట

''ఇప్పుడు సామర్లకోట వెళ్లాలి, యెలా '' ఆయన గొణుక్కున్నాడు

''మీ కభ్యంతరం లేకపోతే నేనొస్తాను సర్ '' అన్నాడు ఆదిత్య

''వీరాస్వామీ! ఆ ఫైలు ఆదిత్యకు ఇవ్వు'' అన్నాడు అయిదు నిముషాలకు కారు కదిలింది వెనుక సీట్లో యజమాని ప్రసాదరావు కూర్చున్నాడు ముందు డ్రైవర్ ప్రక్కన ఆదిత్య కూర్చున్నాడు

అక్కడ ప్రసాదరావుకు బంగళా ఉంది. అక్కడ దిగారు.

''నేను కొంచెం ఊర్లోకి వెళ్లివస్తాను నువ్వు విశ్రాంతి తీసుకో ''

జరిగిన కథ — 16 : ఆదిత్య, నీలిమలకు తను విద్యార్థి జీవితంలో అనుభవించిన కష్టాలను చెపుతాడు డాక్టరు శివాజి. యువ తరంగిణి ప్రోగ్రాం నుంచి ఇంటికి వచ్చిన నీలిమ శివాజికి, తన తల్లికి గల అక్రమ సంబంధాన్ని తెలుసుకొని తల్లిని అసహ్యించుకొంటుంది తన ఉనికినే అసహ్యించుకొనే తండ్రి ప్రవర్తనకు బాధపడుతుంది నీలిమ నీలిమను నందనరావు అనరాని మాటలంటుండగా ఆదిత్య వింటాడు ఆదిత్య, నీలిమల పెళ్లి జరుగుతుంది ఆ రోజే నందనరావు ఆత్మహత్యకు పాల్పడతాడు. తండ్రి జేబులో తల్లి తనకు రాసిన జాబుని విప్పి చదవసాగింది నీలిమ ముకుందాదేవికి చక్రధర్ వల్ల నీలిమ పుట్టింది. నందనరావు కూతురి జననానికి ఆనందిస్తాడు వ్యాపారం నిమిత్తం ఊరు వెళ్లిన నందనరావు యాక్సిడెంటుకు గురవుతాడు తరువాత ముకుందాదేవి శ్రీకృష్ణపరమాత్మ అవతారం దాల్చింది చనిపోయిన నందనరావ్ అంత్యక్రియలు ఆదిత్యచేత జరిపిస్తుంది నీలిమ తన తల్లిని భార్యగా తెచ్చుకోమని శివాజిని కోరుతుంది నీలిమ అతను దానికి సంతోషంగా అంగీకరిస్తాడు చైనులు ఉన్న తీరునుబట్టి అతనే ముకుందాదేవి ఇంట్లో దొంగతనం చేసి ఉంటాడని నిర్ణయించుకున్నాడు ఆదిత్య అతనిని మంచి చేసుకొని ఫ్యాక్టరీలో ఉద్యోగం సంపాదించుకుంటాడు.

''కార్లోనే వచ్చాను విశ్రాంతి దేనికి సర్!''


''ఏదయినా చదువుకో .'' అని అతను వెళ్లిపోయాడు

అక్కడున్న పనివాడు పక, పక నవ్వాడు.

''ఏటి బాబూ! కొత్తగా వచ్చేవేమిటి! అయ్యగారిక్కడ రెండో పేమిలీ చెటప్పు చేసాడు ఆడికెళ్తుంటే వేరెవర్ని కూడా వద్దంటరు ''


''మరి నాకేం తెలుసు.''

''తెలియని విషయాలు నన్ను అడుగుతుండు... చెప్తాను.'' అతను రీవిగా చెప్పాడు.



''మంచిది '' వార పత్రిక తీసుకుని కూర్చున్నాడు

అతని దృష్టక్కడున్న ఫోన్‌పై పడింది. అతను ఒక్కక్షణం ఆలోచించాడు. అక్కడున్న



బెల్లు కొట్టాడు, పనివాడు పరుగెత్తుకు వచ్చాడు.

"ఓ సిగరెట్టు పెట్టె తెచ్చిపెట్టు."

"అట్లాగే బాబూ! ఇల్లు జాగ్రత్త"

అతను వెనుక తలుపులు వేసి వచ్చాడు అతను గేటు దాటగానే ముందు తలుపు వేసాడు గబా, గబా ఆగత్య నంబర్ తిప్పాడు కోడ్ నంబర్ రెస్పాన్ రాగానే అతనికి ప్రాణం లేచి వచ్చింది.

"హల్లో ."

"నీలూ "

"హల్లో ఆదిత్యా ఏమిటి . ఎప్పుడు వస్తావ్!"

"నీలూ " చైనులు వివరాలు చెప్పి, పోలీసులకు కంప్లైంటు ఇవ్వు అని చెప్పాడు నీలిమ త్వరగా వచ్చెయ్యిమన్నది

"నీదే ఆలస్యం! అక్కడ డిపార్ట్మెంటును మేపే వచ్చి ఉంటారు జాగ్రత్త అనుమానిస్తే నా అంతం చూస్తారు" అని ఫోన్ పెడుతుండగానే బెల్ కొట్టారు

ఆదిత్య తలుపు తీసి ఆశ్చర్యంగా నిలబడిపోయాడు చైనులు!

"మీరెప్పుడు వచ్చారు మామయ్యా!"

"అక్కడ తెలిసింది నిన్ను ప్రసాద్‌రావు తీసుకు వచ్చాడని.." అతని ముఖంలో ఆందోళన కనిపించింది.

"అంత ఆందోళన దేనికి ? నేనేమయినా అమ్మాయినా!" అన్నాడు, తన కలవరం బయట పడనీయకుండా.

"అది కాదు . నాకు కొడుకులు లేరు. నిన్నే నా కొడుకు అనుకుంటాను అందుకని దయచేసి నువ్వు ఎక్కడికి వెళ్లినా, చెప్పి వెళ్లు నాయనా" అన్నాడు.

"సారీ మామయ్య" అన్నాడు.

"ఈ ఇంట్లో పనివాడు ఉండాలి ."

"తవరా చైనులుగోరూ .." అంటూ

యక్షగానం

విల్స్‌ప్యాకెట్టు పట్టుకుని వచ్చాడు, పనివాడు

"సిగరెట్లే వరికిరా !"

"ఈ బాబుగోరు " అన్నాడు ఆదిత్యను చూపి.

"ఒహో! ఈ అలవాట్లు అన్నీ ఉన్నాయన్న మాట" చిరాకుగా చూచాడు

ప్రసాదరావుకోసం అని అబద్ధం ఆడుదామనుకున్నాడు ఆయనే బ్రాందు వాడతారోనని, తల వంచుకున్నాడు

"నా జీవితం ఆఖరు దశలో ఉన్నది. నేను తాగుతాను, తింటాను, నీవు ఇప్పుడే ప్రారంభించావు కదయ్యా" అన్నాడు విసుగ్గా

"సారీ మామయ్యా" అన్నాడు

తోడు గుండె!

గుండెకు తోడుగా పనిచేయగల మరో గుండెను తయారు చేయటానికి జపానులోని నిస్పాన్ జియన్ కంపెనీ, అయిసిన్ సీకి కంపెనీ సన్నాహాలు ప్రారంభించాయి హృద్రోగం కలవారు పూర్తి స్వస్థత పొందే వరకు దీనిని గుండెకు తోడుగా ఉపయోగించగలరు. టోక్యో విశ్వవిద్యాలయం ఈ తయారీలో సహకరిస్తున్నది. దీనికి అవసరమైన ప్రాథమిక పరిశోధనలను విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధనా విభాగంలో పూర్తిచేశారు. ఈ సాధనల ఫలితంగా ఈ రెండు కంపెనీలు తోడు గుండెను వ్యాపారరీత్యా ఉత్పత్తి చేయమన్నాయి. ఉత్పత్తిని ప్రారంభించటానికి ముందు మరికొన్ని పరీక్షలను జరపవలసి ఉంటుంది

వాళ్లు కాఫీ త్రాగుతుండగా ప్రసాదరావు వచ్చాడు.

"చైనులూ! ఏమిటిలా వచ్చేవ్!"

"నా కాబోయే అల్లుడిని నువ్వు తీసుకొచ్చావు. అందుకే వచ్చాను."

"ఒహో! అదా సంగతి, ఏమయ్యా ఆదిత్యా ఆ ముక్క మొదటే చెప్పవద్దా!" అన్నాడు

"రేపుగాని, ఎల్లుండిగాని వస్తామయ్యా."

"రెండు రోజుల పని ఉందా ?"

"నీ అల్లుడిని కొరుక్కుతిననులే .."

ఇద్దరూ నవ్వారు ఆ రోజంతా అక్కడే గడిపి చైనులు వెళ్లిపోయాడు ప్రసాదరావు జాలిగా చూచాడు

"ఆ పిల్ల కోసం నీకు వల విసిరాడా " నవ్వాడు

"అబ్బే " ఏదో చెప్పబోయాడు

"తప్పించుకోకు ఎట్లాగయినా ఆ పెళ్లి తప్పించుకో ఇద్దరూ రాక్షసులే ఈ చైనులు గాడిని నమ్మొచ్చుగాని ఆ పిల్ల ముండను నమ్మలేం" అన్నాడు

ఆదిత్యకు అతను నిజం మాట్లాడుతున్నాడో, చైనులి గూఢచారిగా పనిచేస్తున్నాడో తెలియలేదు

"ఆడపిల్ల ఒకసారి తప్పు చేస్తే క్షమించకూడదా"

"మళ్లీ చేయదన్న నమ్మకం ఏమిటి ? నువ్వు చూస్తే బుద్ధిమంతుడిలా ఉన్నావు" అన్నాడు అతను

అలా ఆ రోజు గడిచింది మర్నాడు సాయంత్రం ప్రసాదరావు చెప్పిన లెక్కలు రాస్తుండగా హడావుడిగా వచ్చాడు పని అతను

"అయ్యగోరు పోనండి "అందుకున్నాడు

"ఏమిటి ? చైనుల్ని అరెస్ట్ చేసారా! ఇల్లంతా సోదా చేసారా వస్తున్నా నువ్వేమి కంగారుపడకు అబ్బే అతనిక్కడే ఉన్నాడు" మరో రెండు నిమిషాలు మాట్లాడి ఫోన్ పెట్టేసాడు

"ఆదిత్యా! చైనులుని అరెస్ట్ చేసారుట"

"యెందుకు ?"

"ఏ విషయము తెలియదు వెళ్దాం పద"

"మీరు పదండి. నేను తరువాత వస్తాను."

అతన్ని పంపించివేసాడు ఆ నిమిషం చైనులు చెప్పిన వార్నింగ్ మాటలు మరిచిపోయాడు ప్రసాదరావు

25

తల్లికి భర్తతో కలిసి నమస్కరించింది నీలిమ ముకుందాదేవి సజల నయనాలతో కూతురి, అల్లుడి తలలు నిమిరింది

"మీ నాన్న బావున్నారా నీలూ!"

"అమ్మా! " తల్లి హృదయంలో తల దాచుకుని బావురుమన్నది నీలిమ

''ఏమిటమ్మా !'' కూతురుని దూరం జరిపి అడిగింది ముకుందాదేవి.

''దేవీ ! నందనరావుగారు పోయారు '' దూరంగా నిలబడిన శివాజీ కల్పించుకుని చెప్పాడు

''ఏమిటి నందనరావు . నందనరావు పోయాడా !''

ఆమె అలా రాయిలా నిలబడిపోయింది

''అవునమ్మా ! అతను కోరిన కోరిక ఏది తీరకుండానే పోయాడు. ఆఖరు క్షణంలో జోవచ్చుతానంద అంటూ పాడు తల్లీ అనే వాడు ..'' అంటూ మాట్లాడలేనట్లు బావురు మన్నది.

''యెవరికేది ప్రాప్తమో మనము చెప్ప లేము '' నిట్టూర్చింది ముకుందాదేవి ఒక్క నిముషం కళ్లు మూసుకుంది.

''మన జీవితాలు ఎందుకిలా అయ్యాయి ! యెందుకమ్మా !''

''దానికి జవాబు నా దగ్గర లేదు నీలూ ! అవతల బండికి సమయం అయినట్టుంది వెళ్లాలి,'' అన్నదామె

''దేవీ! మీతో మాట్లాడవలసిన విషయాలు చాలా ఉన్నాయి మీరు వెళ్లటానికి వీల్లేదు.''

''నేను వెళ్లితీరాలి చక్రీ ! నేను అన్నీ వదులుకుని ఆ పరమాత్ముడిని చేరుకోవాలను కుంటున్నాను నాకీ ఇహలోక బంధాలు, బంధ నాలు వద్దు '' అన్నది, ఆమె యెటో చూస్తూ

''మీకు కనిపించే వ్యక్తుల కష్టసుఖాలు వద్దు, కాని పరలోక సౌఖ్యం కావాలా ముకుందాదేవిగారూ !'' ఆదిత్య తీక్షణంగా అడిగాడు

''అవునండీ . అతనిపై కొండంత నింద పడింది దాదాపు నేరస్తులంతా అరెస్ట్ అయ్యారు .''

''కాలేదు, ప్రాణాలకు తెగించి, పట్టు కున్నాను దయచేసి,మీ వేదాంతం కాస్తకట్టిపెట్టి మీ కూతురు జీవితం సుఖమయం చెయ్యండి. నన్ను ఈ నరక బాధ నుండి తప్పించండి'' అన్నాడు ఆదిత్య ఆమె ఆశ్చర్యంగా చూచింది మాట్లాడేది ఆదిత్యేనా?

శివాజీ ఆదిత్యవంక ఆపమని చూచాడు

''మనసులోలేని మనఃశ్శాంతి యెక్కడో దొరుకుతుందనుకోవటం మూర్ఖత్వం మనిషి మొదట ఈ లోకంలోని విషయాలను అర్థం చేసుకోవాలి. ఆ తరువాత పరలోక విషయాలు ఆలోచించాలి'' అన్నాడు.

ఆమె మాట్లాలేకపోయింది

ఆమెకు నందనరావు మరణవార్తే బాధా కరంగా ఉన్నది. పైగా శివాజీ మాటలకు తట్టుకోలేకపోతుంది. ఆమె మూగగా కన్నీరు కార్చింది

''మిమ్మల్ని బాధ పెట్టాలనికాదు దేవీ !

ప్రయత్నిద్దాం !

విధి వంచితుల్ని
దగాపడ్డ బాధితుల్ని
చూసి జాలిపడి
అదే పనిగా
సానుభూతి
పడికట్టు పదాల్ని
వల్లించి ఆవేదన్ని
తిరగ తోడకు
వీలుంటే సహకార
హస్తాన్ని అందించి
మనస్తాపాన్ని తుంచు
ఉడతా భక్తిగానైనా !

— మాధవరపు కృష్ణ

ఆదిత్య ఎంతో కష్టపడి అందరిని పట్టించాడు ఇందులో మీ సాక్ష్యం ఎంతో అవసరం ''

''నిజమా ! అందరూ దొరికారా '' ఒక్క క్షణం సంతోషించినా, ఆమె ముఖాన నీలి నీడలు కదలాడాయి

''నాకు తెలుసుదేవీ ! మీరు మీ జీవితం గురించి ఆలోచిస్తున్నారు ఈ వార్తలు పేపర్లకు ఎక్కుతాయని, అందరూ నిరసనగా చూస్తారని మీ జీవితం రెండు భాగాలుగడిచింది ఆదిత్యది ప్రారంభం అయింది ''

''చక్రీ . ఇంకేం చెప్పొద్దు నేను నేను వస్తున్నాను ''

ఆమె వెళ్లి తోటి ప్రయాణీకులతో మాట్లాడి తన బ్యాగు తెచ్చుకున్నది అందరూ కలసి మారేడ్‌పల్లిలో నీలు ఉంటున్న ఇంటికి వెళ్లారు

నీలువెత్తు నందనరావు ఫోటో చూస్తూనే ఆమె విరుచుకు పడిపోయింది అరగంటతరువాత తేరుకున్నది ఆమె స్నానంచేసి వచ్చి మళ్లీ ఏం అలంకరించుకోలేదు

అలా సాదాగావున్న తల్లి ముఖం చూడలేక పోయింది నీలిమ

''ఆదిత్యా ! రా నాయనా '' మొదటి సారిగా ఆప్యాయంగా పిలిచింది ముకుందాదేవి

ఆదిత్య వచ్చి కూర్చున్నాడు

''మీ సత్యవతి గొప్ప నటి అమెరికా వెళ్లిం దన్నారు పట్టుబడ్డ నాటినుండి, పిచ్చిదానిలా నటిస్తుంది'' అన్నాడు

''నాకే ద్రోహం తలపెడుతుందని అనుకో లేదు ''

''క్యాష్ అంతా ఖర్చు చేసారు, పొలాలు, ఇళ్లు కొన్నారు. బంగారం, వెండి మాత్రం అందరి దగ్గరా దొరికింది ''

ఆమె గాఢంగా నిట్టూర్చింది

''మీకు తెలియకుండా ఓ చిన్న సాహసం చేసాము ఈ బంగారం, వెండి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే అది వాళ్ల బొక్కాసలలోకి పోయి, లెక్కా పత్రం ఉండదు మీరింతకష్టపడి సంపాదించారు ఏదయినా సత్కార్యంచేద్దామని . పోలీసు ఇన్‌స్పెక్టరుతో లాలూచి పడక తప్ప లేదు'' అన్నాడు.


''కొంత వారికిచ్చి, మనది, మనము తెచ్చు కున్నాము మనము అంచనా వెయ్యలేదమ్మా ! బంగారమే కొన్ని లక్షల ఖరీదు చేస్తుంది'' అన్నది తల్లికి పాలు తెచ్చి ఇచ్చిన నీలిమ.

ముకుందాదేవి మాట్లాడలేదు

''మీరేం విచారించకండి ఈ కేసు బయటికి రాకుండా చూచే పూచి నాది,'' అన్నాడు ఆదిత్య

ఆమె అపనమ్మకంగా చూచింది.

''ఈ విషయంలో మీరు నిశ్చింతగా ఉండండి. డబ్బుంటే ఏ పని అయినా తేలికగా చేయవచ్చు'' అంటూ ఆమెపైకి ఓ వార్తా పత్రిక విసిరాడు.





డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

పి. కె. ఆర్. — కడప

నా వయస్సు 30 సం॥లు వివాహం కాలేదు 10 సం॥లుగా ఎడమ తొడ పైభాగంలో "నరం" వాపు వచ్చి నల్లటి రక్తం చేరినట్లు కనబడుతూ కొద్ది కొద్దిగా పెరుగుతూ వచ్చింది వెరికోస్ వెయిన్స్ అని ఆపరేషన్‌చేసి 5 సం॥లు అయింది మళ్ళీ అదే భాగంలో వాపు వచ్చింది

★ మీరు మరల శస్త్రవైద్యులకి చూపించుకోవలసి ఉంది. వెరికోస్ వెయిన్స్ ఉన్నవారికి ఆపరేషన్ చేసిన పిదప యధావిధిగా వాపు వచ్చే అవకాశం ఎక్కువ చెడు రక్తాన్ని తీసుకువెళ్ళే రక్తనాళాలలోని కవాటాలు సరిగా పని చేయికపోవటమే దీనికి కారణం

ఎస్. — శ్రీరాంనగర్

నా వయసు 20 సం॥లు చేతివేళ్ళ గోరు చివరి భాగం పగిలి రక్తం కారుతున్నది అందు వల్ల వాలీబాల్ సరిగా ఆడలేకపోతున్నాను

★ వేళ్ళకి కొన్నాళ్ళపాటు విశ్రాంతి అవసరం నీళ్ళలో చేతులు ముంచకుండా పొడిగా ఉండేటట్లు చూసుకోవలసి ఉంటుంది. లోనికి విటమిన్ 'సి' మాత్రలు 500 మి.గ్రా రోజుకి ఒకటి వంతున వరుసగా నెల రోజులపాటు వాడటం మంచిది పైపూతగా ఫ్యూరాసిన్ క్రీము వాడండి

కె.ఆర్.కె.ఆర్. — రాజమండ్రి

వేసెక్టమీ ఆపరేషన్ చేయించుకొన్న రోజు గాని, ఆ తరువాత గాని భార్యతో కలిస్తే ఆపరేషన్‌లో 'కట్' చేసిన నరాలు మరల కలస పోవటానికి ఆస్కారం ఉందా? పిల్లలు పుడతారా?

★ ఆపరేషన్ చేసిన మూడు నెలల వరకు స్త్రీ కలయిక చేయకూడదు ఇదివరకే ఉత్పత్తి అయిన వీర్యకణాలు ఇంకా సెమినల్ వీసికిల్‌లో ఉండటమే ఇందుకు కారణం

ఇంకా త్వరగా కలయిక అవసరం అనుకొంటే సెమెన్ అనాలిసిస్ చేయించి స్పెర్మ్స్ లేవని తెలుసుకోవాలి ఏ పరిస్థితిలోను 'కట్' చేసిన నరాలు అతుక్కోవడం జరగదు.

ఆర్.ఎస్.ఆర్. — తాడేపల్లి గూడెం

నాకు పెదవుల చివర తెల్లగా ఉంది అవి పోవటానికి ఏ మందులు వాడాలి ?

★ పైపూతగా జెన్షియన్ వయొలెట్, లోనికి రిబోఫ్లావిన్ మాత్రలు తీసుకోవటం మంచిది ఆహారంలో ఎక్కువగా కామంచి ఆకు వాడటం వల్ల త్వరగా తగ్గే అవకాశం ఉంటుంది మరీ ఎక్కువగా ఉన్నవారు పైపూతగా ఒక శాతం సిల్వర్ నైట్రేట్ వాడటం మంచిది అయితే ఆ భాగాన్ని వెనువెంటనే ఉప్పునీటితో తుడిచి వేయాలి

యం. ఎస్. — మాల్యవంతం

నా వయస్సు 21 సం॥లు. 10వ తరగతి చదువుతున్న రోజుల్లో శరీరంలో ఉన్న కీళ్ళన్నీ వాపువచ్చాయి ఆస్పత్రిలో చూపించాను బాగానే ఉంది తిరిగి ఆ రోగం వచ్చే సూచన లున్నాయి అంతేకాక, 35 సంవత్సరముల తర్వాత గుండె జబ్బు వస్తుందని పెనిడ్యూర్ — 12 ఇంజెక్షన్ 15 రోజులకొకటి వేసుకో మన్నారు ?

★ వారు చెప్పింది సరిఅయిన సలహా తప్పకుండా పూర్తి కోర్సు వేయించుకోవటం చాలా అవసరం నిర్లక్ష్యం వల్ల హృదయంలోని వివిధ భాగాలు వాపుచెందే అవకాశం ఉంటుంది

టి. ఎల్. — వేకనూరు

తల్లిదండ్రులలో ఏ ఒక్కరికైనా ఫైలేరియా వ్యాధి ఉంటే పుట్టబోయే పిల్లలకి వచ్చే అవకాశం ఉందా ? వివాహం కాకముందు స్త్రీకి ఈ రోగం ఉంటే గర్భిణి సమయంలోగాని, పెళ్ళయిన తర్వాతగాని పెరిగే అవకాశం ఉందా?

★ ఆ అవకాశం ఉండదు ఏ రోగమైనా, దానికి తగిన నివారణ మందుల వాడకం జరుగక పోతే ఉధృతమయ్యే అవకాశం ఉంటుంది అదే విధంగా వివాహానికి ముందు ఉన్న రోగం, తర్వాత అధికం అయ్యే అవకాశం ఉంటుంది పెళ్ళికి, గర్భిణిగా ఉండటానికి ఈ రోగానికి ఏ సంబంధమూ లేదు

పి. బి. — గర్శకుర్తి

మా బుజ్జి వయస్సు 4 సం॥లు చిన్నప్పటినుండి ఇప్పటివరకు నడవటంలేదు కాళ్లు పడిపోయినట్లున్నాయి. మాట కూడా మాట్లాడటం లేదు

★ మీ అబ్బాయికి 'సెరిబ్రల్ పాల్సీ' అనే రోగం ఉన్నది దీనికి ఫిజియోథెరపీవల్ల చాలా మటుకు మేలు కలుగుతుంది— కాని మామూలు పిల్లలకన్నా అన్నిట్లోను చాలా ఆలస్యం అవుతుంది మెదడు పెరుగుదల సక్రమంగా లేకపోవటమే ఇందుకు కారణం కాలగతిలో పరిస్థితిలో కొంత మార్పు కనబడుతుంది ★

యక్షగానం

ముకుందాదేవి తన గురించి ఏమయినా రాసారేమోనని తీసుకుని ఆత్రుతగా చూచింది

"ప్రముఖ వ్యాపారవేత్త పరశురామ్‌గారి పుట్టినరోజు పండుగ క్లబ్బులో ఘనంగా జరిగింది దానికి పురప్రముఖులు, గవర్నరు, మంత్రులు విచ్చేసి పార్టీని జయప్రదం చేసారు" అని ఉంది అతని ఫొటోతోపాటు వచ్చిన వార్త అతని కూతురు అతని నోట్లో కేకు పెడుతుంది

"ఇతను సంవత్సరం క్రితం ఏదో అవినీతి కేసులో పట్టుబడి, విడుదల అయ్యాడు కదూ!"

"అవును."

"మరి గవర్నరు యెలా వచ్చినట్టు ? ప్రభుత్వమేకదా, అతనిపై కేసులు పెట్టింది?"

"మన ప్రభుత్వం అంత ఘనంగా పని చేస్తుందన్నమాట వాళ్లకు డబ్బు తప్ప మరేం అక్కరలేదు."

క్రింద మరో ఉత్సవం చూచింది 'శ్రీ రామలింగేశ్వరరావు షష్టిపూర్తి మహోత్సవము' రామలింగేశ్వరరావు ప్రక్కన అంతా పోలీసు అధికారులు, గొప్పవారున్నారు

రామలింగేశ్వరరావు తమ్ముడిని హత్యచేసిన నేరంపై అరెస్ట్ చేసింది ఈ పోలీసులే

ఆమె నిట్టూర్చింది

"వారికి ఓ కోడ్ ఆఫ్ కాండక్ట్ లేదు. యధా పాలకులు, తధా పాలితులు" అన్నాడు

"నా కిప్పుడేం అర్థం కాలేదు కాదు నేను రెండుగంటలు ఒంటరిగా ఉంటాను" అన్నది ముకుందాదేవి

"నీలూ ! నాకొక కప్పు కాఫీ కావాలి" ఆదిత్య భార్యను ప్రక్కకు పంపించివేశాడు

(ఇంకా వుంది)

హైదరాబాదు - తెలుగు

శ్రీ కాళోజీ నారాయణరావు

గడిచినవి దుర్దినాలు గడుస్తున్నవేమో ఇప్పుడు చెప్ప వీల్లేదు. భవిష్యత్తులో సాహిత్య చరిత్రకారులీనాటి స్థితిగతుల్ని చర్చించక మానరుకదా

పోతననాడు ఆంధ్రదేశమంతా ఒకే రాజ్యంగా లేదు అప్పటి ఆంధ్రదేశం అనేక రాజ్యాలు ఒకప్పుడు ఆంధ్రప్రాంతం అంతా ఒకే ఛత్రచ్ఛాయ క్రింద ఉన్నా, ఆనాటి ప్రజానీకం తమ మాతృభాషను ఎంతవరకు అభివృద్ధి చేసుకున్నారో తెలియదు. ఆనాటి ఆంధ్రప్రాంతాలకు పరస్పర సంబంధాలెట్టివో! నేడా ప్రాంతాల ఎల్లలు మారాయి క్రొత్త ప్రాంతాలు ఏర్పడ్డాయి. పూర్వ కవులు, పూర్వం ఏ ప్రాంతంవారైనా, నేడు మాత్రం, వారిపై — ఏ ప్రాంతంలో ఉన్న సారస్వతసాధకునిపై ఆ ప్రాంతంవారు — స్థానిక సంబంధమైన ఒక హక్కును స్థాపించుకుంటున్నారు

మాండలిక పదాలు — ఉచ్చారణ భేదాలు (యాసలు) ఆనాడూ ఉండి ఉంటాయి సహజం అయితే పోతన్న, గౌరన్న, అక్కన్న, మాదన్న ఎట్లాంటి భాష మాట్లాడి ఉంటారు? ఎవ్వరూ వ్రాసి ఉంచలేదు ఏమైనా, పోతన (నైజాంవాడు) తురక పదాలు నుపయోగించి ఉండడు. ఆయన వియ్యంకుడు శ్రీనాథుడు (సర్కారువాడు) ఇంగ్లీషు పదాలు ఉపయోగించి ఉండడు అయితే ఎవరి జిల్లా సంగీతం(యాస) వారు తమ తమ సంభాషణాల్లో — ఎవరి సంగీతం వారికే తెలియకుండా — ప్రదర్శించి ఉంటారు మరి ఒకర్ని ఒకరు ఆక్షేపించుకున్నారేమో తెలియదు. శ్రీనాథుడు గడుసువాడు కాబట్టి పోతనను వెక్కిరించి ఉంటాడు అయినా అది బావమరుదుల సరసం. రాజకీయ విరసం కాదు

మహమ్మదీయులు తెలంగాణా ప్రాంతంపై ఎక్కువకాలం రాజ్యం చేశారు పరిపాలనా భాష ఉర్దూ ప్రతి రాజ్యంలో, ప్రభుత్వమే అన్నింటికంటె శక్తివంతమైన సంస్థ. ప్రభుత్వం తల్చుకుంది కాబట్టి, ఉర్దూ వ్యాప్తి జరిగింది. తెలుగు వ్యాప్తి తగ్గింది ఉర్దూ వ్యాప్తి అయినా, కోస్తాజిల్లాల్లో ఇంగ్లీషు వ్యాప్తి అయినంత జోరుగా కాలేదు. కాబట్టే, ఉర్దూ కూడా చాలా తక్కువమందికే అబ్బింది అయినా నేటికీ తెలుగు సారస్వతోపాసకులనేకులు మిగిలారంటే, పోతన క్షేత్రంలో పెరుగుతున్న సారస్వతవృక్షం, ఉర్దూ గాలికి మోడైనా, మాడిపోలేదని విదితమవుతోంది.


కోస్తా రాయలసీమ జిల్లాల్లో ప్రతివ్యక్తీ ఆంధ్రుడే. కాని తెలంగాణాలో ఆంధ్రుడంటే రాజకీయాల్లో పాల్గొనే తెలుగువాడు అని ప్రభుత్వం భావించింది తెలుగు చదువుకున్నవాడు ఆంధ్రుడై పోతాడనే భయంతో, ప్రభుత్వం అట్టి ప్రమాదానికి గల అవకాశాల్ని వీలైనంత వరకు తొలగించింది పల్లెల్లో రాజభాషాజ్ఞానం లేనివారు తెలుగు మాట్లాడుతారు నీరు తాగే పాత్రను 'గ్లాసు' అని, మనం — 'జాంబు' అంటాం. కాని ఆంగ్ల మానస పుత్రులకు గ్లాసే బాగుంటుంది రెవెన్యూ ఇన్‌స్పెక్టరును గిర్దావరంటాం రెండు పేర్లూ తెలుగువి కావు! అయినా ఉస్మానియా మానస పుత్రులకు గిర్దావరే మంచివాడు! ఇవన్నీ ప్రస్తుతం మాండలిక భేదాలే అయినా — ప్రభుత్వాలు తెచ్చిపెట్టిన భేదాలు ఆ ప్రభుత్వాలు మనకు వద్దు అని మనం అంతా వాంఛించాం

భారతదేశానికి ఒకే స్వాతంత్ర్య దినం తెలంగాణానికి రెండు తెలంగాణా వారు అనుభూతిలోభులుకారు. ఒకచోట ఒక్క తెలుగు పాఠశాల పెట్టటానికి భగీరథ ప్రయత్నం చేయాల్సివచ్చేది తీరా స్కూలును స్థాపించినాక అదొక చిన్న పుణ్యక్షేత్రం అంత ముఖ్యస్థానంగా మా భావాల్లో మెసలుతూ ఉంటుంది కష్టమో నిష్ఠూరమో—మహాగడ్డు దినాల్లోనే గ్రంథాలయాల్ని స్థాపించి— తెలుగు భాషకు సేవ చేసినారు పెద్దలు. ఆంధ్ర మహాసభ అని ప్రారంభించి ఉర్దూ ప్రభావాన్ని కొంతవరకు అరికట్టారు. చేతనైనంతలో సాహసించి అక్కడా అక్కడా తెలుగు పాఠశాలల్నీ స్థాపించారు వారీ పనులన్నీ చేయకుంటే, తెలుగు సాంతం చచ్చిపోయేదేనని అనను. కాని మరీ చెడిపోయేది

ఈ సంవత్సర ప్రారంభంలో, తూప్రాన్ గ్రామంలో ఆంధ్రసారస్వత పరిషత్తు, మహాసభ జరిపింది—నిర్భయంగా జరిపింది కళాప్రియులు, సారస్వతప్రియులు ఒకచోట చేరి, సంభాషించుకొని, భాషోద్ధరణకు కంకణం కట్టుకున్నారు మహాసభ మొత్తంమీద అధ్యక్షులు శ్రీ ఇల్లిందుల రామచంద్రరావు చేసిన ఒక సూచన చాలా ముఖ్యమయినది యావదాంధ్రములోని వివిధ మండలములందు వాడుకలో నున్న శబ్దజాలమును సంపాదించి ఒక సమగ్ర శబ్దకోశమును సిద్ధపరచుట అవసరము సారస్వత పరిషత్తువారు, ముందుగా యావదాంధ్రం నుంచి, సాహితీ పరులను ఒకసారి ఆహ్వానించి ఈ పని త్వరలో అయ్యేటట్లు చూడగలరా?

పరిషత్తువారు తెలుగులో పరీక్షలు పెట్టారు దాదాపు 2500 మంది పరీక్షల్లో పాల్గొన్నారు, ఇల్లాంటి పరీక్షల్ని, ఉర్దూలో, ప్రభుత్వమే నడపుతోంది — తెలుగులో అట్టి ప్రయత్నం లేదు ప్రస్తుతం, ప్రభుత్వం తెలుగులో కూడా పరీక్షలు పెట్టాలని నిశ్చయించింది ఇతర ప్రాంతాల్లోని విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వాలు స్థానిక భాషల్లో పరీక్షలు జరుపుతున్నారు

అసలిక్కడ విశ్వ విద్యాలయంలో తెలుగు దాదాపు లేదనవచ్చు సారస్వత పరిషత్తువారు, విద్యాశాఖ వారిని అనేక పర్యాయాలు దర్శించి విశ్వ విద్యాలయంలో ప్రాంతీయ భాషలకు సముచిత స్థానాన్ని కల్పింపమని కోరారు ప్రాంతీయ భాషలకు— ఉస్మానియా విశ్వ విద్యాలయంలో గల స్థానాన్ని వ్యక్తపరచటానికి స్థానికోదాహరణ ఒకటే ఉంది నైజాం కాలేజీ, చాలా సంవత్సరాలు మద్రాసు విశ్వవిద్యాలయంక్రింద ఉంది ప్రతి క్లాసులోనూ ఇరవై లేక ముప్పది మంది తెలుగు చదువు



కార్టూనిస్టులకు సూచనలు!

★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి

★ ప్రతి కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.

★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్విం చేవిగా అర్థవంతంగా వుండాలి!

★ వ్యాఖ్య చిన్నదిగా క్లుప్తంగా వుండాలి అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి! కార్టూన్ మీద పేరూ వూరు అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి.

★ సొంత చిరునామా గల తపాలా బిళ్లలు అంటించిన కవరుగల కార్టూన్‌లను త్రిప్పిపంపడంజరుగుతుంది దారిలో పోయేవాటికి మా బాధ్యతలేదు

★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది పరిశీలనా ఐహారువారాలు పట్టవచ్చు.

★ పండుగల కార్టూన్‌లు – బాగా ముందుగా వాటి కవరు మీద ఆ "ప్రత్యేక" సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం

★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవద్దని మనవి.

★ మా కార్యాలయానికి స్వయంగావచ్చి కార్టూన్‌లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులతి కించిన కవరు జతచేయ్యాలి. కాపీ కార్టూన్‌లు పంపరాదు.

– సం॥

హైదరాబాదు తెలుగు

కునేవారు – ఇంకా అనేకులు మరాటీ కన్నడాలు చదివే విద్యార్థులు, ప్రతి సంవత్సరం ఉండేవారు. కాని, నైజాం కాలేజీని ఈ మధ్య ఉస్మానియా విశ్వవిద్యాలయం కిందకు లాగారు ఆనాటినుంచి, ప్రాంతీయ భాషల అధ్యాపకులకు ఉస్మానియా సాంప్రదాయానుగుణ్యంగా—పిల్లలు లేని సంసారాలను పోలిన క్లాసులు ప్రాప్తించాయి ఇంక, 'సైకతంబుగ సైకతస్థలిన్' అన్నట్లు ఈ అధ్యాపకులు క్లాసుల్లో కుర్చీల నధిష్ఠించే కాలం కూడా వచ్చేసింది అదీ మిగతా విశ్వ విద్యాలయాలకు, ఉస్మానియా విద్యా పీఠానికి భేదం!

కానీ—గుడ్డిలో మెల్ల సాహిత్య పరిషత్తు వారి రాయబార ఫలితంగా, విశ్వవిద్యాలయం వారు ప్రాంతీయ భాషలకు, బోధనా కార్య క్రమాల్లో లాంఛన ప్రదేశాన్ని కల్గించారు ఈ సంవత్సరం నుంచి ప్రాంతీయ భాషల్లో 'కూడా' ఒక పరీక్షాపత్రం ఉంటుంది అల్ప సంతోషిత్వం ప్రస్తుతంలో ధీరలక్షణం కదా - ఈ పాక్షికమన్ననకు, ప్రభుత్వానికి మా కృతజ్ఞత

సోదరులు అనేకులు యధాశక్తిని సారస్వతో పాసన చేస్తున్నారు – సారస్వత సేవకులకు చేతనైన ప్రోత్సాహం ఇస్తున్నారు ప్రజాసామాన్యానికి, ఇతోధికంగా – విజ్ఞానవికసిత సంఘానికి సాధ్యమైనంతగా— సాహిత్యాభిరుచి కలగటానికి, అనుకూలమైన వాతావరణం ఏర్పడే దాకా, సాహిత్యోపాసకులు కృషి చేస్తూనే ఉండాలి

ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు శ్రీ సురవరం ప్రతాపరెడ్డి రచించిన "ఆంధ్రుల సాంఘిక చరిత్ర" అనే పరిశోధన గ్రంధాన్ని ప్రచురిస్తున్నారు మాండలిక శబ్దకోశాన్ని తయారు చేయటానికి కొక ఉపసంఘాన్ని నియమించారు శ్రీ మాడపాటి హనుమంతరావు, తమ షష్టిపూర్తినాడు ప్రజానీకం సమర్పించిన నిధితో, భాషాసేవకు పూనుకున్నారు వారియెడ ఈ క్రింది గీతాసూక్తి సంపూర్ణంగా వర్తిస్తుంది

"యద్య దాచరతి శ్రేష్ఠః
తత్తదే వేతరో జనః
స యత్ ప్రమాణం కురుతే
లోకస్తదనువర్తతే."

వారు పెట్టిన ఒరవడి, ఎల్లరకు అనుసరణీయం లక్ష్మణరాయ పరిశోధన మండలివారు అనేక శాసనాల్ని సేకరించారు కాని వారి పరిశోధన ఇంకా తెరమరుగునే ఉంది వివేకవర్ధని పునాదుల్లో ఆంధ్రుల సొమ్ము ఉన్నా, నేడా సంస్థ కేవలము మహారాష్ట్రులదే ఏమైనా, మహారాష్ట్ర సోదరుల కృషి, మనవారి కళ్లు తెరవాలి

మనం మేల్కొని ఒక కాలేజీని స్థాపించు కోవాలి సేవానురక్తితో స్థాపిస్తే, ఈ మహా పవిత్ర సేవకుపూనుకునే విద్యావంతులు అనేకులు మనకు తోడ్పడతారు నారాయణగూడ— ఆంధ్ర బాలికా పాఠశాలను కళాశాల చేయటానికి పెద్దలు పూనుకున్నారని- ప్రయత్నాలు ఫలోన్ముఖమైనాయని తెలుస్తోంది ఇది సంతోషింపదగిన సంగతి సాహిత్య పరిషత్తువారు — విద్యావ్యాప్తినీ, తెలుగు భాషోద్ధరణనూ, ఒక ధర్మోద్యమంగా పాటించి, ప్రతి ఊరా పాఠశాలను నెలకొల్పటానికి పూనుకోవాలని నా విజ్ఞప్తి

హైదరాబాదు రేడియో, కానరాకుండా పరివర్తనం చెందుతోంది. తెలుగు కార్యక్రమాలు రోజురోజుకు మెరుగెక్కుతున్నాయి తెలుగు శాఖ వారు, అవకాశాల్ని ఇంకా బాగా వినియోగించు కొని, భాషా సేవ చేస్తూ ఉంటారనటంలో సందేహంలేదు

పేరుపేరునా సారస్వతసేవకులను పేర్కొనటం అనవసరం శ్రీ వానమామలై చార్యులు, శ్రీ దాశరధి, శ్రీ వెంకటరమణా చార్యులు, శ్రీ గడియారం రామకృష్ణశర్మ శ్రీ కొమర్రాజు భూపాలరావు, శ్రీ రామానుజ రావు, శ్రీ పులిజాల హనుమంతరావు, శ్రీ భాస్కరభట్ల కృష్ణారావు, శ్రీ వెల్దుర్తి మాణిక్య రావు, శ్రీ భాగి నారాయణమూర్తి, శ్రీ ధవళా శ్రీనివాసరావూ, శ్రీ మాట్లపల్లి రామారావు, శ్రీ రాఘవరెడ్డి, శ్రీ దుర్గేశ్వరశర్మ, శ్రీమతి నందగిరి ఇందిరాదేవి, శ్రీమతి సరస్వతీదేవి, శ్రీమతి రత్నాకరాంబ— ఇంకా అనేకులు మిత్రులు సాహితీరంగంలో శ్రద్ధగా పని చేస్తున్నారు— అనేకులు ప్రయత్నిస్తున్నారు వారందరికీ నా శుభాకాంక్షలు

వారికి నాదో మనవి— మన హృదయాలు సముద్రమంతంతవి. అందులో రేగే బడబానలానికి ఆకాశాన్ని మూతపెడ్తే ఖగోళం కరిగి పడుతుంది దేన్నో కప్పిపుచ్చుతున్నట్లు, ఏదో మీద దూకుతున్న ప్రమాదాన్ని దూరం చేసుకోలేక దూరంగా పారిపోతున్నట్లు ఉంది మన స్థితి ఒకర్ని ఒకరు అర్థం చేసుకోటానికి వాఙ్మయం ఏర్పడింది— అదేమోగాని అదే పరస్పర అపార్థాలకు దారితీస్తోంది దినదినాభివృద్ధి చెందుతున్న ఈ అపార్థప్రమాదాన్ని తొలగించటానికి ఒకే క్రమపద్ధతి. అక్షరాస్యత—విద్య—విజ్ఞానం ఈ మూడే మన నిర్మాణ కార్యక్రమాంశాలు సాధించిన సత్ఫలితాల పరిమాణం సాధించాల్సిన గురుతరాదర్శాలకు పోల్చిచూస్తే చాలా స్వల్పం. ఈ కఠిన సత్యం ఇతోధిక కృషికి ప్రేరణశక్తి అగుగాక ★

ఆంధ్రపత్రిక
1949 సెప్టెంబరు 18
సంచిక నుంచి

చింకిచాప



పోట్లూరి సుబ్రహ్మణ్యం

అది మధ్యాహ్న సమయమయినా ఆకాశాన మబ్బులు కమ్మటంతో వాతావరణం చల్లగా ఉంది సన్నగా వర్షం తుంపరులు పడుతున్నాయి

ముసలిది తన సత్తుగిన్నెలోని గంజినీళ్ళతో కలసిన అన్నాన్ని ఒకసారి తృప్తిగా చూసుకొని, ఆకులో ఉన్న పచ్చడ్ని ప్రక్కనే పెట్టుకొంది అది ఎవరో ఒక మహాతల్లి దయతలచి పెట్టింది

తన నివాసము వరకు పోలేని ముసలిది ఒక ఇంటిముందు వీధిలో కూర్చొని సత్తుగిన్నెలోని గంజిని ఆనందంగా త్రాగుతూ ఆకులోని పచ్చడ్ని నంజుకొంది

వర్షం ఇంకొద్దిగా ఎక్కువయింది ఇళ్ళకు పరుగెడుతున్న పిల్లలు 'పిచ్చిదిరోయ్ పిచ్చిది' అంటూ అరవసాగారు అదే ఇంకో సమయంలో అయితే పైన రాళ్ళుకూడా విసిరేస్తారు. వీటన్నిటికీ అతీతంగా నవ్వుకొంటుంది ముసలిది

ఎండిపోయిన చెట్టులోకి అకస్మాత్తుగా జీవం వచ్చినట్లు ముసలిదాని ఒంట్లోకి జవసత్వాలు ఒక్కసారిగా వచ్చాయి. నిటారుగా లేచి నిలబడింది అస్తిపంజరం లాంటి తన శరీరాన్ని కదలించి, అడుగుకొక అంగగా నడుస్తూ బోడి సత్రంవైపు బయలుదేరింది

బోడిసత్రం బైరాగులకు, అడుక్కొనే బిచ్చగాళ్ళకు నివాసం ఆ పాడుపడిన సత్రంలో బైరాగులది ప్రథమస్థానమయితే, తరువాతి స్థానం కుంటివాళ్ళది గుడ్డివాళ్ళకు ముసలి వాళ్ళకు స్థానం బయటే

వర్షాకాలంలో బైరాగులు దయతలిస్తేనే గుడ్డివాళ్ళకు, ముసలి బిచ్చవాళ్ళకు లోపలస్థానం లేదంటే దారినపోయే ఏ దానయ్యో వీరిని చూడడం తటస్థిస్తే వర్షంలో తడుస్తున్నవారి పరిస్థితికి జాలిపడి, బైరాగుల్ని తిట్టి లోపల ప్రవేశం కల్పిస్తాడు

ముసలిది తడిసి ముద్దయింది దాని మనసులో ఒకటే ఆలోచన చింకిచాప, పాత గుడ్డల మూట కళ్ళలో మెదలుతూ ఉన్నాయి అదే ఆ మనిషి యావదాస్తి ఎండాకాలం కదాని సత్రం వరండాలో ఒకప్రక్క తనచాప, గుడ్డల మూట పెట్టుకొంది పేరుకు వరండా అనేగాని దానికి పైకప్పులేదు వర్షంవస్తే అంతా జలమయమే ఈ వర్షానికి తన వస్తువులు అక్కడ ఉన్నాయో, లేక ఎటైనా కొట్టుకు పోయాయో అనేది ముసలిదాని భయం

ముసలిది సత్రం చేరేసరికి వర్షం పూర్తిగా తగ్గిపోయింది ముసలిది ఒకరాయిని తట్టుకొని పడబోయి సత్రంగోడ ఆసరాగా నిలద్రొక్కుకొని నిలబడింది సత్రంగోడ ఒకప్పుడు అంటే

బాగున్న రోజుల్లో ఆరడుగుల ఎత్తు ఉండేది ప్రస్తుతం అక్కడక్కడా కూలిపోయిన గోడలతో వీధి కనిపిస్తూ ఉంది

ముసలిది ఆత్రంగా వరండాలో చూసింది తన చింకిచాప, గుడ్డల మూట లేవు గుండె పగిలింది అప్పటికే సత్రం చేరుకొని తమ వస్తువుల్ని లోపల పెట్టుకొన్న సత్రం వాసులు ముసలిదాన్ని జాలిగా చూసారు.

అందర్నీ ఒకసారి ఎగాదిగా చూసి ''ఏటే పుల్లీనాచాప,గుడ్డలమూట ఏడపెట్టినావే'' అనడిగింది తన ప్రక్కనే పడుకొనే కుంటి పుల్లమ్మని

''నాకేటి తెలియదే పెద్దమ్మా నాను నా సాప, గుడ్డలమూట తీస్కాని లోనకెడితిని ''

''ఏట్రా నాగా నువ్వయినా సూసినవా'' అంది తనకావల ప్రక్కస్థానంలో పడుకొనే ఒంటికన్ను ముసలి నాగడ్ని అక్కడ ఆడ, మగా భేదం లేదు ఒకసారి తను స్థానాల్ని కేటాయించుకొన్నారంటే ఎప్పుడూ అక్కడే పడుకొంటూంటూరు నాగడు ఎక్కడో ఏరి తెచ్చుకొన్న బీడిని ఆప్యాయంగా ప్రక్కనున్న కుంటి గురవయ్య చుట్టముక్కతో ముట్టించుకొన్నాడు తరువాత నెమ్మదిగా పొగపీలుస్తూ అందులోని ఆనందాన్ని అనుభవించసాగాడు ''ఒరే చెమిటోడా! ముసల్దాని గుడ్డలమూట, సింకి సాపనుంట సూసినావా! అడగతుండాది ''

''ఏటే నీ సాపా! మూటా నాను సూసానే నానొచ్చేతలికి అంతా ఎవరికి వోళ్ళు లోపల సేరుకొన్నారే నీ గుడ్డలమూట, సింకిసాప ఆడనే ఉన్నాయి నాయి నేను ఎతకెళ్ళినా ఏటి ఇప్పళ్లేవా'' అడిగాడు

ముసలిదాని తల గిర్రున తిరిగింది 'ఒరే నాయి కూడా లోపల పెట్ట కూడద్రా' అనబోయి తమాయించుకొంది. తమలో అంత ఐక్యతలేదు అడుక్కొనే దాంట్లో ఎంత పోటీ. నిన్న తిండి దొరక్క పుల్లికి సంబంధించిన వీధిలో తను అడుకొన్నదని దానికి కోపం అడుక్కొన్న దాంట్లో మిగిల్చి డబ్బులు ఇవ్వలేదని చెవిటి నాగడికి కోపం ఇక తనకు ఎవరు సహాయం చేస్తారు

ముసలిదానికి దిక్కుతోయడంలేదు లోపల సత్రమంతా వెతకింది ఎక్కడా అవి కనిపించలేదు. కడుపు మండింది గుండె చెఱువయ్యింది. సత్రం చుట్టూ తిరిగి తిరిగి చూసింది. కాని ఫలితంలేదు ఇదంతా చూస్తున్న సత్రం మనుషులకు తమాషాగా ఉంది.

ఇక వెతకటానికి ఊరుమీద పడింది వీధి వీధి గాలిస్తూ ఉన్నది. ఆశ నిరాశల సంగమంలా ఉచ్ఛ్వాస విశ్వాసలు దీర్ఘంగా ఉన్నాయి. కాటికి కాళ్ళు చాపుకున్న ముసలివాడు ఇంకో వందేళ్ళు బ్రతికాలని ఆశపడ్డట్టు గాలిస్తూ ఉంది. ఇంతకీ ఆ నిధి అటూ ఇటూ అంచులు చిరిగిపోయిన చింకిచాప, చిరుగులతో నిండిన రెండు చీరలు, పది పాతగుడ్డలు కలిపికట్టిన చిన్న మూట

ఊళ్ళోని వీధులన్నీ తిరగడం పూర్తయి, చివరకు వెతుక్కుంటూ ఊరవతలకి పోయింది 'పిచ్చిదిరోయ్ పిచ్చిది.' పశువుల కాపర్లు ఈలలువేస్తూ చప్పట్లు చరిచారు ముసలిదానికివేమీ పట్టలేదు తన కార్యక్రమంలో తను నిమగ్నమయి ఉంది

ముసలిదాని ముఖాన విషాద ఛాయలు ముసురుకొంటున్నాయి తన సంపదమీద ఆశ వదలుకొంది. చింకిచాప ఆమెకు హంస తూలికా తల్పం అయితే, పాత చీరలు చీన చీనాంబరాలు 'రాత్తిరికి దేనిమీద తొంగొనేది ? కట్టుకోడానికి పాతకోక ఓరు ఇస్తరు ?? ఇయిలేకుండా దినాలు దినాలు ఎట్ల గడస్తయి ???' ఇవీ ముసలిదాని ఆలోచనలు

కాళ్ళు తేలిపోతూఉంటే ఒక చింతచెట్టుకు ఆనుకొంది ఆనుకొన్నది నిలబడే శక్తిలేక అలాగే మెల్లగా క్రిందికి జారి చెట్టు మొదట్లో కూలబడింది ఎదురుగా చూసిన ముసలిదానికి గుండె ఆగినట్లయ్యింది

ఎదురుగాఉన్న ఇంకో పెద్ద చింతచెట్టు మొదట్లో తన చింకిచాపను పరచుకొని దానిమీద తన గుడ్డలమూటను గోళ్ళతో పెరికి ఊడతీసి దాన్నీ వెచ్చగా పడక చేసుకొని పడుకొనిఉంది, ఒక కుక్క తన పిల్లలతో. దాని పిల్లలు తల్లి రొమ్ముకొసం వెతుక్కొంటున్నాయి ఆ కుక్క పిల్లల్నివేసి రెండు గంటలుకూడా అయినట్లు లేదు. అవి సరిగా కళ్ళుకూడా తెరవలేదు అత్తను తరిమి ఆ సొమ్ము అల్లుడు అనుభవించినట్లు దర్జాగా పడుకొనిఉన్న కుక్కను చూడగానే ముసలిదాని కళ్ళు తీక్షణంగా మారాయి

ముసలిది కుక్కవైపు క్రోధంగా చూసింది తనను ఇంతపనిచేసి, తన వస్తువుల్ని దొంగతనంగా తెచ్చి అంతటితో ఆగక దాన్ని పక్కజేసుకొని హాయిగా పడుకొని ఉంది కుక్క జాలినిండిన కళ్ళతో దీనంగా చూసింది తననూ తన బిడ్డల్ని ఈ చలినుంచి రక్షించమని ప్రాధేయ పడుతున్నట్లున్నాయా చూపులు కుక్కను తరిమే ఓపికలేక అలాగే కూర్చున్న ముసలిదానికి, దాని దైన్యమైన చూపులు, దాని పిల్లల అమాయకత్వం ఏవేవో జ్ఞాపకాలను అలలు అలలుగా తెప్పించాయి


* * *


ఆ వూర్లో రాఘవరెడ్డి మోతుబరి రైతు యాభై ఎకరాల పొలం, రెండంతస్థుల భవనం ఆయన ఆస్తి ఆయన సహృదయుడు పెద్ద మనిషి ఆయన భార్య అనసూయమ్మ భర్తకు తగ్గ ఇల్లాలు. ఇంటి పెత్తనమంతా ఆమెదే వారికి ఇద్దరు కొడుకులు సంతానం పెద్ద కొడుకు నారాయణరెడ్డికి ముగ్గురు పిల్లలు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు చిన్న కొడుకు జయరామరెడ్డికి రెండేళ్ళ క్రితమే వివాహ మయింది, అతనికి ఒక కూతురు మహాలక్ష్మి అవతారాల్లా ఉన్న ఇద్దరు కోడళ్ళూ అత్తగారి మాటంటే జవదాటరు అనసూయమ్మకు కోడళ్ళంటే అంత అభిమానమూ ఉంది

ఇక పిల్లలు నాయనమ్మను క్షణం వదిలి పెట్టరు అనసూయమ్మ ఇద్దరు కొడుకులు రత్నాలు. రామలక్ష్మణుల్లా కలసిమెలసిఉంటారు తల్లిదండ్రులంటే వాళ్ళకెంతో గౌరవం ఇద్దరు కొడుకులు ఎదిగివచ్చిన తర్వాత తండ్రిని సేద్యంలో జోక్యం కలిగించుకోనీలేదు ఆయన కృష్ణా! రామా! అనుకొంటూ విశ్రాంతి తీసుకొంటూంటాడు ఊళ్ళో పెద్దగా చలామణి అవుతూ అందరికీ తగిన సలహాలు చెబుతూంటాడు

ఏది ఏమయినా అందరూ ఇంటి బాధ్యత అనసూయమ్మకే వదిలివేసారు జమా ఖర్చులతో సహా అన్నీ ఆమే చూసుకొంటుంది ఇంట్లో వాళ్ళ జబ్బులు, పిల్లలచదువు ఆర్థికవిషయాలు అవసరమైన సలహాలు అన్నీ ఆమే.

అనసూయమ్మ రాత్రుళ్ళు ఆరుబయట





మంచంమీద పడుకొని ఆకాశంలోకి చూస్తూ తన కుటుంబం గుర్తించి ఆలోచిస్తూ ఉంటుంది ముత్యాల్లాంటి బిడ్డలు రత్నాల్లాంటి మనవలు తన కనుసన్నలలో మెదిలే కోడళ్ళు ధర్మరాజు లాంటి భర్త ఇక తనకేం లోటు? 'నా సంసారాన్ని ఇలాగే ఏ కష్టాలు లేకుండా గడిచి పోయేట్లు చేయి స్వామీ' అని దేవుడికి మొక్కు కుంటుంది

అయితే అనసూయమ్మ పచ్చని జీవితంలో ఆ సంఘటన మరపురానిది

చిన్నగా మొదలైన వర్షం మధ్యాహ్నమయ్యే సరికి తీవ్రమయిన వర్షంగా పరిణమించింది పనిలోకి వెళ్ళిన నారాయణరెడ్డి ఇక వీలుగాక కూలీలను పంపించివేసి ఇంటికి చేరుకొన్నాడు రాఘవరెడ్డి వెచ్చగా దుప్పటి కప్పుకొని వరండా లోని కుర్చీలో కూర్చొని చుట్ట పీలుస్తూ ఏక ధారగా కురిసే వర్షాన్ని తదేకధ్యానంతో చూస్తున్నాడు

"అత్తయ్యా! అందర్నీ భోజనానికిపిలువు వడ్డించేస్తాం" అంది పెద్ద కోడలు

వంట ఇంట్లో పీటలు వేసి వడ్డించడానికి అన్ని ఏర్పాట్లలో మునిగిపోయారు ఇద్దరు కోడళ్ళు తరువాత రాఘవరెడ్డి, నారాయణరెడ్డి భోజనానికి లేచారు నీళ్ళలో పడవలు వేసి ఆనందిస్తున్న పిల్లలు ఆట ముగించి భోజనానికి పరుగెత్తారు

"నువ్వూ కూర్చో అమ్మా" అంది అనసూయమ్మ పెద్దకోడలు నుద్దేశించి

"నేనూ మీతోపాటు తింటాలే అత్తయ్యా" అంది పెద్దకోడలు నిర్మల

"విజయా, నేనూ తరువాత తింటాంలే అమ్మా నువ్వు కూర్చో"

అత్తగారి బలవంతంమీద భోజనానికి కూర్చుంది నిర్మల

చింకి చాప

"చిన్నబ్బాయి ఇంకా రాలేదే" దిగులుగా అంది అనసూయమ్మ

"వాడికేం భయం లేదు లేవే ఈ బస్సుకు వస్తాడు" అన్నాడు రాఘవరెడ్డి

"అవునమ్మా ఇప్పుడు ఒంటిగంట బస్సుందిగా దాంట్లో ఒస్తాడ్లే" అన్నాడు నారాయణరెడ్డి తండ్రికి మద్దత్తుగా

అయినా అనసూయమ్మకు భయంగానే ఉంది. కారణం భర్త చెప్పిన వార్త ఉదయం రేడియోలో చెప్పారట ఇరవైనాలుగు గంటల్లో భారీవర్షం ఉంటుందని అది పెనుతుఫానుగా కూడా మారవచ్చని

'ఈయనేమిటి ఇంకా రాలేదు" అని దిగులుపడుతూ ఉంది విజయ

అందరూ భోజనాలు ముగించారు. అనసూయమ్మ, ఆమె చిన్నకోడలు విజయ మాత్రం, పనిమీద పట్టణం వెళ్ళిన జయరామిరెడ్డి రాకకోసం ఎదురు చూస్తున్నారు కాని అతను వీళ్ళనుకొన్నట్లు ఒంటిగంట బస్సులో రాలేదు

సాయంత్రం మూడు దాటుతుండగా ఆ జడివానలోనే తడుస్తూ వచ్చాడు జయరామిరెడ్డి తలలోంచి నీళ్ళు కారుతున్నాయి అతను తలార్చుకొని, వళ్ళు తుడుచుకొనేలోగా కూరలన్నీ వెచ్చబెట్టారు అన్నం మళ్ళీ వండారు తరువాత ముగ్గురూ భోజనాలు కావించారు

వీళ్ళు భోజనాలు పూర్తి చేసేసరికి వర్షం తగ్గుముఖం పట్టింది ఇంతటితో వర్షం ఆగిపోయింది కదాని అంతా సంతోషించారు పూరిళ్ళలో ఉన్నవాళ్ళు ఇండ్లలోంచి బయటికి వచ్చి ఊడిపోయిన తాటి ఆకుల్ని చూరుల్లో దోపుకొంటూ, కూలిపోయిన గోడల్ని చూసి దుఃఖిస్తున్నారు

మెల్లిగా ప్రారంభమైన గాలి కొద్ది సేపటికి ప్రభంజనంగా వీచడం మొదలు పెట్టింది మళ్ళీ వర్షం మొదలయింది గాలి కాస్తా తుఫానుగా మారింది పొద్దు క్రుంకి పోయింది చుట్టూ ముసురుకొన్న చీకట్లు చూస్తూంటే అందరి గుండెల్లోనూ భయం పొడిసూపింది కారణం సముద్రానికి దగ్గర్లోనే ఉంది తమ ఊరు తుఫానుకు తమ ఇళ్ళు, వాకిళ్ళు కొట్టుకుపోతే ఎలా బ్రతకాలి? అనేది వాళ్ళను వేధించే ప్రశ్న

పూరిళ్ళలోను, పెంకుటిళ్లలో ఉన్నవాళ్ళు ఆ కటిక చీకట్లోనే సురక్షిత ప్రాంతానికి బయలుదేరారు, దేవుడికి చేతులెత్తి నమస్కారాలు పెడుతూ ఇలాంటి సమయాలలో వాళ్ళని ఆదుకొనేది రాఘవరెడ్డి మేడ

గర్భవతులు, బాలింతలు వళ్ళంతా దుప్పట్లు చుట్టుకొని ఒకవైపు ఏడుస్తూనే పడుతూ లేస్తూ నడుస్తున్నారు కొంతమంది లాక్కొంటున్న పశువులగాటి పలుపులువిప్పి వదలి వేసారు చిన్న పిల్లల్ని ఎత్తుకొని కొంతమంది, ముసలివాళ్ళను భుజాన వేసుకొని కొంతమంది రాఘవరెడ్డి ఇంటివైపు ఎరుగులు పెడుతున్నారు

తమను ఈ ఆపదనుంచి తప్పించమని ఎవరికి వాళ్ళు దేవుడ్ని ప్రార్థిస్తున్నారు కాని ప్రకృతి వాళ్ళ మాటలను పెడచెవిన పెట్టింది ఝుం ఝుం మారుతంతో చెవులు మారుమ్రోగి సాగింది రాఘవరెడ్డి మేడ ఊళ్ళోని జనంతో క్రిక్కిరిసి ఉంది పిల్లల కేకలతో, ఆడవాళ్ళ రోదనలతో, మగవాళ్ళ చర్చలతో కలగాపులగంగా తయారైంది

గవదవాపు వైరస్‌తో కాన్సరు చికిత్స

గవదవాపు ఒక వైరస్ వ్యాధి కొన్ని రకాల వైరస్ క్రిముల వలన ఈ వ్యాధి సోకుతుంది అయితే ఈ క్రిములతో కాన్సరుకు చికిత్స చేయవచ్చునని జపాను డాక్టర్లు నిరూపించారు. వీటిని రోగ నిరోధక చికిత్సలు అని అంటారు ఇందులో రెండు దశలున్నాయి మొదటి దశలో ఈ క్రిములను రోగి శరీరంలోకి కొద్ది మోతాదులో ఇంజక్షన్ల రూపంలో పంపుతారు రెండు వారాలు విరామం ఉండే విధంగా రెండు ఇంజక్షన్లను ఇస్తారు రెండవదశలో, కాన్సరును నిర్మూలించగల టి—కణాలు, బి—కణాలు ఉత్పత్తి కాబోయే ముందు ఈ క్రిములను భారీగా శరీరంలోకి పంపుతారు ఈ రకం చికిత్సతో అయిదుగురిలో అండాశయ కాన్సరును, మరో అయిదుగురిలో మూత్రాశయ కాన్సరును నయం చేసినట్లు వీరు తెలియ చేశారు.

ఎవరు ఎలా ఉన్నారని రాఘవరెడ్డి అందర్నీ పరామర్శిస్తున్నాడు. అనసూయమ్మ చిన్న బిడ్డల్ని సముదాయిస్తూ, గర్భవతులకూ, బాలింతలకూ జాగ్రత్తలు చెబుతూ ఉంది అందరి గుండెల్లోనూ భయం తాండవిస్తూ ఉంది.

ఇంతలో బయట క్రింద మెట్టువరకూ ఉన్న నీళ్ళు పైకుబికాయి. పై మెట్టుమీద నుంచి వరండాను తాకాయి ఆ మెరుపు వెలుగులో చూస్తున్న వాళ్ళ గుండెలు ఝల్లుమన్నాయి అవి వర్షపు నీళ్ళులాలేవు ఎవడో వంగి కొద్దిగా నీళ్ళు నోట్లో పోసుకున్నాడు నీళ్ళు ఉప్పగా ఉన్నాయి

"సముద్రం పొంగిందిరో" పెద్దగా అరిచాడు

ఆ కేక అందరికీ చావు కేకలా వినిపించింది. ఎక్కడివాళ్ళక్కడే బిర్రబిగుసుకుపోయారు సముద్రం పొంగడమా! ఓర్నాయనో అనుకొన్నారు. అందరూ రెండవ అంతస్తు చేరుకున్నారు రాఘవరెడ్డి, ఆయన ఇద్దరు కొడుకులూ క్రిందనే ఉండి, టార్చిలైట్లు వెలిగించి కొందరి సాయంతో ముఖ్యమైన వస్తువులను పైకి చేరవేస్తున్నారు క్రమేణా క్రింది అంతస్తు అంతా నీటితో నిండిపోయింది

తరువాత రెండో అంతస్తులోకూడా నీరు చేరడంతో అంతా మేడ పైభాగాన చేరారు. పైన్నుంచి పడే వర్షం, ఈదురుగాలి, కటిక చీకటి ఏమీ తోచడంలేదు. కోడళ్ళిద్దర్నీ, చిన్న పిల్లల్నీ ప్రక్కనే పెట్టుకొని దుప్పటి కప్పుకొని ఉంది అనసూయమ్మ. ఆమె, తను ఎవరికి ఏం అపకారం చేసిందా? అని ఆలోచిస్తూ ఉంది భర్త, ఇద్దరు కొడుకులు ఎక్కడ ఉన్నారో ఆమెకు తెలియదు మేడమీద ఉన్న అందరూ ప్రాణాలమీద ఆశ గోల్పోయి ఉన్నారు రెండవ అంతస్తులో ఏదో వస్తువులు కోసం పోయిన రాఘవరెడ్డి, అతని ఇద్దరు కొడుకులు పైకి రాలేదు రెండవ అంతస్తు పూర్తిగా నిండిపోయింది. తరువాత గోడ చేపట్టువరకు నీళ్ళు ఉబికి అంతా సమతలంగా కనిపిస్తూ ఉంది.

ఒకే పెద్ద దుప్పట్లో అనసూయమ్మకు ఆవైపు, ఈవైపు చెరొక బిడ్డను ఎత్తుకొని నిలబడి ఉన్నారు ఇద్దరు కోడళ్ళూ పన్నెండేండ్ల వాడు, పద్నాలుగేళ్ళవాడు ఆమె ముందు నిలబడి ఉన్నారు. వాళ్ళ నడుములకు పైగా నీళ్ళు వచ్చి ఉన్నాయి

"అత్తయ్యా! మావగారూ, బావా, ఆయనా క్రిందికి వెళ్ళారు. ఎక్కడ ఉన్నారో ఏమో? చివరకు ఏమవుతుందో?" అంది ఏడుస్తూ చిన్న కోడలు.

"ఇంకేమవుతుంది విజయా. మనకిక చావే శరణ్యం చచ్చే క్షణంలోనయినా ఆయన్నొకసారి చూస్తే మంచిది" వెక్కి వెక్కి ఏడ్చింది పెద్ద కోడలు నిర్మల

అహంభావం !

నా మనసు
అద్దం లాంటిది
అద్దంలో అందానికి
మైమఱచినట్లు,
నా మనసు
జ్ఞానజ్యోతులతో
వెలిగిపోతోంది
కానీ, అంతలోనే
మైకంలో అద్దం
చేజారి చెడింది,
నా మనసులో
అహంభావం ఆవరించి
నా జీవితాన్నే
నాశనం చేసింది

— కొండవలస శ్రీనివాసరావు

అనసూయమ్మ కారే కన్నీటిని తుడుచుకోకనే "అలా అనకండమ్మా ఇకనయినా ముంపు తగ్గుతుందేమో చూద్దాం నాబంగారు మనవళ్ళ ముఖం చూసయినా దేవుడికి జాలి కలక్కపోదు" అంటూ తన ఒళ్ళో ఒదిగి నిలబడి ఉన్న ఇద్దరి బుగ్గలు నిమిరింది. వాళ్ళు కొయ్య బొమ్మల్లా అచేతనంగా నిలబడి ఉన్నారు

ఇద్దరు కోడళ్ళు ఎత్తుకొని ఉన్న ఇద్దరు చిన్న పిల్లలు ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి పోయి ఉన్నారు

"అత్తయ్యా! ఇక మనకు చావు తప్పదు ఎంత ఆనందంగా బ్రతికాము చివరకు ఎలా చావాల్సి వచ్చింది నేను చచ్చినా ఫరవాలేదు ఆయనా ఆయన పిల్లలూ బ్రతికితే చాలు ఏ లోకంలో ఉన్నా నేను అది చూసి ఆనందిస్తాను!!" దుఃఖంతో పూడుకుపోయినగొంతుతో అంది పెద్ద కోడలు


"అంతే అక్కా అంతే. వాళ్ళకోసం మనం ఎంత కష్టపడయినా పిల్లల్ని బ్రతికించుకోవాలి ఆ ప్రేమ, ఆదరణా మనం మరచిపోగలమా మామగారు సాక్షాత్తు దేవుడు అత్తగారు సాక్షాత్తు లక్ష్మీదేవి ఓర్వలేని దేవుడు మన అదృష్టాన్ని కూలదోసాడు." బిగ్గరగా ఏడ్చింది నిర్మల కూడా పెద్దగా రోదించింది అనసూయమ్మ ఏడుపుకు అతీతంగా ఉంది

"అత్తయ్యా నా బిడ్డలు, నా కళ్ళముందే చచ్చిపోతున్నారు వాళ్ళను రక్షించు అత్తయ్యా వాళ్ళ ప్రాణాలు నా కళ్ళముందు పోతుంటే చూడలేను"

అనసూయమ్మ ఏం చేయగలదు? కోడళ్ల మాటలకు అప్పటివరకూ ఆమె ఉగ్గపట్టుకొన్న దుఃఖం ఒక్కసారిగా కట్టలు తెంచుకొని ప్రవహించింది మనవళ్ళ తలలు స్పృశిస్తూ బిగ్గరగా ఏడ్చింది ఇంతలో ఆరడుగుల ఎత్తుతో వచ్చిన ఒక పెద్ద అల అందర్నీ ఈడ్చికొట్టింది. అంతా హా హా కారాలు చేస్తూ ఉప్పెనలో మునిగిపోయారు

అనసూయమ్మ మేడమీదనుంచి అగాధంలో పడిపోయింది ఆ పడటంలో ఆమె చేతికేదో గట్టిగా తగిలింది. దాన్నలాగే పట్టుకొంది నీటిలో మునిగిన అనసూయమ్మ పైకి తేలింది అదొక పెద్ద కొయ్యదుంగ. ప్రాణాలమీద ఆశతో ఎలాగో ఆ దుంగమీద కూర్చొని దాన్ని పట్టుకొంది. అది అలా ఎంత దూరం ప్రయాణించిందో తెలియదు ఒకచోట చెట్టుకొమ్మల్లో ఇరుక్కుపోయింది. అనసూయమ్మ మతి చెడిన దానిలా అలాగే ఆ రాత్రంతా కూర్చొంది ఉప్పెన పోయి క్రమేణా నీరు తగ్గసాగింది

తెల్లవారేసరికి నీరు పూర్తిగా తగ్గిపోయింది ఒక పెద్ద మర్రిచెట్టు శిఖరాగ్రంలో



ధర్మపథం

—బులుసు వేంకటరమణయ్య



దేవుని తోడ్పాటు

సాధారణంగా మంచి రూపం ఉన్నచోట మంచి గుణాలే ఉంటాయి. ఈ అభిప్రాయం పురాతన కాలంనుంచీ ఉన్నది ఎక్కడో తప్పిపోతే తప్పిపోవచ్చునేమోగాని, మూడు వంతులు తప్పిపోదు వికారరూపం గలవారి బుద్ధి వక్రంగానే ఉంటుందట! ఆ విధంగానే మంచి సంకల్పం ఉన్నవారికి భగవంతుడు చిక్కులను తప్పించడానికి తోడ్పడుతూ ఉంటాడు చెడ్డతలపు గలవారి ప్రయత్నం సాగనివ్వడు

పాండ్యదేశ రాజధాని అయిన మధురా నగరంలో మాణిక్యవల్లి అనే వేశ్య ఉండేది ఆమెకు ఇద్దరు కుమార్తెలు. జన్మాంతర వాసనవల్ల వారిద్దరికి గాఢమైన శివభక్తి ఉండినది నిత్యమూ శివాలయానికి వెళ్లి దేవదర్శనం చేసుకుంటేనేగాని భోజనం చేసే వారు కారు. వారు పెరిగి పెద్దవారయిన తర్వాత తల్లి వారిద్దరినీ వేశ్యావృత్తిలో దింపడానికి ప్రయత్నించింది ఆ వృత్తివల్ల ఎక్కువగా ధనం సంపాదించవచ్చుననీ, విలువైన నగలు ఎక్కువగా చేయించుకోవచ్చుననీ ఆమె ఎంతో బోధించింది తల్లి మాట వారు వినలేదు పరమేశ్వరుడు తప్ప మరో ప్రపంచమే తమకు లేదన్నారు. అయినా తల్లి తన అభిప్రాయాన్ని మార్చుకోలేదు

ఇక, అక్కడవుంటే తల్లి నిర్బంధం ఎక్కువ అవుతుందని భయపడి అక్కచెల్లెళ్లిద్దరూ ఆ వూరు విడిచి, దక్షిణ కైలాసమైన శ్రీకాళహస్తి క్షేత్రానికి పోయి అక్కడే దేవుని సేవిస్తూ ఉండదలిచారు డబ్బు కొరత లేదు కావలసినన్ని విలువైన నగలున్నాయి అవి అమ్ముకొని కాలం గడప వచ్చునని అనుకొన్నారు కాని, అక్కడికి వెళ్లడమెలాగు? చాలా దూరంలో ఆ క్షేత్రం ఉన్నది. తమకా దారి తెలియదు వాళ్లు ఆలోచనలో పడ్డారు ఇదంతా ఇద్దరు దొంగలు కనిపెట్టారు తాము జంగం వేషాలు ధరించి, శ్రీకాళహస్తికి పోతున్నామని వాళ్లకు తెలియజేశారు "మమ్మల్ని భద్రంగా తీసుకువెళ్లగలరా?" అని అడుగగా "తప్పక తీసుకువెళ్లగల"మని మిక్కిలి నమ్మకం కలిగేటట్లు చెప్పారు తల్లికి తెలియకుండా ఆ కన్యలిద్దరూ, ఆ మోసపు జంగములవెంట జంగము రాండ్ర వేషాలతో వెళ్లారు మజిలీలలో ఏ రాత్రి సమయంలోనో, లేదా అడవిలోనో ఆ కన్యలను చంపి, వారివద్దనున్న నగలు తీసికొనిపోవాలని ఆ దొంగలు నిశ్చయించారు ఈ చోరుల ప్రయత్నం మహేశ్వరునికి తెలియును. అందువల్ల ప్రతి రాత్రి, జంగం వేషంలోనో, శివభక్తుని వేషంలోనో వీరు బస చేసే చోటికి వస్తూ, వీరికి శైవధర్మాలు బోధిస్తూ, రాత్రివేళల వీరి సంకల్పానికి ఆటంకం కలిగించేవాడు. అడవుల్లో ప్రయాణం చేసేటప్పుడు, రాజు సైన్యంతోను, వర్తకులు తమ సామాన్లతోనూ, గొల్లలు తమ పశువులతోనూ ప్రయాణం చేస్తున్నట్లు దొంగలకు కనపరిచేవాడు ఇక— శ్రీకాళహస్తికి ముందున్న అడవిలో ఎలాగయినా ఈ కన్యలను చంపాలని దొంగలు నిశ్చయించారు అప్పుడు శివుడు ప్రమథగణంతో జంగమ వేషాలతో తమ మీదికి రావడం చూచి, ఆ దొంగజంగాలు భయపడి పారిపోయారు ఆ జంగాలు ఆ కన్యలను ప్రశ్నించగా, వారు తమ వృత్తాంతాన్ని వివరంగా చెప్పారు దొంగజంగాలను నమ్మకూడదని చెప్పి, వారు ఆ యిద్దరినీ భద్రంగా ఆ క్షేత్రం చేర్చి, వెంటనే మాయమయ్యారు అప్పుడు ఆ కన్యలకు తెలిసింది, తమ్ము రక్షించినవాడు మహేశ్వరుడే అని భగవంతుడు ఆ విధంగానయినా తమకు దర్శనమిచ్చినందుకు వాళ్లకు ఎంతో ఆనందం కలిగింది.

మంచివాళ్లకు భగవంతుని తోడ్పాటు ఎప్పుడూ ఉంటుంది ★

కొమ్మల్లో ఇరుక్కుపోయిన ఆమె అలాగే ఉంది పైన తిరుగుతున్న హెలికాప్టర్ల సందేశాన్ని పునస్కరించుకొని రక్షక దళాలు ఆమెను క్రిందికి దించాయి.

తరువాత అనసూయమ్మ విచారించి తనవాళ్ళెవరూ మిగలలేదని తెలుసుకొంది అందరూ మట్టికొట్టుకుపోయారు. ఊరంతా శవాలే కొన్ని శవాలు గుర్తుతెలియడంలేదు మరికొన్ని శవాలు మట్టిలో కూరుకుపోయి ఉన్నాయి బ్రతికినవాళ్ళను వ్రేళ్ళమీద లెక్క పెట్టవచ్చు

ఊరంతా తుడిచిపెట్టుకుపోయింది అనసూయమ్మ భవనం నేలమట్టమైపోయింది. భూముల్లో మనిషెత్తున ఇసుకమేటలు పెట్టేసింది. 'ఇంకేముంది అంతా సర్వనాశనం' అనుకొంది అనసూయమ్మ

చింకిచాప

నిరాశ్రయులయినవారికి ప్రభుత్వం ఇళ్ళు కట్టిస్తామని ముందుకు వచ్చింది అది ఆమెకు ఇష్టంలేదు బంధువులింటికిపోక, అక్కడే ఉండి ఆ స్మృతుల్ని మరచిపోలేక, కొంతమంది అలగాజనంతో కలసి యాచకవృత్తిలో ప్రవేశించి ఊళ్ళు పట్టుకువచ్చేసింది ఎవరితో పలకకుండా ఈ లోకంతో సంబంధం లేనట్లు ప్రవర్తించే ఆమెని చూసి ప్రజలు పిచ్చిదానిక్రింద జమ కట్టేరు ఎవరు ఏమనుకొన్నా అనసూయమ్మ తన జీవితాన్ని ఇలా నెట్టుకొస్తూ ఉంది ఇరవై ఏళ్ళనుంచీ

* * *

ఆలోచనల్లోంచి తెప్పరిల్లి ఆనాటి తన సౌభాగ్యాన్ని, ఈనాటి తన దారిద్ర్యాన్ని తలచుకొని తలచుకొని దుఃఖించింది. తన కుటుంబంలోని సభ్యులంతా ఒక్కొక్కరే గుర్తుకువచ్చి కన్నీరు కార్చింది

ఎదురుగా చూసింది జాలిగా తనవైపు చూస్తూ ఉంది తల్లికుక్క కళ్ళు సరిగా కనపడని నాలుగు కుక్కపిల్లలూ 'కుయ్ కుయ్' మంటూ తల్లి చుట్టూ తిరుగుతున్నాయి

ముసలిదైన అనసూయమ్మకు తన మాట మన్నించే కోడళ్ళూ, ఎప్పుడూ తనచుట్టూ తిరిగే మనవళ్ళు, మనవరాండ్రూ గుర్తుకు వచ్చారు కళ్ళలో నీళ్ళు నిండుకున్నాయి జాలిగా కుక్కవైపు, ప్రేమగా అమాయకమైన పిల్లల వైపు చూసి లేచి నిలబడింది

తన చింకిచాపకు, పాతగుడ్డల మూటకు సరైన ప్రయోజనం చేకూరిందని ఆమె కిప్పుడు తృప్తిగా ఉంది. ఆనందంగా ఊరివైపు అడుగులు వేసింది. ●



daCunha/AS/9/83/TL

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

ఐ. కె. అర్. — కుత్తుం

ప్రేమించుకునే ముందున్న సరదా పెళ్లి చేసుకున్న తర్వాత ఉండదంటాను మీరే మంటారు ?

★ ఎలా వుంటుంది ? బువ్వ సంపాదించే మార్గాలు చూసుకోవాలి కద !!

కె. వి. — పాయికరావుపేట

నవ్వే ఆడదాన్ని బ్రతకనివ్వరా యీ మగవాళ్ళు ?

★ నవ్వులో చాలా అర్థాలుంటాయి అందుకే — వెకిలిగా నవ్వడం, విరగబడి నవ్వడం, దొంగనవ్వులు నవ్వడం సభ్యతకాదు నవ్వాస్తే నవ్వండి కాని నర్మగర్భంగా నవ్వితేనే చిక్కు.

ఎమ్. వి. కె. — ఉరవకొండ

సముద్రం ముందు మానవజీవితం అలలతో సమానం అంటారు మీరేమంటారు ?

★ సముద్రం 'ముందుంటే' అలలుబాగానే వుంటుంది— తప్పించుకు సాగవచ్చు ! కాని సముద్రాన్నే పొంగించుకుంటూ విరుచుకు పడతాయి— అదే చిక్కు

ప్రస్తుత సమాజంలో చదువుకొన్న విద్యార్థికి ఉద్యోగం దొరుకుతుందా ?

★ చదువు 'కొన్న'వాడైతే ఉద్యోగంకూడా కొనకల్గుతాడు కాని చదువుకున్నవాడిదే కష్టం అంతా. డిగ్రీలమీద మోజు తగ్గించుకుని వృత్తి నేర్పే విద్యలు నేర్వడం మంచిది

ఎ. పి. అర్. — బరంపురం

అక్కయ్య, వైఫ్ అనగా వర్కింగు ఇన్‌స్ట్రుమెంట్ ఫర్ ఎన్‌జాయిమెంటు అని నా అభిప్రాయం ?

★ ఈ పిచ్చిగోలకి ఇంగ్లీషెందుకు ? తెలుగులోనే చెప్పొచ్చు కద! దీన్నే నా భాషలో చచ్చు అభిప్రాయం అంటాను

కె. వి. అర్. — గుడివాడ

కూలి డబ్బుతో లాటరీ టిక్కెట్టు .లాటరీ టిక్కెట్టుకొనే దురాశా జీవులకు ఎవరో వస్తారని, ఏదో మేలు చేస్తారని అన్న పాట రేడియోలో విని వెంటనే 'భాగ్యలక్ష్మి మీ ఇంట కనకవర్షం కురిపిస్తుంది— భాగ్యలక్ష్మి లాటరీ టిక్కెట్టు కొనండి' అని విన్నప్పుడు మీకు ఏమనిపిస్తుంది ?

★ నా అదృష్టం బాగుంది— మద్రాసులో ఆంధ్ర స్టేషనుల గరగరల మధ్య యివేం వినే దురదృష్టం పట్టదు ! అయినా మన హిపోక్రసీకివన్నీ నిదర్శనాలు

వై. హెచ్. ఎస్. అర్. — దోర్నకల్

యూనివర్సిటీలు నిరుద్యోగాలని పెంచే కార్ఖానాలు అన్నాడు ఒక కవి మీరేమంటారు ?

★ ఈ నగ్నసత్యం తెలుసుకోడానికి, తెలుపడానికి— రవికానని చోట కానగల 'కవి' కానక్కర లేదు ! గుడ్డివారికి సహితం తెలుస్తుందీ సంగతి

మారుతున్న సమాజంలో యువతలో చైతన్యపు భావాలు ఆశయాల ఆరాటం తొంగి చూసేదెప్పుడు ?

★ మీ చుట్టూ ఓసారి కలయ చూడండి బ్రదర్, వినబడడం లేదా— వారి ఘోష ? సంధికాలంలో సమిధలైపోతూన్న వారి ఆక్రోశ ?!

కె. కె. అర్. — రాయఛోటి

అనురాగానికి, అభిమానానికి తేడా ఏమిటి ?

★ అనురాగానికి ప్రేమా — అభిమానం యిష్టం అని చెప్పకోవాలి

కె. వి. ఎస్. ఎస్. — గజపతినగరం

మనిషి తృప్తిగా బ్రతకడానికి ఏంచేయాలి ?

★ ఆశలు తగ్గించుకోవడం, పరిమితంగా కుటుంబాన్ని వుంచుకోవడం, మనస్సుని ఆహ్లాదంగా వుంచుకొందుకు ప్రయత్నించడం (అంటే బారుల్లో క్లబ్బుల్లో కాదు) యింట్లో పెళ్లాం పిల్లలతో సరదాగా గడపడం అలవాటు చేసుకోవడం—మొదటి మెట్లు—

కె. అర్. కె. — ఖమ్మం

ఆడాళ్లని ప్రోత్సహించకండి — వాళ్లకిచ్చే మర్యాదలు యిచ్చాం ?

★ అలాగా కట కటా ! రామకృష్ణా ! మేం మీ పట్ల అదే అనుకుంటూ వుంటే — ఎలా వుంటుంది ? !

కె. బి. డి. — చేబ్రోలు

వరకట్న దురాచారంలో స్త్రీల పాత్ర ఉన్నదా ? లేదా ?

★ ఎందుకు లేదు. వారిదే ముఖ్యపాత్ర నిజానికి దాని అంతు చూడ కల్గేది కూడా వాళ్లేనని— నా నమ్మకం

కె. అర్. — బళ్ళారి

'నేటి భారతం' పై మీ అభిప్రాయం ?

★ నేనా సినిమా చూడలేదు ! బాగా ఆడిందంటున్నారు (లేక మీరు అడుగుతున్నది— దేశం గురించి కాదు కదా ?)

పి. పి. ఎస్. — కొటాల


ఎప్పుడూ ఆడదాని పని త్యాగం చేయడం గానే వుంటుంది అని, మీ నిర్వచనం ఏమిటో సెలవిస్తారా ?


★ అంత సెలవివ్వడం ఎందుకు ? చూడడంలేదా మీరు ?

పి. కె. ఎల్. — పాలకొల్లు

పది మందిలో ఒక మగవాడు అన్నంత మాత్రాన మన జాతిని కించపరచడం అంత మంచిది కాదనుకుంటాను ప్రాచీనులు తెలివి తక్కువై స్త్రీలకి ఆంక్షలు పెట్టలేదు

★ చిత్రం గురూ, మగాళ్లు సృష్టించిన రూల్సు అన్నీ ఆడదాని కోసమేనని తెలియనిది కాదు నా తెలివి. కాని అది వాళ్లకే ఎందుకని మాత్రమే నేను ప్రశ్నించేది ! ఇక జాతినంతా అనలేదు నేను—మరి గుమ్మడికాయ దొంగ అనే సరికి మీరు భుజాలు తడుముకుంటున్నారని—నా అనుమానం. ఆలోచించండి ! ★





స్వామియే శరణం అయ్యప్ప!

కేరళ రాష్ట్రంలోని శబరిమలై అడవుల్లో వెలసిన స్వామి అయ్యప్ప ప్రాభవం ఇటీవల దేశవ్యాప్తంగా విస్తృతమైన సురభిళ పరిమళాలతో మధుర మోహనంగా వికసించటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఇడిక్కి జిల్లాలోని చాలకాయం ఊరికి అయిదుమైళ్ళ దూరంలో నడకదారి తప్ప ఏ రవాణా సౌకర్యంలేని దట్టమైన అడవుల్లో అయ్యప్ప నిలబడి అశేషభక్తవాహినిని తరింపజేస్తూ ఉండడం ఎంతో ఆసక్తిని కలిగిస్తుంది. ఎన్నో మహాత్మ్యాలు చూపించిన స్వామిఅయ్యప్ప. ఇంకా మహిమలను చూపిస్తూనే ఉన్నాడా హరిహర సంభూతుడు !

అయ్యప్ప చరిత్ర విచిత్రమైనది. మోహినీ అవతారమెత్తిన విష్ణు భగవానునికీ ముక్కంటి పరమశివునికీ జన్మించిన కుమారునిగా అయ్యప్పకు ఎంతో విలువైన స్థానముంది. శైవులకు, వైష్ణవులకు ఈ వృత్తాంతం—అది అభూత కల్పనమే అయినా కన్ను తెరిపించేదిగా ఉంది. మతోన్మాదంతో మారణహోమాల్ని సృష్టిస్తున్న వారికిశివకేశవతత్వం మానవ తత్వమేనన్న సందేశం అయ్యప్ప స్వామి జీవిత చరిత్ర ప్రబోధిస్తుంది. అయ్యప్ప చూపుతున్న చిన్ముద్ర జీవాత్మ పరమాత్మల ఏకోదర సంబంధాన్ని స్పష్టం చేస్తుంది. వామహస్తాన్ని పాదాల వైపుగా చూపుతున్న భంగిమ శరణన్నవారిని రక్షించే ఉదాత్త మానుష ధర్మాన్ని వ్యక్తపరుస్తుంది.

స్వామిఅయ్యప్ప నిష్ఠాగరిష్ఠుడు, బ్రహ్మచారి. ఋతుస్రావము కాని మహిళలు మాత్రమే ఆయనను దర్శించవచ్చు, పుష్పవతులైన వారు కాని యవ్వన దశలో ఉన్నవారుకాని ఈ స్వామిని చూడరాదన్న ఆంక్షఉంది. పురుషుల విషయంలో ఎటువంటి ఆక్షేపణలూ లేవు. భారతదేశంలో స్త్రీలకు సంబంధించి ఇలాంటి నిషేధముండడం ఈ ఆలయంలోనేనని అన్పిస్తుంది. అయ్యప్పను దర్శించడానికి వచ్చే భక్తుల తపోగరిమ, నిష్ఠ సడలకుండా ఉండటానికే ఈ నియమమని కొందరంటారు. కాని స్త్రీలను చూచినంత మాత్రాన నిష్ఠ సడలిపోతే, అదేమి నిష్ఠ అని ఎవరైనా ప్రశ్నించవచ్చును. భగవద్దర్శనానికి స్త్రీ, పురుషభేదం లేదు. ''పరమాత్ముడొక్కడే పురుషుడు, మిగిలిన వారంతా స్త్రీలే నా దృష్టిలో'' అన్న కృష్ణ భక్తురాలు మీరా మాటలు ఆలకించవలసినవి. అడవిదారి స్త్రీలకు అసౌకర్యంగా ఉంటుందేమో నన్న అనుమాన ముండవచ్చు. అయినా స్త్రీ, పురుష వివక్ష మన సంస్కృతికే విరుద్ధం. స్త్రీ ఆదిశక్తియని, జగన్మాతయని కదా మన పురాణాలు వివరించేది.

అయ్యప్ప దర్శనానికి కొన్ని నియమాలున్నాయి. కష్టసుఖాలను సమంగా భరించాలన్న గీతావాక్యానికి ఈ నియమాలు అవసరమని అనిపిస్తాయి. మకరసంక్రాంతికి 48 రోజుల ముందే శబరిమలైకు వెళ్ళివచ్చిన గురుస్వామి వద్ద ఉపదేశం పొంది తులసిమాల ధరించాలి. అప్పటినుంచి కఠిన బ్రహ్మచర్యాన్ని ఆశ్రమ జీవితాన్ని అలవరచుకోవాలి. వణుకు పుట్టించే చలి కాలమైనా రెండు పూటలా చన్నీళ్ళ స్నానం చేసి పూజా కార్యక్రమాలు నిర్వర్తించాలి. శాంతంగా, ప్రశాంతంగా జీవించాలి. ముట్టు వనితలను చూడరాదు. స్త్రీల వంటకాలు వాడరాదు— అనే నియమాలు అశాస్త్రీయమైనవేమోనన్పిస్తాయి. మడికీ, మైలకు సమదర్శన స్థాయికావాలి. అందుకే కాబోలు చండాలుని, ఛండాలుడు భక్షించే కుక్కని, మహాపండితుని, ఏమీ తెలియని పామరుని సమదృష్టిలో చూచి నప్పుడు ఏకాత్మ కనిస్తుందని గీతలో హృషీకేశుడన్నది. అయితే అందరిలోనూ అట్టి దృక్పథం కానరాదు. ఎవరెవరు ఆత్మ సంస్కారాన్ని బట్టి, ప్రారబ్ధకర్మను బట్టి స్థాయిలు మారుతూ ఉంటాయన్నది నిర్వివాదాంశం !

నీలిమలైలోని పంపానదిలో తానమాడి, ఇరుముడి ధరించి అళుదానదిని దాటుకొని పదునెనిమిది మెట్లు ఎక్కి మకర సంక్రమణం నాడు జ్యోతిగా కానవచ్చే అయ్యప్పను చూడటం పూర్వకృత సుకృతమని, అది అనుభవైకవేద్యమని ఎందరో భావిస్తారు. ఈ పుణ్య క్షేత్రాన్ని 18 సార్లు దర్శించితే మోక్షం ప్రాప్తిస్తుందని జనబాహుళ్యంలో ఉన్న విశ్వాసం. ధార్మికచింతన మౌఢ్యంలో పడక సమాజ హితువును కోరుతూ పదికాలాలపాటు నిలబడేలా మానవజాతి సంస్కృతిని జాగ్రత పరస్తూ ఉండాలి. స్వామి అయ్యప్ప నిర్వర్తించింది కూడ అదే !

—డాక్టర్ గుమ్మనూరు రమేష్‌బాబు



సినిమా



అక్కినేని, రాధిక 'అనుబంధం'



'మేమూ మీలాంటి మనుషులమే' లో దీప

మేమూ మీలాంటిమనుషులమేలో ముసలి ముచ్చట్లు

సుష్టుగా భోంచేసిన కరుణాకరరావు గదిలో మంచంమీద ఉస్సూరుమంటూ మేనువాల్చాడు. పాలగ్లాసుతో వచ్చిన భార్య సుశీలమ్మ కళ్ళల్లోకి చూస్తూ, ఆమె చెయ్యి పట్టుకున్నాడు. ''నువ్వు పాలగ్లాసు తీసుకొని గదిలోకి వచ్చినప్పుడల్లా మనస్సు ముప్ఫై సంవత్సరాలు వెనక్కు పరుగెత్తుతుందోయ్ ... ఆ తొలిరేయి... తీపి గుర్తులు..''

సుశీలమ్మ నొసలు చిట్లించింది. ''పెళ్ళీడు కొచ్చిన పిల్ల ఇంట్లో ఉన్నదన్న విషయం ఒక్కమారు జ్ఞాపకం తెచ్చుకోండి. మనస్సు మళ్ళీ ముందుకు పరుగెత్తి వయస్సును చేరుకుంటుంది.''

''రస హృదయం లేదోయ్ నీకు. మంచి మూడ్ పాడు చేశావు. శాస్త్రకారు లేమన్నారో తెలుసా ? ముసలితనం శరీరానికే గాని, మనస్సుకు లేదుట.''

''ఆ శాస్త్రకారులే ఎదిగి ఆడపిల్ల తల్లి దండ్రుల గుండెలమీద కుంపటి అని కూడా అన్నారు.''

దాంతో కరుణాకరరావు గాలి తీసేసిన సైకిల్ ట్యూబులా చప్పబడిపోయాడు. వెంటనే భుజాన కండువా వేసుకుని, బయలుదేరాడు.

దీప, శరత్‌బాబు, రాళ్ళపల్లి, హేమసుందర్, జానకి, వరలక్ష్మి, కొందరు ఔత్సాహిక కళాకారులు పాల్గొన్న ఆల్ఫా ఓమేగా క్రియేషన్స్ ''మేమూ మీలాంటి మనుషులమే'' చిత్రాన్ని కె. వి. ఫణీంద్ర దర్శకత్వంలో జెస్సి. ఎస్. బార్నబాస్ నిర్మించారు

'కోడలు దిద్దిన కాపురం'లో మోహన్, నళిని




విశేషాలు

-జి. వి. జి.



'సంతానం'లో సుమలత, మురళీమోహన్



'బొబ్బిలి బ్రహ్మన్న' కృష్ణంరాజు

భానుప్రియ పుట్టినరోజు :

"జేమ్స్‌బాండ్ 999" గా సుమన్ నటిస్తున్న యీ గూఢచారి వర్ణచిత్రంలో భానుప్రియ కథానాయిక. యీమె పుట్టిన రోజు జనవరి 15 యీ సంవత్సరం సంక్రాంతి పండుగగా రావటం ప్రత్యేకం. భానుప్రియ 17వ పుట్టినరోజు వేడుకలని మారేడుమిల్లికి 10 కి. మీ. దూరంలో ఉన్న "పాములేరు"లో షూటింగ్ మధ్యలో నిర్మాత యస్. వి. సుబ్బరాజు ప్రత్యేకంగా జరిపించారు.

సుమన్— భానుప్రియ జంటగా నటిస్తున్న యీ భారీ గూఢచారి వర్ణ చిత్రంలో త్యాగరాజు, గొల్లపూడి, ఈశ్వరరావు, సుదర్శన్, సిలోన్ మనోహర్, రాళ్లపల్లి, శ్రీరాజ్, రాజ్‌కుమార్, త్రినాథరావు, ప్రసాద్, ప్రకాష్‌రెడ్డి, కమలాకర్, అనిత, శ్రీలక్ష్మి, జయవిజయ, జయమాలిని, ఉషాచౌదరి, వేజెళ్ల రాజేశ్వరీలతోపాటు పద్మ అనే క్రొత్త అమ్మాయిని పరిచయం చేస్తున్నారు. హీరో రామకృష్ణ ఓ వినూత్న పాత్రను యీ చిత్రంలో పోషించడం ఓ ప్రత్యేకత.

శ్రీవాణి సినీ ఆర్ట్స్ పతాకంపై తయారవుతున్న యీ చిత్రానికి మాటలు— శ్రీనివాస రెడ్డి, పాటలు— వేటూరి, డా॥ సి. నారాయణ రెడ్డి, అప్పలాచార్య. సంగీతం— రాజా... కోటి, ఛాయ— యస్. యస్. రాజు, కూర్పు— గౌతం రాజు. కో డైరెక్టర్ — ముత్యాల సుబ్బయ్య. సహకార దర్శకులు— వెంకటేష్, ప్రసాద్, సహాయ దర్శకత్వం— శ్రావణకుమార్, ప్రొడక్షన్— మోహన్‌రెడ్డి, శివారెడ్డి, స్టిల్స్— సుధీ ఫోటోస్, ఆఫీస్ ఇన్‌ఛార్జి— బంగారురాజు ముఖ్య సాంకేతిక వర్గం.

కథ... సమర్పణ— యస్. వి. సుబ్బరాజు, నిర్మాత—వి. యస్. రంగనాధవర్మ. స్క్రీన్‌ప్లే... దర్శకత్వం— పి. చంద్రశేఖరరెడ్డి. అనపూర్ణ ద్వారా యీ చిత్రం విడుదలవుతుంది.

'సితార'లో సుమన్, భానుప్రియ






స్త్రీ మనోభావాలకు అందమైన భాషలు ఎన్నెన్నో.
అందులో విమల్ ఒకటి.



చీరలు
జార్జెట్ • షిఫాన్
వాయిల్ • టిష్యూ • క్రేప్



హిందీ చిత్ర విశేషాలు!

★ అక్బర్ ఖాన్ చిత్రం "హాద్సా" ట్రెయిలర్ బొంబాయి లోని ఐదు థియేటర్ల ముందు వీడియో స్క్రీన్‌లపై ప్రదర్శింపబడింది.

★ నిరుడు సెప్టెంబర్ 26న దేవానంద్, డిసెంబర్ 11న దిలీప్‌కుమార్ 60వ ఏట ప్రవేశించారు. అరవై ఏళ్ళు పై బడిన రాజ్‌కపూర్, అశోక్‌కుమార్ కలిసి తొలిసారిగా "చోర్ మండలి" అనే చిత్రంలో నటిస్తున్నారు.

★ కె. విశ్వనాథ్ దర్శకత్వంలో తయారయ్యే "శంకరాభరణం" హిందీ చిత్రంలో దిలీప్‌కుమార్ ప్రధాన పాత్రధారి.

★ ఎనిమిదేళ్ళ అనంతరం సైరాబాను "దునియా" చిత్రంలో తిరిగి నటిస్తోంది.

★ మనోజ్‌కుమార్ రూపొందించే ప్రతి చిత్రంలోనూ అతని పాత్ర పేరు భరత్. ఇప్పుడతని పెద్ద కొడుకు విశాల్‌గోస్వామితో తీసే చిత్రం పేరు "భరత్‌కా బేటా".

★ "నిర్వాణం" చిత్రంలో నటి సారిక సిగరెట్, మద్యం సేవించే సన్నివేశాలలో అతి సహజంగా నటించిందట.

★ రోజుకు రెండు మూడు రికార్డింగ్ కార్యక్రమాలలో పాల్గొనే కిశోర్‌కుమార్ ఇటీవల హృద్రోగం నుంచి కోలుకున్న దాదిగా రోజుకు ఒక పాటను మించి పాడడం లేదట.

★ వినోద్‌మెహ్రా నుంచి విడిపోయిన బిందియా, చిత్ర నిర్మాతలందరికీ ఇలా సర్క్యులర్ పంపించిందట : "నేనిప్పుడు స్వేచ్ఛాజీవిని. భర్త, మరొకరో నాపై ఎలాంటి ఆంక్షలూ విధించే స్థితికి దూరమయ్యాను. సెక్సీగా నటించడానికి సైతం సిద్ధంగా ఉన్నాను."

★ షబ్నా ఆజ్మి తొలిసారిగా "లిబాస్" అనే చిత్రంలో ఓ పాట పాడింది.

★ "అర్ధసత్య" అనంతరం గోవింద్ నిహలాని దర్శకత్వం వహించే చిత్రం "పార్టీ". ఒక విందుకు హాజరైన వివిధ మనస్తత్వాలు గల వారి ప్రవర్తనను చిత్రీకరించే ఈ చిత్రం షూటింగ్‌కు ముందు పాత్రధారులందరిచేత రిహార్సల్స్ వేయిస్తాడట.

★ "కూలీ" చిత్రంలో బాక్ ప్రొజెక్షన్ బదులు ట్రావెల్ మేట్ ప్రాసెస్‌లో రెండు షాట్లు లాబ్‌లో మిక్స్ చేయబడ్డాయి. ఈ పద్ధతి మనదేశంలో తొలిసారిగా అనుసరించబడింది. అయితే, ఫలితం ఆశించినంత మేరకు తృప్తికరంగా లేదట.

★ రతి అగ్నిహోత్రి తమ్ముడు రాకేష్ మద్రాసులో రెండు చోట్ల డిస్కో సంగీతం వినిపించే ఫలహార మందిరాలు నెలకొల్పాడు.

★ మద్రాసు గిండీలోని 'సదరన్ బాటిల్ వర్క్స్ ప్రయివేట్ లిమిటెడ్' కంపెనీ ఉన్నచోట లోగడ "దేవదాసు, బ్రతుకుతెరువు, పుట్టిల్లు" వగైరా చిత్రాలు తయారైన నర్సూ స్టూడియో ఉండేది. ఇరవై ఏళ్ళ తర్వాత అదేచోట ఇటీవల అమితాబ్‌బచ్చన్, శ్రీదేవి పాల్గొన్న "ఇన్‌క్విలాబ్" చిత్రం కోసం కొన్ని సన్నివేశాలు చిత్రీకరింపబడ్డాయి.

★ నిర్మాత పూర్ణచంద్రరావును హిందీ తారలు ముద్దుగా "ఫుల్ మూన్ రావ్" అని పిలుస్తారు.

★ సంగీత దర్శకుడు ఆర్.డి. బర్మన్ - 200వ చిత్రం "ఖయామత్". తొలిచిత్రం "ఛోటా జవాన్".


సినిమా

"నన్ను చూడు నా అందం చూడు"

టింకు ఫిలిమ్స్‌వారి పై చిత్రాన్ని త్వరలో విడుదల చేస్తున్నట్లు నిర్మాత దాసరి రాజశేఖర రెడ్డి తెలిపారు. జ్యోతిలక్ష్మి, సిల్క్‌స్మిత, జయమాలిని, త్యాగరాజన్, పండరీబాయి, తేంగాయ్ శ్రీనివాసన్, జైశంకర్, విజయకుమార్ పాల్గొన్నారు. డి. రామరెడ్డి సంభాషణలు, రాజశ్రీ గీతాలు, ఇళయరాజా సంగీతంతో ఎస్. ఎస్. మణియన్ దర్శకుడు.

"అనుమానం పెనుభూతం"

రాజాచంద్ర స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ అధినేత దగ్గుబాటి భాస్కరరావు నిర్మించే పై చిత్రంలో సుమన్, విజయశాంతి, గొల్లపూడి ప్రభృతులు పాల్గొంటారు.



'చదరంగం'లో భానుప్రియ, నరేష్

డి. రామానాయుడు నిర్మించే చిత్రాలు

సురేష్ ప్రొడక్షన్స్ 17వ చిత్రంలో బాలకృష్ణ, విజయశాంతి నాయికా నాయకులు, కె. మురళీమోహనరావు దర్శకుడు. 18వ చిత్రంలో కృష్ణ, శోభన్‌బాబు నాయకులు, కె. బాపయ్య దర్శకుడు. సురేష్ మూవీస్ చిత్రంలో ఎ. ఎన్. ఆర్. హీరో, దాసరి నారాయణరావు దర్శకుడు. విజయ సురేష్ కంబైన్స్ చిత్రంలో చిరంజీవి హీరో, కె. రాఘవేంద్రరావు దర్శకుడు. డి. సురేష్‌బాబు నిర్మించే సురేష్ ఎంటర్‌ప్రైజెస్ చిత్రంలో కృష్ణంరాజు హీరో, గోపాల్ దర్శకుడు.



జ్యోతిలక్ష్మి 'నన్ను చూడు నా అందం చూడు'



శేరి వ్యదుల వయసు 11 సంవత్సరాలు. ఎన్నో నృత్యపోటీల్లో బహుమతులందుకున్నది. విజయవాడలో ఇటీవల ఉచిత నాట్యప్రదర్శన యిచ్చి ప్రముఖుల ప్రశంసల నందుకున్నది. హైదరాబాదు టెలివిషన్ కార్యక్రమం 'శుభోదయం'లో నటించింది.

"భారతంలో బడిపంతులు"

''జనవరి 26 నుంచి షూటింగ్,'' అన్నారు రాధాకృష్ణా కంబైన్స్ అధినేత ఎం. కె. రాధ ఈయన తమిళంలో విశేషాదరణ పొంది తమిళనాడు ప్రభుత్వ అవార్డు పొందిన ''ఎంగళ్ వాద్యార్'' చిత్రాన్ని పై పేరున పునర్నిర్మిస్తున్నారు. సత్యనారాయణ, సుమన్, నూతన్‌ప్రసాద్ ఆదిగాగల నట సమ్మేళనం. ఎం. ఎస్. చక్రవర్తి కథకుడు, రాజశ్రీ సంభాషణలకర్త, రామకృష్ణంరాజా సంగీతం, వెంకటేశ్వరరావు కూర్పుతో బోయిన సుబ్బారావు దర్శకుడు



''అయ్యబాబోయ్! ఇచ్చిన పాత్రలో జీవించాలని ప్రయత్నించానే తప్ప రేప్ చెయ్యాలని చెయ్యలేదండీ!''

డైరెక్టర్ కె బాపయ్య కొత్త చిత్రాలు

కె దేవీవరప్రసాద్ నిర్మించే దేవీ ఫిలిమ్స్ మూడవ చిత్రంలో చిరంజీవి, మాధవి నాయకానాయికలు ''ఇంటిగుట్టు'' అనంతరం వర్మ ప్రొడక్షన్స్ ప్రారంభించే చిత్రంలో కృష్ణ, శోభన్ నాయకులు



'సువర్ణ సుందరి'లో జయశ్రీ

ఇరుగు - పొరుగు

★ రెండు దారుణమైన హత్యలతో, ఆద్యంతం సస్పెన్స్‌తో సాగిపోయే "పోస్ట్ మార్టమ్" మలయాళ చిత్రం గొప్ప హిట్ అయి, సంచలనాన్ని సృష్టించింది దాని ఆధారంగా తమిళంలో తయారైన చిత్రం "వెళ్ళ రోజా".

★ "నీలా పిళ్ళైయార్" అనే తమిళ చిత్రానికి కణ్ణన్, లత అనే దంపతులు తొలిసారిగా సంగీతమిస్తున్నారు కణ్ణన్ ప్రముఖ సంగీత దర్శకుడు సి ఆర్. సుబ్బరామన్ పెద్దకొడుకు

★ ప్రేమ్‌నజీర్‌తో తయారవుతూన్న ఓ మలయాళ చిత్రం పేరు "ప్రేమ్‌నజీర్ కాణమణిల్లా" (ప్రేమ్‌నజీర్ కనిపించుటలేదు) కొందరు తీవ్రవాదులు ప్రేమ్‌నజీర్‌ను అపహరించుకుపోయి కారడవిలోని ఓ గుహలో బందీగా చేస్తారు అక్కడ్నుంచి ప్రేమ్‌నజీర్ అష్టకష్టాలు పడి తప్పించుకుని బయటపడడమే ఈ చిత్రంలో ప్రధాన ఇతివృత్తం

★ జయచిత్ర నిర్మించే తమిళ చిత్రంలో ఆమె భర్త గణేశ్ ప్రధాన పాత్ర నిర్వహిస్తారట

★ "తుపాకీ తూటాలకు గురి అయ్యాకే ఎం జి ఆర్ రాజకీయ రంగంలో రాణించారు నాకు కూడా ఆ యోగం ఉందేమో!" అన్నారట ఇటీవల తూటాలకు అస్వస్థుడై, కోలుకున్న జెమినీగణేశ్

★ రజనీకాంత్ అభిమాన సంఘాలవారు ఇటీవల తమిళ నాడులో తుఫాన్ బాధితులకు కొన్ని వేల కిలోల బియ్యాన్ని ఉచితంగా సరఫరా చేశారట

★ తమిళ హాస్యనటుడు తేంగాయ్ శ్రీనివాసన్ ఒకప్పుడు రోజుకు రెండు రూపాయల బత్తెంమీద వడ్రంగిగా పనిచేశాడట

★ భానుచందర్ పూర్తిపేరు మాదూరి వెంకటసత్య సుబ్రహ్మణ్యేశ్వరభానుప్రసాద్

★ సిల్క్‌స్మిత తొలిపేరు విజయమాల. 1985 వరకు దాదాపు వంద చిత్రాలలో చిత్రానికి పదిహేను వేలు చొప్పున (తెరపై పదినిమిషాల నృత్యానికి) బుక్ అయిందట

★ నేపథ్యగాయకుడు జేసుదాసు తొలిసారిగా ఓ మలయాళ చిత్రాన్ని డైరెక్ట్ చేయబోతున్నాడు

★వార్నర్ బ్రదర్స్‌తో కలిసి దేవర్ ఫిలిమ్స్‌వారు మూడు సింహాలతో విదేశంలో ఓ తమిళ చిత్రాన్ని నిర్మిస్తారట.

★ మహిళలే నటిస్తూ, రచన, దర్శకత్వం అన్ని బాధ్యతలూ వహిస్తూ నిర్మించే ఆంగ్ల చిత్రానికి వార్నర్ బ్రదర్స్ వారు పెట్టుబడి పెడుతున్నారు.

★ నిరుడు సెప్టెంబర్‌లో వెనిస్‌లో జరిగిన చలనచిత్రోత్సవంలో ఓ విశేషముంది "స్ట్రీమర్" చిత్రంలో పాల్గొన్న నటులందరికీ ఉత్తమ నటుని అవార్డు ఇవ్వబడింది.

★ ఏటా వంద చిత్రాలకుపైగా తయారయ్యే పాకిస్తాన్‌లో విడియో ధాటివల్ల గత సంవత్సరం ఒకే ఒక చిత్రం నిర్మించ బడింది

★ పాకిస్తాన్‌లో సెన్సార్ నిబంధనలు ఎంత కఠినంగా ఉన్నాయంటే — ఒక మహిళ గుర్రంమీద స్వారీ చేస్తున్నట్లు చూపడం కూడా అసభ్యమట.

"కాంప్లాన్® మాత్రమే మా కుటుంబానికి సరియైనది-సంపూర్ణంగా ఆరోగ్యబద్ధమైన ఆహారం."



''మా శ్రీవారు పనిలో మునిగి వుంటా రెప్పుడూ—తరచు భోజనం ఎగ్గొడుతూ ఉంటారు. ఆయనకు అందని ఆ పోషణని యిస్తుంది కాంప్లాన్ "



''మా అబ్బాయి అన్నం సరిగ్గా తినడు, మారాం చేస్తాడు వాడి పెరుగుదలకు కావలసిన ప్రొటీన్లూ, యితర ఆహార పదార్థాలూ కాంప్లాన్‌తో తప్పకుండా అందుతాయి ''



"మా అమ్మ యిప్పుడే జబ్బుపడి లేచింది ఆకలి లేదు కోలుకునే యీ సమయంలో, కాంప్లాన్ ఆదర్శమైన తీరులో పుష్టినిస్తుందనిపిస్తోంది "

కేవలం కాంప్లాన్® లోనే అందరికీ అవసరమయ్యే 23 కీలక ఆహార పదార్థాలున్నాయి.



"ఇంట్లో పని చేసిచేసి అలసిపోతాన్నేను మరింత పోషణ అవసరమనిపిస్తుంది ఒక్కొక్కప్పుడు మరి కాంప్లాన్, నేను మా కుటుంబానికి యివ్వగలిగినంత యిచ్చేలా చేస్తుందనిపిస్తుంది "


కేవలం కాంప్లాన్‌లోనే శాస్త్రీయంగా రూపొందించిన పాళ్ళలో, మన శరీరానికి ప్రతిరోజూ అవసరమయ్యే 23 కీలక ఆహార పదార్థాలున్నాయి...ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, కొవ్వు పదార్థాలు, విటమిన్లు, ఖనిజ పదార్థాలు. డాక్టర్లు ఎక్కువగా సిఫార్సు చేసే ఆరోగ్యబద్ధమైన పానీయం.

రుచికరమైన చాక్లెట్, ఏలక్కాయ–కుంకుమపువ్వు, స్ట్రాబెరీ సువాసనలలో దొరుకుతుంది— ప్లెయిన్ (సాదాగా) కూడా.

కాంప్లాన్®

—సంపూర్ణంగా ఆరోగ్యబద్ధమైన ఆహారం.

GLC-10-2316 TL (R)



సందు చివర టీ స్టాలులో ఒన్‌బైటు టీ తాగి తిన్నగా సమత వాళ్ళ ఇంటికి బయలుదేరారు

మెయిన్‌రోడ్డు ఎక్కి కాస్తదూరం నడిచేసరికి వారి ముందు రయ్యిన వచ్చి ఆగింది ఒక కారు

అందులోంచి దిగాడు వినోద్ బాక్‌సీటులో స్వప్న కూడా వుండటం గమనించాడు అమలేశ్వర్.

"హల్లో స్వప్నా !" అంటూ సంతోషంగా పలకరించాడు

అమలేశ్వర్‌ని చూసి చిన్న చిరునవ్వు విసిరింది

"ఏమిటి మిత్రులిద్దరూ రోడ్డు సర్వే చేస్తున్నారు ?" అని అడిగాడు వినోద్.

"పనేముంది ?" ఎదురు ప్రశ్న వేశాడు హరి

"మరే ! డిగ్రీలు పుచ్చుకుని, చిప్ప చేత పట్టుకుని, ఇళ్ళకి చేరినాము దేహి దేహి అంటున్నాము సాపాటుఎటూ లేదు రోడ్లయినా తిరుగు బ్రదర్ !" అన్నాడు మా హరి వాడికి తోడుగా నేనూ" అంటూ ర పీ మ ని జవాబిచ్చాడు అమలేశ్వర్

"సరే ! నువ్వెటూ ఈశ్వరుడివి తిరిపమెత్తుకోవడం తప్పదనుకో మరి హరికేం పోయే కాలం ?" అంది స్వప్న

ఆ మాటకి మనసు చివుక్కుమన్నా వెంటనే నవ్వాడు అమలేశ్వర్

"హరి యను నామము శ్రీహరికేనా వర్తించేది ? కోతికి కూడా వుంది అంచేత ఆ రెండో అర్థాన్నే మీరు తీసుకోండి— ప్రస్తుత వాడి పరిస్థితికి వాడికీ సరిపోతుంది " అన్నాడు అమలేశ్వర్

ఆ మాటకి విలాసంగా నవ్వాడు వినోద్ కళ్ళజోడు తీసి తుడుచుకుని మళ్ళీ పెట్టుకుంటూవుంటే అతని వేలికున్న ఖరీదైన ఉంగరాలు సూర్యరశ్మిలో తళుక్కుమన్నాయి

అతను వేసిన ఆలివ్‌గ్రీన్ సూట్‌ని — చేతికున్న రిస్టువాచీని—వేళ్ళకి వున్న ఉంగరాల్ని — కాలికి తొడిగిన ఖరీదైన బూట్లని వాటి నిగారింపుని పరిశీలనగా చూడసాగాడు హరి

"ఛీ! ఈ లోకంలో తనదగ్గర తప్ప అందరిదగ్గరా డబ్బుంది " అనుకున్నాడు కసిగా పెదవి కొరుక్కుంటూ

"ఇప్పుడీ లక్షాధికారి పనివేళా కారు ఆపి తనతో ముచ్చట్లలోకి ఎందుకు దిగాడా ?" అని ఆలోచిస్తున్నాడు అమలేశ్వర్

"రేపు మా యింటికి నువ్వు రావాలోయ్ !" అన్నాడు వినోద్

"దేనికి బాబు ?" అన్నాడు ఆశ్చర్యంగా

"పని వుంది "

ఈ డబ్బున్న ఆసామికి తనలాంటి రోడ్ల సర్వేయరుతో ఏర్పడిన అవసరం ఏమిటా అని ఆలోచించినా అర్థంకాక,

"అడ్రసు చెప్పండి వస్తాము " అన్నాడు అమలేశ్వర్

తన విజిటింగ్ కార్డు తీసి ఇచ్చాడు వినోద్

అది సాంతం చూడకుండానే జేబులో పెట్టుకుని "వస్తాం" అన్నాడు

"మీ మరదల్ని కూడా తోడు తీసుకురా !" అంటూ వినోద్ కారులో కూర్చుని డోర్ లాగి వేశాడు కారు కదిలిపోయింది

జరిగిన కథ — 3 :

రచయిత నవీన్‌ను అభిమానిస్తుంటుంది సింహళాదేవి స్వప్నతో హోటల్ కెళ్లిన అమలేశ్వర్ వినోద్‌బాబు రాకతో బిల్లు బాధనుంచి బయటపడతాడు సింహళ మనస్సు నవీన్ చుట్టూ, నవీన్ ఆలోచనలు సింహళ చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటాయి నవీన్ సింహళని మద్రాసుకు ఆహ్వానిస్తాడు హరి తల్లి అంత్యక్రియలకు సమత తను కొంత ధన సహాయం చేయడమే గాకుండా తన స్నేహితులు దగ్గర కూడా ఇప్పిస్తుంది సింహళ నవీన్‌ను కలుసుకోను మద్రాసు వెళుతుంది. మద్రాసులోని ముఖ్యమైన ప్రదేశాలు నవీన్‌తో కలిసి చూసి మద్రాసు నుంచి తిరిగి వచ్చేస్తుంది సింహళ అమలేశ్వర్ తన స్నేహితుడు హరికి వచ్చిన సమస్యకు పరిష్కార మార్గం చూపమని సమతను అడుగుతాడు హరి, అమలేశ్వర్ సమత దగ్గరకు బయలుదేరుతారు

హరి — అమలేశ్వర్లు ముఖానపడిన దుమ్ము కర్చీఫ్‌తో తుడుచుకుని మెల్లగా యింటిముఖం పట్టారు

6

సింహళ ఇంటికి రాగానే ఆరోజే తను క్షేమంగా చేరినట్టు నవీన్‌కి ఉత్తరం రాసింది

శ్రీ నవీన్‌గారికి

నమస్కారం నేను క్షేమంగా చేరాను మిమ్మల్ని వదిలిరావడానికి నాకు ఎంత బాధ కలిగిందో నేను మాటల్లో వర్ణించలేను— మీలా రచయితను కాను గనుక మీకు అందంగా చెప్పలేను, కళ్ళు మూసినా, కళ్ళు తెరిచినా మీరే మీ మాటలే వెంటనే జవాబు రాయండి అన్నట్టు మీరు ఇప్పుడు ఏం రాస్తున్నారు ? వెంటనే మీ నించి లెటరు రాకపోతే నేను భోజనం కూడా చేయలేను—

" సింహళ "

ఆ ఉత్తరం అందుకున్న నవీన్ వెంటనే జవాబు రాశాడు

డియర్ సింహళా

నువ్వు వెడుతూ నా హృదయం, నా ఉత్సాహం, నా ఉత్తేజం అన్నీ పట్టుకుపోయావు ఇప్పుడు నేను అన్నివిధాలా వంటరి వాడినైపోయాను శూన్యమైన మెదడు— భారమైన హృదయం ఏం రాయగలను? నువ్వు క్షేమంగా చేరావు నాకు అంతే సంతోషం మళ్లీ నువ్వు ఎప్పుడు వచ్చేదీ రాస్తావుగా

నవీన్

ఆ ఉత్తరం కొన్ని వందలసార్లు చదువుకుంది సింహళ తనని అతనెంత గాఢంగా ప్రేమిస్తున్నాడో తెలుసుకోవాలంటే ఈ ఒక్క ఉత్తరం చాలు మచ్చుకి అతన్ని తను గాఢంగా ప్రేమిస్తోంది

అలాగే అతనూ తనని గాఢంగా, గాఢాతి గాఢంగా ప్రేమిస్తున్నాడు అది కూడా సత్యమే అయితే తామిద్దరి వివాహానికీ తమ పెద్దలు అంగీకరిస్తారో లేదో అన్నదే గొప్ప సందేహం

తన తండ్రి తనకో పాతికవేలు పైనే వెచ్చించి వివాహం చెయ్యాలనుకుంటున్నాడు

తన తల్లికి ఏవేవో కోరికలుంటాయి ఏదో ఆశయాలుంటాయి అందులోకీ ఆవిడ స్త్రీ సంక్షేమ కార్యక్రమాలలో క్రమం తప్పకుండా పాల్గొనే మహిళా సేవకురాలు చాలా వాటిల్లో మెంబరు ఆవిడ ఒక లక్ష కారణాలు తెలుపుతుంది ముఖ్యంగా కులం—గోత్రం అంటుంది వయస్సు తేడాలు వర్ణిస్తుంది ఇలా చెప్పుకుంటూ పోతే చాలా వున్నాయి

ఇవన్నీ తమ వివాహానికి అభ్యంతరాలే !

ఆ తర్వాత వచ్చిన ఉత్తరంతో ఇంట్లో చెప్పక తప్పలేదు సింహళకి

"అమ్మా ! నేను నవీన్‌గారిని పెళ్ళి చేసు

కోవాలనుకుంటున్నాను." అంది ఆ సాయంత్రం తల్లి పువ్వులు మాల కడుతుంటే

"నవీన్ని ! అంటే నువ్వు అభిమానించే రచయితనేనా ?" సూటిగా అడిగింది సరళ

"అవును" అంది మెల్లగానే

"చదవేస్తే వున్న మతి కూడా పోయిందట. అలాగే నువ్వు తయారయ్యావు. నీకసలు బుద్ధి, జ్ఞానంవుందా ?" అంది చండికలా మండిపడుతూ

"నేను ప్రేమించిన వ్యక్తిని పెళ్ళి చేసుకోవడం తప్పా ?" సూటిగా అడిగింది సింహాళ

"ఆ ప్రేమించిన వ్యక్తి సరైనవాడైతే పెళ్ళి చేసుకోవడంలో తప్పలేదు." ఆ మాటకి రోషంగా చూసింది సింహాళ.

ఉద్యోగం సద్యోగం లేకుండా మగవాడు రచనలవల్లే పెళ్ళాంబిడ్డల్ని పోషిస్తాడంటే అది విదేశాల్లో ఏమన్నా సాధ్యపడుతుందేమోగాని మన ఇండియాలో కాదు.

ఉద్యోగం పురుషలక్షణం అని ఏ చిన్న ఉద్యోగం వున్నా — పోనీ పై ఎత్తున రచనలవల్ల ఆదాయం వుంటుంది కనుక కుటుంబం జరక్కపోదని ధైర్యం తెచ్చుకోవచ్చు అతనికి వుద్యోగం లేదని నువ్వే చెబుతున్నావు

ఆయనో నవల రాసి అది పత్రికల వారో— పబ్లిషర్లో డబ్బు ముట్టచెప్పేవరకూ పస్తులు పడుకుంటావా !"


"నువ్వు మరీ అతిగా ఆలోచిస్తున్నావమ్మా మటుకూ అతన్ని చూసాం అంటూ చెప్పిన ప్రతి వాళ్ల దగ్గరా అతన్ని గురించిన వివరాలు సేకరించడం ప్రారంభించింది.

ఆ సేకరణలో అతనికి భార్య, ఒక కూతురు వున్నారన్న విషయం వెల్లడైంది దాంతో తల తిరిగినట్టయింది ఆమెకి.

"సింహాళా, నువ్వు చాలా తెలివితక్కువగా ప్రవర్తిస్తున్నావు అతనికి భార్య, ఒక ఆడపిల్ల వున్నారట ఇకనైనా ఆ మోజు తగ్గించుకో."

సింహాళ కొద్దిక్షణాలు మాట్లాడలేదు

"నేను జీవితంలో పెళ్ళి అంటూ చేసుకుంటే అతన్నే చేసుకుంటాను మరెవర్నీ చేసుకోను



"నవీన్లాంటి మహోన్నత వ్యక్తి నీకు సామాన్య వ్యక్తిలా తోస్తున్నాడేమిటి ?"

"మహోన్నత వ్యక్తి అని నువ్వు ఒకత్తివి అనుకోగానే సరిపోయిందా ! పిల్లనిచ్చేదాన్ని నేను అనుకోవద్దు ? అతను రచనల వరకూ మహోన్నత వ్యక్తే ! గొప్ప మహారచయితే — కాదనను కాని అతని కుటుంబం వివరాలు, అతని ఆస్తిపాస్తులు, అతని ఉద్యోగాలు ఏవీ తెలుసుకోనక్కర్లేదా ?"

"నెలకి రచనలవల్ల అతనికి మూడు నాలుగు వేలు వస్తాయట. ఇంక వేరే ఉద్యోగం దేనికి ?" అంది సింహాళ

"అయితే అతనికింక వేరే ఉద్యోగం లేదన్న మాటేగా ?"

"లేదు."

"చూడు సింహాళా! నువ్వు బి ఏ చదివావు ఆయన నవలల కోసం అడ్వాన్సులు ముట్టచెప్పి క్యూలో నిలబడే పత్రికలు—పబ్లిషర్సు బోలెడు మందట

రాయలేను బాబోయ్ అన్నా వినరట ఇచ్చి తీరాలంటారట— అంత డిమాండున్న రచయితని పట్టుకుని ఎందుకూ పనికిరాని సగటు మనిషి కింద జమకడతావేమిటి ! " అంది తీక్షణంగా

"భేష్ పిచ్చి ముదిరింది— తలకి రోకలి కట్టమన్నాడట— అలావుంది నీ వరస" అంది విసుగ్గా సరళ


"నువ్వు ఏమన్నా అను నేను మాత్రం నవీన్ బాబుని పెళ్లి చేసుకోవడం ఖాయం" అంది తెగేసి చెబుతున్నట్టు

సరళ మాట్లాడలేదు. అప్పటికి మౌనం వహించింది కాని నవీన్ బాబుని గురించి ఒకవేళ చేసుకోవలసివస్తే కృష్ణలో పడి చస్తాను" అంటూ విసవిసా తన గదిలోకి వెళ్ళిపోయింది

ఇంక లాభంలేదని రాత్రి సింహాళ నిద్ర పోయిందని రూఢి పరచుకున్నాక అప్పుడు భర్తతో చెప్పింది సరళ

అంతా శ్రద్ధగా విన్నాడు రామగోపాల్—

"సరళా ! నువ్వు అలా అనుకుంటావుగాని ఆ వయసు అలాంటిది పొంగే పాలలాంటి వయసులోవున్న పిల్ల. పైగా అభిమానరచయిత అతగాడేదో కాస్త దీనితో బాగా మాట్లాడి వుంటాడు దాంతో తనంటే అతనికి తగని ప్రేమని మనమ్మాయి అనుకోవడంలో అసహజమేమీ లేదు" అన్నాడు తాపీగా



ఆ మాటకి ఛర్రుమంది సరళ.

"మీకు ఏదిఏనాడుఅసహజంగా కనిపించింది కనక, ఈ విషయంలో అనుకోవడానికి ? పాపం అన్నీ మీకు అత్యంత సహజంగా అతకినట్టే సరిపోతుంటాయి" అంది మంటగా

"నేను తర్వాత మెల్లగా నచ్చచెబుతాలే అమ్మాయికి నువ్వేం దాన్ని తిట్టిపొయ్యకు" అన్నాడు

"ఆ అలుసు చూసుకునే అది ఇష్టంవచ్చి నట్టు ఆడిపోతోంది ఇంకా స్థిమితంగా ఎప్పుడో చెప్పాలి అంటారేమిటి ?" అంది రుసరుస లాడుతూ

"ఓసి వెర్రిదానా! చిన్నవారికైనా, పెద్ద వారికైనా ఏదో సమయంలో అనుభవమై తెలిసి రావాలి అప్పుడు కళ్ళు తెరిపినబడాలి అంతేగాని, నువ్వు, నేను పట్టి బంధించినంత మాత్రాన వాళ్ళ బుద్ధి మారిపోతుందనుకోకు

మనం అణిచిందంతా ఆవేశంగా మారి, ఆవిర్లు తేలిపోయి—మనవొక రాక్షసుల్లా భావించి— ఎంత త్వరగా వెళ్ళిపోదామా అని దారులు వెతుకు తారే గాని మనం నిర్బంధించినంత మాత్రాన వాళ్ళు విని వూరుకుంటారనుకోకు" అన్నాడు రామగోపాల్

"ఇంతకీ మీరనేదేమిటి ? దాన్ని కేకలు వేయెరు అంతేగా! మీ గారాబమే కదూ ఇంత దూరం తెచ్చింది సింహాళని"

"అదే నీకు ఆలోచన తక్కువనేది" అన్నాడు రామగోపాల్.

"పోనీ నాకు ఆలోచనతక్కువన్నారు. నిజమే నని వప్పుకుంటాను. మరి మీ ఆలోచన ఏమయింది ? మీరు తెలివైన వారుగా!" అంది మనసులో కోపాన్ని దిగ్రమింగుతూ

"ఆగు! తొందరపడితే ఎలా ?"

"అలా నిమ్మకి నీరెత్తినట్టు కూర్చోండి ఏదో ఒకరోజున కొంప అంటించిపోతుంది

మారేడు దళం

సింహాళ. అప్పుడు బయట నాకున్న పేరు ప్రఖ్యాతులు— మీకున్న పరువు మర్యాదలు అన్నీ కృష్ణలో కలుస్తాయి అప్పుడు తీరుబడి గా ఆలోచిద్దురు గాని" అంటూ విసురుగా తన గదిలోకి వెళ్ళిపోయింది సరళ

భార్య మాటలను, కూతురి ప్రవర్తనను మననం చేసుకుంటూ చాలాసేపు కూర్చున్న రామగోపాల్ ఎప్పుడోగాని మంచంమీద వాలలేదు ఆ రాత్రి.

సింహాళకి ఒకరాత్రి వేళ మెలకువ వచ్చి తనకి నవీన్ రాసిన ఉత్తరాలు చదువుతూ కూర్చుంది

మై డియరెస్ట్, స్వీటెస్ట్ సింహాళా

ఇంక నేను వారాలు, రోజులు లెక్కించు కుంటూ ఎన్నాళ్ళు కాలక్షేపం చేయమన్నావు ? ఇకనైనా దయతలచి మద్రాసురా! మనం

ఉక్కు కంటె గట్టి ప్లాస్టిక్ తాళ్ళు!

ఉక్కుకంటె గట్టిగా కొత్తరకం ప్లాస్టిక్ తాళ్ళను తయారు చేసినట్లు నిప్పన్ టెలిఫోన్ అండ్ టెలిగ్రాఫ్ కార్పొరేషన్ తెలియ చేసింది మూడు మిల్లీమీటర్లు మందంగా, ఈతాళ్ళు ఉక్కు కంటే 20 రెట్లు గట్టిగా ఉంటాయి ఇవి ఒకచిన్న కారును సునాయాసంగా పైకి లేపగలవు. ప్లాస్టిక్‌లోని అణుశృంఖలాలను పునర్వ్యవస్థీకరించి, అస్ఫటిక్ భాగములను స్ఫటికీకరణ చేయటంద్వారా ఇది సాధ్య మైనదని తెలిపారు ఈ కొత్త తాళ్ళు చౌకగానే లభించగలవని వీరు తెలియచేశారు

ఇక్కడే ఒకటయిపోదాం మన వివాహానికి మీ వాళ్ళు ఒప్పుకోరన్నావుగదా! ఇక్కడ మారేజ్ చేసుకుని మనం అలా హనీమూన్ వెడదాం"

నవీన్

ఆ ఉత్తరం మరో పదిసార్లు చదివింది

"తన తల్లికి సుతరాం ఇష్టంలేదు తల్లి మాట మీరని తండ్రికి కూడా ఇష్టం వుండదు బహుశ తన మనస్సుని, తన ప్రేమని వాళ్ళు ఆవగింజలో అరవై ఆరవవంతు కూడా గ్రహించలేదు అలాంటప్పుడు వారి కోసం తన హృదయాన్నెందుకు చంపుకోవాలి! మహా రచయిత అల్లుడుకావటం తమకీర్తి ప్రతిష్టలు ఇనుమడిస్తాయన్న చిన్న విషయం అర్థం కాని వారికి ఏం చెప్పినా బుర్రకెక్కుతుందని గ్యారంటీ లేదు

వయసులో తనకంటే ఇరవై ఏళ్ళు పెద్ద వాడు అంటుంది తల్లి ప్రేమకి వయోభేదం వుంటుందా! ప్రేమించే మనసు కావాలిగాని ఇరవై ఏళ్ళ తేడా పెద్ద లెక్కలోది కాదు

తన భార్యకి విడాకులు ఇస్తానన్నాడ ఇంక అలాంటప్పుడు తను ఆలోచించవలసిన పనేముంది ?

వాళ్ళకి – వాళ్ళకి ఏం వుప్పాయో - మధ్య తనకెందుకు ? అసలా విషయంలోనే తను జోక్యం పెట్టుకోదు తన నవీన్ తనమీద ప్రేమని మరచ్చుకోకుండా వుంటేచాలు" ఇలా సాగిపోతున్నాయి వూహలు సింహాళకి

ఇప్పుడామె దృష్టిలో ప్రపంచం అంతటినీ మూసివేసిన ఒకే ఒక వ్యక్తి నవీన్ తప్ప వేరే స్నేహితురాళ్ళు ఎవరూ సోదిలోకి కూడా రాకుండా పోయారు

సమత – స్వప్న – అంతా ఆమె దృష్టి పథంనుంచి ఏనాడో కనుమరుగైపోయారు ఇప్పుడు కన్న తల్లిదండ్రులు కూడా తప్పు కున్నారు

ఎటొచ్చీ కలలోనూ – ఇలలోనూ కూడా ఆమె మనోనాధుడు నవీన్ తప్ప వేరే ఎవరూ లేరు

అతనే ఆమె పాలిటి తల్లిదండ్రి, స్నేహితులు, బంధువులు, దేవుడు అన్నీ అతనే!

ఇంక ఇంట్లో వున్నకొద్దీ తనకి మనశ్శాంతి లేదని -- తల్లిదండ్రులు కట్టుదిట్టాల్లో పెట్టా రంటే తను బయటకికూడా అడుగు వేయలేదని! సాధ్యమయినంత త్వరగా తను ఇక్కడినించి బయటపడటమే మంచిదని ఆ రాత్రి తెల్లవారే వరకూ ఆలోచిస్తూనేవుంది సింహాళ

ఏ విధంగా ఎప్పుడు ఎలా బయలుదేర వలసిందీ ఆలోచించుకుంది

ఆ విధంగా నవీన్‌కి ఉత్తరం రాసిపడేసి ఆ కార్యక్రమం యధాతథంగా అమలులో పెట్టాలని నిర్ణయించుకుంది అప్పటికి ఆమె మనసు వూరటచెందింది

ఆమె కోరికలన్నీ పూవుల్లా వికసిస్తూ

యంటున్నట్టు తెల్లవారింది పూలకుండీల్లోని మొక్కలు గాలికి సయ్యాటలాడుతూ సింహళకి స్వాగతం పలికాయి

కొద్దికొద్దిగా వికసిస్తున్న గులాబి మొగ్గలను చూసి సంతోషంగా పెరటిలోకి వెళ్ళిపోయింది సింహళ

లోకమంతా తన పెరటిలోని పూలమొక్కల లాగే రంగురంగుల మయంగా — సువాసనా భరితంగా వుంటుందిని గాలిలో తేలిపోతోంది విహంగంలా.

ఆనందనోద్యానవనంలో ఇక తామిద్దరే చెట్టాపట్టాలతో విహరించేది అని మురిసిపోతోంది

7

సమత—హరి—అమలేశ్వర్ జాలయ్య ఇంటికి వచ్చారు కాస్త దూరంగా నిలబడి హరి ఆ యిల్లు చూపించి తను పక్కనే వున్న సందులో మున్సిపాలిటీవారి చెత్తకుండీ దగ్గర నిలబడి పోయాడు

సమత, అమలేశ్వర్ తిన్నగా లోపలికి వచ్చారు

''జాలయ్యగారున్నారాండీ !'' అని అడిగాడు అమలేశ్వర్

ఇంచుమించుగా మీటరున్నరపన్నాగిల ఒకామె మహాకాయాన్ని వూపుకుంటూ వచ్చింది ఇవతలికి

''ఎవరబ్బాయి మీరు ?'' అంది కళ్ళు చికిలిస్తూ

''మేము ఆయన దగ్గర తాకట్టుపెట్టి డబ్బు తీసుకుందామని వచ్చామండీ !'' అంది వినయం ఒలికిస్తూ సమత

''అలాగా ! అలా చాపమీద కూర్చోండి, వస్తాడు'' అంటూ మళ్ళీ ఆయాసపడుతూ లోపలకు పోయింది

ఆ యింటిని — ఆ యింట్లో వున్న సామానుల్నీ—పరిశీలించసాగారు బావామరదళ్ళు

పందిరిమంచం గదిలోంచి బయటకి కనిపిస్తోంది. ఏనాటిదో నల్లకర్రతో చేసింది దాని మీద పరుపు—దుప్పటి, రెండు తలగడాలు, అలాగే కుర్చీలు కూడా పాతవే ! పాతకలప పడక కుర్చీ గోడకి మడతమంచాలు రెండు ఆనించి వున్నాయి జాలయ్యకో ప్రైవేటుగది అందులో చిన్నబాలీసుకి చేరగిలబడి కూర్చుంటాడు జాలయ్య వచ్చే వారంతా పాపం మధ్యతరగతి వారు కాస్త పేద వారు కనక చాపల మీద కూర్చుంటారు గాని ఆ కుర్చీల జోలికి ఎవరూ పోరు కాసేపటికి గ్లాస్కోపంచ — టెరికాటన్ చొక్కా ధరించిన జాలయ్య నామాంకిత భారీవిగ్రహం గుండ్రాయిలా దొర్లుకొంటూ వచ్చింది.

''ఎవరు మీరు ?'' అంటూ పలకరించాడు బొంగురు గొంతుతో.

''మేమీ వెండిగ్లాసు తాకట్టుపెట్టి డబ్బు తీసుకుందామని వచ్చాం— మాకు డబ్బు ప్రాణావసరం'' అంది సమత

ఆ గ్లాసును అందుకుని అటూ ఇటూ తిరగేసి పరిశీలనగా చూశాడు జాలయ్య.

''ఎంత కావాలి ?''

''ఓ యాభై కావాలి.''

''యాభై కావాలంటే అమ్ముకోవడం మంచిది ఇది పాతిక కంటే తాకట్టు పెట్టుకుని ఎవరూ ఇవ్వరు''

''అదేమిటండీ ఇది వందరూపాయల సొమ్ము ఎన్ని తులాలో కావాలంటే తూకం వేసుకోండి.''

''ఆ ! ఎన్ని తులాలో నేను చెప్పగలను లేవయ్యా . అనవసరంగా హైరానపడకు అసలే పాతవెండి'' అన్నాడు ఖరారుగా.

ఒకరి ముఖాలు ఒకరు చూసుకుని ''ఆ గ్లాసిలా ఇచ్చేయండి బయట వెండి కొట్లలోనే అమ్ముతాం వచ్చినంతే వస్తుంది'' అంది సమత

జాలయ్య మాట్లాడలేదు అతనింకా ఏదో అనబోయేలోగానే ''రా బావా పోదాం'' అంది

అమలేశ్వర్ లేచాడు

''మరి ఎందుకయ్యా నా పని పాడు చేశారు?'' చిరాగ్గా అడిగాడు జాలయ్య

''ఓ యాభై ఇస్తారేమో తాకట్టు పెట్టుకుని అనుకున్నాం మీరు అమ్మినా యాభై రాదంటున్నారు'' అన్నాడు అమలేశ్వర్

''వడ్డీ నూటికి అయిదు రూపాయలు. ఆ లెక్కన కావాలంటే తీసుకువెళ్ళండి''

''అయిదు రూపాయలా ?''

''అవును.''

''ఏం చేద్దాం బావా ?''

''సరే తీసుకో !'' అన్నాడు అమలేశ్వర్

ఆ గ్లాసు తాకట్టు పెట్టి యాభై రూపాయలు తీసుకుని బయటికి వచ్చి హరికి అంతా చెప్పారు.

''మరీ దారుణంరా బ్రదర్ ! వీడు వెయ్యి రూపాయలు కాజేసి వుండటంలో ఆశ్చర్యంలేదు'' అన్నాడు సాలోచనగా.

''సరే ! మన ప్లాను గుర్తుందిగా !''

''ఆ !''

ఆ యాభై తీసుకుని భద్రంగా ఇల్లు చేరారు


[ఇంకా వుంది]

అంతే !

అంతే ! నిజాన్ని నమ్మి
నమ్రత పాటించి
సభ్యతా సంస్కారాలతో
క్యూలో నించున్నవాడిగతి
అంతే !

పశుబలం రుచి చూపి
సాధించే నేటి సమాజ
అభ్యున్నతిముందు
సభ్యతా సంస్కారాలు
నమ్రతా లాలిత్యాలు
నీటి బుడగలు !
బడిలో పాఠాలు !
గుడిలో దీపాలు !

— శాండిల్య



సర్వవ్యాధుల నివారణకి యోగాసనాలు

యోగ ప్రక్రియ ప్రాచీన భారతంలో ఉద్భవించింది కనుక, యోగభంగిమలు హిందూ సాంప్రదాయాలకు అనుగుణంగా ఉన్నాయనిగాని, ధ్యాన సమయంలో "ఓం" అనే మంత్రోచ్ఛారణ మాత్రమే చేయాలి అని అనుకోవటం పొరపాటు. యోగ భంగిమలో ఆయా మతాలవారు తమ ఇష్టదైవాలపై ఏకాగ్రతతో కేంద్రీకరించవచ్చు. మతాతీతులు నిరాకారంపై కేంద్రీకరించవచ్చు.

యోగ సాంప్రదాయము వేల సంవత్సరాలకు పూర్వం మన భారతదేశంలో జన్మించింది. మానవ జీవితము దుఃఖము, భయము, బాధామయములతో కూడినదని గ్రహించిన యోగులు వాటినుండి విముక్తి పొందటానికి అన్వేషణ సాగించారు. ఈ అన్వేషణ ఫలితమే 'యోగవిద్య' ఆవిర్భావము. దీనిని గుర్తించిన మహారాజులు దీనికి 'రాజవిద్య' అని అన్నారు. విజ్ఞులు పరిశోధనలు గావించి శాస్త్రాన్ని అనేక విధాలుగా అభివృద్ధి చేసి గ్రంథాల రూపంలో అందించారు. ఈ గ్రంథాల్లో ఒక గ్రంథమే యోగవిద్యకు ప్రామాణికంగా ప్రసిద్ధిచెందిన 'పాతంజలి యోగ సూత్రాలు' అను గ్రంథము.

నాడీమండల ఆయుః ప్రమాణం

నాడీశోధన ప్రాణాయామం



జ్ఞానయోగము, కర్మయోగము, భక్తియోగము, రాజయోగములు అనునవి యోగాంశములు. ఇందు యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి అనునవి రాజయోగములు. ఈ అష్టాంగములలో ప్రాణాయామ, ఆసన, ధ్యానములు శరీరాన్ని రుగ్మతల పాలుగాకుండా కాపాడుతాయి.


ప్రాణాయామము

రెండు నాసికా రంధ్రములతో ఒక క్రమమైన పద్ధతిలో ఒక పరిమితి ననుసరించి చేయు శ్వాస నిశ్వాసముల క్రియను ప్రాణాయామమని అనవచ్చు.

ఎడమ నాసికా రంధ్రాన్ని ఇడానాడి లేక చంద్రనాడి అనియు కుడి నాసికా రంధ్రాన్ని పింగళనాడి లేక సూర్యనాడి అనియు యోగ శాస్త్రం అంటుంది. ఇడాపింగళ నాడి ప్రభావం శరీరంలోని యితర నాడులపై ఎంతగానో పని చేస్తుంది.

కుడి నాసికా రంధ్రము మూసి ఎడమ నాసికా రంధ్రముతో నాలుగు క్షణాలపాటు ఊపిరి పీల్చుకొని, ఎడమ నాసికా రంధ్రమును మూసి కుడి నాసికా రంధ్రముతో ఎనిమిది క్షణాలపాటు ఊపిరి వదిలే సాధనను మొదట్లో బాగా అలవాటు చేయాలి. ఇక్కడ ఒక విషయం బాగా గమనించాలి. ఊపిరి పీల్చినపుడు ఉదరము ఉబ్బాలి. ఊపిరి వదిలినపుడు ఉదరము లోపలికి పోవాలి.

ఇక రెండవ సాధనలో పై పద్ధతులనే అనుసరిస్తూ ఎడమ నాసికా రంధ్రముతో నాలుగు క్షణాలపాటు పీల్చిన ఊపిరిని పదహారు క్షణాల వరకు నిలిపి ఉంచి తరువాత కుడి నాసికా రంధ్రముతో ఎనిమిది క్షణాలపాటు ఊపిరిని నెమ్మదిగా వదిలే సాధన చేయాలి. ఊపిరి పీల్చుటను పూరకమనియు, నిలుపుటను కుంభకమనియు, వదలుటను రేచకమనియు యోగ శాస్త్రం అంటుంది. ఈ విధంగా పూరక, కుంభక, రేచకాలను 4:16:8 నిష్పత్తిలో బాగా సాధన చేయాలి. పూరకమునకు ముందు ఊపిరితిత్తులలో ఏ మాత్రం గాలి లేకుండా బయటికి వదలాలి.




యోగాసనాల ప్రథమ సోపానం

పద్మాసనం

'నాడీ శోధన ప్రాణాయామము'

సాధనచేసే విధానం :— పద్మాసనములో కూర్చుండి కుడిచేతి చూపుడు వ్రేలును పటములో చూపినట్లుగా ఫాలభాగంపైన రెండు కనుబొమలకు మధ్యనుంచి బొటను వ్రేలును కుడి నాసికా రంధ్రము వద్దను మధ్య వ్రేలిని ఎడమ నాసికా రంధ్రము వద్దను ఉంచాలి. ఎడమ చేతిని ఎడమ మోకాలిపై ఉంచాలి. కుడి నాసికా రంధ్రాన్ని బొటన వ్రేలుతో మూసి ఎడమ నాసికా రంధ్రముతో నాలుగు క్షణములు ఊపిరి పీల్చి, పదహారు క్షణముల వరకు ఊపిరి నిలిపి, ఎడమ నాసికా రంధ్రాన్ని మధ్యవ్రేలుతో మూసి కుడి నాసికా రంధ్రమునుండి ఎనిమిది క్షణాల వరకు ఊపిరి వదిలి వెంటనే అదే నాసికా రంధ్రముతో అనగా కుడి నాసికా రంధ్రములో నాలుగు క్షణాలవరకు ఊపిరి పీల్చి (పూరకం) పదహారు క్షణాలవరకు ఊపిరి నిల్పి



ఉదరంలోని కొవ్వుని హరించే హలాసనం

(కుంభకం) బొటనవ్రేలితో కుడి నాసికా రంధ్రాన్ని మూసి ఎడమ నాసికా రంధ్రముతో ఎనిమిది క్షణాల పాటు ఊపిరి వదలాలి (రేచకం). యీ క్రియ నంతను ఒక "నాడీ శోధన ప్రాణాయామ" మని అంటారు. కొంతతడవు విశ్రాంతి తీసుకొని మరల పైన పేర్కొనిన విధముగా సాధన చేయాలి. ప్రారంభంలో రోజుకు నాలుగు నాడీ శోధన ప్రాణాయామములతో ప్రారంభించి క్రమంగా మన శక్తి కొలదీ పెంచుకుంటూ పోవచ్చును. పూరక, కుంభక, రేచకముల నిష్పత్తిని కూడ క్రమంగా 4 : 16 : 8 నుండి 6 : 24 : 12, 8 : 32 : 16ల వరకు పెంచు కొంటూ పోవాలి.. సాధన సమయంలో తల, మెడ, రొమ్ము నిటారుగా ఉండాలి. ప్రాణాయామ సాధన వలన నిజమైన విశ్రాంతి లభిస్తుంది. నిశ్చలమైన ప్రశాంతత ముఖంలో కనుపిస్తుంది. రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుంది. అనేక చర్మ వ్యాధులు నయమవుతాయి. రక్తం శుభ్రపరుస్తుంది.



గాస్ట్రబుల్ అదుపుకు ఉడ్డ్యాన బంధన

యోగాసనాలలో వివిధ రకాలు

ఆసనముల వివిధ భంగిమలను బట్టి అయిదు విధాలుగా విభజించవచ్చు. (1) నిలబడి చేసేవి (2) కూర్చుండి చేసేవి (3) వెల్లకిలా పడుకొని చేసేవి (4) బోర్లాపడుకొని చేసేవి (5) వినాళ గ్రంధులను ఉత్తేజ పరచునవి.

వెన్నెముక వంపును బట్టి గూడ ఆసనములను నాలుగు రకాలుగా వర్గీకరించ వచ్చు.

(1) వెన్నెముక ముందుకు (2) వెన్నెముక వెనుకకు (3) పార్శ్వవంపు (4) మెలి.

హలాసనం

వెల్లకిలా పడుకొని రెండుకాళ్లు తిన్నగా తల మీదుగా నేలకు ఆనించే హలాసనం వలన ఉదరములోని అవయవాలకు మృదువైన మర్దన జరిగి జీర్ణక్రియ సక్రమంగా జరగటమే కాక మల బద్ధకాన్ని పోగొడుతుంది.

ఉడ్డ్యాన బంధన

ఊపిరి పొంతంగా వదలి ఉదరమును లోపలికి పోనిచ్చి వీపు అనునట్లు అదిమిపట్టే ఉడ్డ్యాన బంధనవలన గ్యాస్ట్రిక్ ట్రబుల్ నశించడమేకాక నపుంసకత్వం నుండి విముక్తి లభిస్తుంది.

ధ్యానము (మెడిటేషన్)

బాహ్యాంతరములలో ఏదో ఒక నిర్దుష్టమైన లక్ష్యముపై నిశ్చలముగ మనస్సును నిలపగలిగినంతనే "తలంపు" ఆ లక్ష్యము వైపుకు అప్రతిహత ప్రవాహరూపంగా పోవునట్టి శక్తిని పొందుతుంది. ఈ స్థితినే ధ్యానము అంటారు. ధ్యానమువలన విశ్రాంతి లభిస్తుంది. ధ్యాన సమయంలో సుఖముగా ఉండెడి ఒక స్థిరమైన యోగభంగిమను (పద్మాసనము ధ్యానమునకు అనువైన భంగిమ) అవలంబించాలి. యీ భంగిమలో తల, మెడ, రొమ్ము, వెన్నెముకలను ఏ విధమైన శ్రమకు లోనుకానీయకుండా తిన్నగా ఉంచాలి. ఉదరమందలి అవయవాలకు వత్తిడి కలిగిస్తే మలబద్ధకము, ఇతర ఉదర సంబంధమైన రుగ్మతలకు గురికావచ్చు.



ఆధ్యాత్మిక చింతనకు ధ్యానము


అందుచేత పద్మాసన భంగిమనే ఎంచుకోవాలి. ఈ ధ్యానము చిత్తాన్ని స్వాధీనంలో ఉంచుతుంది.

పైన చెప్పిన యోగాసనాలు ఉదయము 5 – 7 గంటల మధ్య ఒక అరగంట చేస్తే చాలు – ఆసనాలు చేసేటప్పుడు పొట్టలో ఎట్టి ఆహారం లేకుండా ఖాళీగా ఉండాలి.

యోగాసనాలు సుఖవ్యాధుల సయితం నయంచేస్తాయి. గతంలో సంక్రమించుకొన్న సుఖవ్యాధుల ఫలితం సంతానంపై పడి పీడిస్తుంది. అట్టి వ్యాధులనుండి విముక్తి పొందటానికి యోగాభ్యాసం చేస్తూ, రోగ నిరోధక శక్తుల్ని పెంపొందించుకొనేందుకు మన బిడ్డలతో సైతం చేయిస్తూ ఉండాలి.

— షేక్ మొహిద్దీన్ బాషా

శ్రీమతి శుభ



ఒక కుందేలు కథ

వాళ్ళిద్దరూ— ఢీకొని తలలు పగలగొట్టుకోడానికి సిద్ధంగావున్న పొట్టేళ్ళలాగ ఒకరినొకరు చూసుకున్నారు కొమ్ములు విరగొట్టుకోడానికి సిద్ధంగావున్న కోడెదూడల్లా హుంకరించారు ఒకరు పడగవిప్పిన నాగులా బుసకొట్టగా మరొకరు ముంగిసలా కాలుదువ్వుతున్నాడు వాళ్ళిద్దరూ— ఒకరు తండ్రి— ఒకరు కొడుకు, ఒకరు ఎన్. జి వో— ఒకరు నిరుద్యోగ పట్టభద్రుడు!

ఆ గదిలో ఒకమూల పిల్లిలా నక్కి చూస్తున్న ఆ ప్రాణి— పార్వతమ్మ! ఆమె ఎన్ జి. వోకి భార్య. నిరుద్యోగికి తల్లి! ఆమెకు ఏ విషయంలోనూ స్వతంత్రం లేదు ఆమెమాట పెదవిదాటదు. కాలు గడప దాటదు.

ఆ తండ్రి కొడుకులను చూస్తే ఆమెకు ఆశ్చర్యం వేస్తుంది. వీళ్ళు తండ్రికొడుకులా, ఆగర్భ శత్రువులా— అని అనుమానం కలుగుతూ వుంటుంది ఆయన ఉత్తిపుణ్యానికి కొడుకుని తిడుతూ ఉంటారు అందరు తండ్రులూ అంతే కదా! మరి అందరి కొడుకుల్లా నోరు మూసుకొని పడివుండడు కృష్ణ తండ్రిని ఎదిరిస్తాడు నువ్వెంత అంటే నువ్వెంత అని నిలదీస్తాడు తండ్రి అన్న గౌరవం అసలే చూపడు.

ఆ తండ్రి కొడుకుల ఘర్షణ మధ్య తల దూర్చితే మద్దెలలాగ అవుతుంది ఆమె పరిస్థితి. అటూ యిటూ తల బొప్పి కడుతుంది. అందుకే మౌనమే శరణ్యం ఆమెకు

మిగిలిన యిద్దరు పిల్లలూ బుద్ధిమంతులే! అయితే కృష్ణ బుద్ధిమంతుడు కాదా అని ఎవరైనా అడిగితే చప్పున సమాధానం చెప్పలేదు పార్వతమ్మ! కృష్ణ తనకే కాదు ఎవరికీ అర్థం కాని యువకుడు.

వాడెందుకలా తయారయ్యాడో!

గత ఫిబ్రవరిలో ప్రభుత్వం ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయస్సు హటాత్తుగా తగ్గించింది ఉద్యోగులకా వార్త అశనిపాతం అయింది ఆ వార్త వినగానే కొందరు ప్రాణాలు కోల్పోతే — అర్ధంతరంగా రిటైర్ అయిపోతే జీతాలు కట్టలేమన్న బాధతో మెడిసిన్, ఇంజనీరింగ్ చదువుతున్న కొడుకుల చదువు మాన్పించేసారు కొందరు. ఎదిగిన కూతుళ్ళ పెళ్ళి ఎలా చేయాలో తెలియక బెంగపడ్డారు కొందరు.

ఆ నెలలోనే రిటైర్ అయిన చాలమంది—చేతిలో కూడు ఎవరో తన్నుకుపోయినట్లు ఖిన్నులయారు నోటిముందు కూడు పడగొట్టిన ప్రభుత్వాన్ని శపించారు

రిటైర్‌మెంటు వయస్సు తగ్గినా, శంకరయ్యకి యింకా ఒక సంవత్సరం సర్వీసు వుంది కొడుకుల్లో ఒక్కరికీ ఉద్యోగం లేదు కూతురుకి యింకా సంబంధం నిశ్చయంకాలేదు. ఒక్క ఏడాదిలో అవి నెరవేరేనా ? అని చింత పట్టుకుందాయనకు

ఇంటిల్లపాదీ అందరూ విచారంలో మునిగిపోతే కృష్ణ మాత్రం నవ్వుకున్నాడు ! ''మంచి శాస్తి జరిగింది ! ఈ ముసలాళ్ళు ఆఫీసుల్లో అసలు పని చేస్తున్నారా ఏమిటి ?!''

ఉద్యోగులు సుప్రీమ్ కోర్టులో రిట్ వేస్తే ''రిటైర్‌మెంట్ వయస్సు పెంచడాన్కి అధికారంవున్న ప్రభుత్వానికి తగ్గించడాన్కి ఉండదా ? మీరు ఓడిపోతారు !'' అని వాదించడం మొదలుపెట్టాడు

తర్వాత ప్రభుత్వం ఫండమెంటల్ రూల్‌ని సవరించడంతో ఉద్యోగులు సమ్మె నోటీసు యివ్వడం, ఇరుపక్షాలా ప్రచారం ఉధృతం కావడం, హద్దులమీరి అందరూ ఒకరి నొకరు దుయ్యబట్టుకోవడం ప్రారంభంకాగా — శంకరయ్య యిల్లు ఒక రణరంగంగా మారింది !

శంకరయ్య ఆ జిల్లా ఎన్ జీ వో ల కార్యదర్శి సహజంగానే ఆయన శక్తికొద్దీ ప్రభుత్వాన్ని దుయ్యబట్టే యింటికిరాగానే కృష్ణ ఆయవతో వాదనకు దిగేవాడు ప్రభుత్వం నియమించిన ప్రతినిధి లాగ విమర్శించేవాడు

''కోర్టులో రిట్‌వేసి, తీర్పు రాకుండానే సమ్మె ఎందుకు ?'' నిగ్గదీసి అడిగాడు కృష్ణ

''కోర్టులో వున్నది రిటైర్‌మెంట్‌కు సంబంధించిన కేసుమాత్రమే .. ఇంకా చాల కోరికలున్నాయి'' అన్నాడు కసరుతున్నట్లు

కాని ఆయన కోపం చూసి బెదిరిపోలేదు కృష్ణ గత నాలుగురోజుల దినపత్రికలు ఆయనమీదకు విసిరాడు వాటిలో పతాక శీర్షికలు — ఒక దానిలో — ''రిటైర్‌మెంట్ విషయంలో రాజీ ప్రసక్తిలేదు'' మర్నాటి పేపర్‌లో — ''ఆర్డినెన్స్ ఉపసంహరిస్తే చాలు'' ఆ తర్వాత — ''రిటైర్‌మెంట్, ఆర్డినెన్స్ — రెండే ప్రధానాంశాలు'' ఆ మర్నాడు — ''ఆ రెండు అంశాలేకాక యితర అంశాలమీద కూడా రాజీ ప్రసక్తిలేదు ''

అవన్నీ చదివి వినిపించి ''అసలు మీరు నిజంగా దేనికోసం సమ్మె చేస్తున్నారో మీకైనా సరిగా తెలుసా ?'' గద్దించాడు కృష్ణ

ఈ కుర్రకుంకకు చెప్పేదేమిటి — అనుకున్నాడు శంకరయ్య కాని కొడుకు రెచ్చగొట్టే ధోరణిని సహించలేకపోయాడు ''మేం కోర్టుల్లో పోరాడుతాం వీధుల్లోనూ పోరాడుతాం'' అక్కసుగా అన్నాడు.

ఆ తర్వాత యిద్దరూ ఒకర్ని ఒకరు మింగేసేటట్టు చూసుకున్నారు పామూ, ముంగిసల్లా బుస కొట్టారు కృష్ణ విసురుగా బయటకు వెళ్ళిపోయాడు

అప్పడే ఐదారుగురు కాలేజీ కుర్రాళ్ళు అలా వెళుతున్నారు వాళ్ళతో గబగబ ఏదో చర్చించాడు కృష్ణ. వాళ్ళంతా గుంపుగా యింట్లో జొరబడ్డారు.

''ఏం పెద్దమనిషివయ్యా ?! వయసొచ్చిన కుర్రాడికి అనేక ఖర్చులుంటాయి నెలనెలా పాతికో ముప్ఫయో పాకెట్ మనీ యివ్వాలని తెలియదా ?'' శంకరయ్యను గద్దించి అడిగాడొకడు. ''పాకెట్ మనీ యివ్వలేని తండ్రి పిల్లల్నెందుకు కనాలి ?'' దీర్ఘం తీసాడు మరొకడు చటుక్కున శంకరయ్య జేబులోని పర్స్ లాక్కుని దానిలోంచి పాతికరూపాయలు తీసి కృష్ణ కిచ్చాడు యింకొకడు.

''తండ్రులూ ! డవున్ డవున్'' కేకలతో యిల్లు చద్దరిల్లిపోయింది

గోల విని ఇరుగు పొరుగు వాళ్లంతా గుమిగూడారు ఏమీ చేయలేక శంకరయ్య తల వంచేసాడు అతని హృదయం కుత కుత ఉడికిపోతోంది ఆ కుర్రాళ్ల అరుస్తూనే శంకరయ్య చొక్కా పట్టుకుని అటూ యిటూ గుంజారు. ఆయన్నొక బంతిలాగా ఒకరి మీదకు యింకొకరు తోసివేయడం మొదలు పెట్టారు. ఆ ముచ్చట ఐదునిమిషాలపాటు జరిగాక ఎవరి దారిన వాళ్ళు వెళ్లారు

ఇరుగు పొరుగు వాళ్ల — కొందరు నవ్వుకుంటే మరికొందరు శంకరయ్యను ఓదార్చారు ''యువతరం !'' వెటకారంగా అన్నారు కొందరు శంకరయ్య హృదయం భగ్గుమంది. కృష్ణ వైపు కొర కొర చూసాడు

''వీధుల్లో పోరాడుతాం—అన్నారు మీరు ఆ పనే నేను చేసాను ఎందుకా కోపం ?.'' నవ్వేసాడు కృష్ణ గునపంతో గుండెల్లో పొడిచినట్టు బాధపడిపోయాడు శంకరయ్య. ఆ బాధతో ఆయన ఆ రాత్రి భోజనం చేయలేదు బెడ్ రూంలో దూరి తలుపులు బిగించుకున్నాడు

మరో రెండు రోజులకు— అధికార పార్టీకి చెందిన యువకులు ఎన్ జీ వో నాయకుని వేధించినట్లు అన్ని దినపత్రికల్లోనూ వార్త వచ్చింది . తండ్రి వైపు కొర కొర చూసాడు కృష్ణ !

మరో రెండురోజులకు— స్థానిక ఎన్ జీ వో కార్యదర్శి ప్రతిపక్షాల నుండి నిధులు అందుకున్నట్టు కొన్ని పత్రికలు ప్రకటించాయి కొడుకు వైపు కసిగా చూసాడు శంకరయ్య !

''నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష !'' కిసుక్కున నవ్వాడు కృష్ణ !

ప్రభుత్వం ఎన్ జీ వోలను పందికొక్కులుగా వర్ణించిందట వాళ్ల తోలు ఒలిచేస్తాం అందట. దానితో ఉద్యోగ సంఘాలన్నీ అట్టుడికిపోయాయి ప్రభుత్వాధినేతలే పెద్ద పందికొక్కులు. ప్రభుత్వం తోలు మేమే ఒలిచేస్తాం మూడు ప్రభుత్వాలను పడగొట్టాం ఈ ప్రభుత్వం ఒక లెక్కా ?! — ఈ ధోరణిలో సంఘం నాయకుల ప్రసంగాలు కొనసాగాయి

ఆవేశంగా ఉపన్యసించి ఎన్.జీ వో లందరి చేతా సమ్మెలోపాల్గొంటామని ప్రతిజ్ఞ చేయించి — ఉత్సాహంగా యింట్లో అడుగు పెట్టాడు శంకరయ్య

తండ్రికోసం ఎదురు చూస్తున్న కృష్ణ ఎదుర్కొన్నాడు ''గుండెమీద చేయివేసుకుని నిజం చెప్పు నాన్నా ! నీవు రోజూ ఎన్నిగంటలకు ఆఫీసుకు వెళ్తున్నావు ? వెళ్ళిన తర్వాత ఎన్ని గంటలకు ఫైల్స్ తెరుస్తున్నావు ? రోజుకి ఎన్నిగంటలు నీవు పని చేయాలి ? ఎన్నిగంటలు చేస్తున్నావు ? ఆమ్యామ్యా చెల్లించనిదే ఏ పని అయినా చేసావా ? మీ ఆఫీసులో నీవొక పందికొక్కువు కాదా ? నీలాగ పనిచేయకుండా జీతం తీసుకునే పందికొక్కులు మీ ఆఫీసులో ఎన్ని ఉన్నాయో నిజంగా నీకు తెలియదా ? నేను హైస్కూలులో చదివే రోజుల్లో కేస్ట్, ఇన్‌కమ్ సర్టిఫికేట్ల కోసం వాళ్ళు నిన్ను ఎన్ని రోజులు తిప్పారు ? అప్పుడు నీవు వాళ్ళని పందికొక్కులని తిట్టలేదా ? ఇప్పుడెవరో అలా అన్నారని ఎందుకా చిందులు ? ఉన్నమాటంటే ఉక్రోషం !''

కృష్ణ అలా నిలదీసి అడిగితే శంకరయ్య వద్ద నిజంగా సమాధానం లేదు కుర్రకుంకకు సమాధానం చెప్పవలసిన అగత్యమూ లేదు విసురుగా లోనికి వెళ్ళిపోయాడు కృష్ణ ఊరుకోలేదు ఆయన్ని వెంబడించాడు—సమాధానం చెప్పితీరాలన్నట్లు

''కొద్దిమంది అలాంటి వాళ్ళుండవచ్చు అలాని అందర్నీ కలిపి తిట్టడం ఏం న్యాయం ?'' అన్నాడు శంకరయ్య — ప్రభుత్వం తిట్టింది కాబట్టి మేమూ తిట్టాం అన్న ధోరణిలో కృష్ణ ఒక్కసారిగా రెచ్చిపోయాడు. ''ఒరే గాడిదా ! బుద్ధి లేదా ? ఇంత తిని ఊరంతా బలాదూర్ తిరగడం గాడిదలు చేసే పనిరా అడ్డగాడిదా !'' అని గర్జించాడు

శంకరయ్య నిశ్చేష్టుడయాడు ముఖం కందగడ్డ అయింది రక్తం కుతకుత ఉడికిపోయింది. ఇంటిల్లపాది అందరూ చుట్టూ బొమ్మల్లా నిలచిపోయారు

కృష్ణ నవ్వేసాడు '' అలా మీరు నన్ను తిట్టేవారు ! అలాని నేను కూడా మిమ్మల్ని అలా తిట్టడం న్యాయమా ? మీరే చెప్పండి'' అన్నాడు సంతృప్తిగా తర్వాత— ఒక మహా సత్యాన్ని ఆవిష్కరిస్తున్న వాడిలా చుట్టూ చూసి ''నీవు వెధవ— అంటే నీవు వెధవ— అని వీధిలోపడి అరచుకుంటే — చూసేవాళ్లు, యిద్దరూ వెధవలే అనుకుంటారు !'' అని తాపీగా వెళ్ళిపోయాడు.

సమ్మె ప్రారంభం అయింది మున్నెన్నడూ లేని సంచలనం తెచ్చింది. కాసెట్లు జోరు, పోస్టర్ల యుద్ధంతో బాటు వార్తా పత్రికల సమరంకూడా తారస్థాయికి చేరుకుంటున్నాయి కొత్త గవర్నర్ పేరు ప్రకటించబడడం, రాష్ట్రపతి పర్యటనలో పరిస్థితి వేడెక్కింది. రాష్ట్రపతి పాలన ఖాయం అన్న ధోరణి ఉద్యోగుల్లో కనిపించింది

సమ్మె సర్వత్రా జయప్రదం అయింది

రాష్ట్ర పరిస్థితి అలా వుంటే శంకరయ్య యింటి పరిస్థితి మరింత రాజుకుంది రాజేసిన వాడు కృష్ణ !

కృష్ణతోబాటు చాలమంది నిరుద్యోగులు కలక్టర్ ఆఫీసు చుట్టూ ఉద్యోగాలకోసం రెండు రోజులు తిరిగారు ఎవరికీ ఉద్యోగాలు రాలేదు గాని వారిని సమ్మెదారులు ఎదుర్కోవడం—దానితో ఘర్షణలూ పెరిగాయి! కృష్ణకు ఉద్యోగం దొరకనందుకు శంకరయ్య సంతోషించాడు !

మొదటి నుండీ కృష్ణ—సమ్మె జయప్రదం కాదని వాదిస్తూ వుండేవాడు గత కొద్ది రోజులుగా స్తబ్దుగా ఉండిపోయాడు శంకరయ్యలో ఉత్సాహం పుంజుకుంది కొడుకు మీదకు వార్తాపత్రికలు విసిరాడు "చూడు ! పత్రికలన్నీ— ఒకటి, రెండు తప్ప— మా సమ్మెను ప్రోత్సహిస్తున్నాయి !" అన్నాడు సగర్వంగా

"అవన్నీ ప్రతిపక్షాలు నడుపుతున్న పత్రికలు! జీతానికి అమ్ముడుపోయే సంపాదకులు అలాగే రాస్తారు . ఆ పత్రికల కార్యాలయాల్లో సమ్మె వస్తే అప్పుడు చూడాలి వాళ్ళ అసలు రంగు !"

"ప్రజల్ని మా మీదకు ఉసిగొల్పితే సమ్మె నీరుకారి పోతుందని ప్రభుత్వ భావన ! కాని ప్రజలు మామీదకు రాలేదు ! మమ్మల్నే బలపరుస్తున్నారు !" ధీమాగా అన్నాడు శంకరయ్య

ఒక కుందేలు కథ

"కాలేజీ కుర్రాళ్ళు నిన్ను ఘెరావ్ చేసి జేబులో పర్సు లాక్కున్నప్పుడు చుట్టూ మూగిన జనం ఎవర్ని సమర్థించారు ? చోద్యం చూసి పోయారు తప్ప కలగజేసుకున్నారా ? ఈదేశ ప్రజలు అంతే ఎదురుగా హత్య జరుగుతున్నా పట్టించుకోరు ! నిజంగా నీకు ప్రజాభిప్రాయమే తెలుసుకోవాలని వుంటే నాతోరా ! చెవులారా విందువుగాని – వాళ్ళు గుమాస్తాలను ఎంతగా అసహ్యించుకుంటున్నారో ! . . నీతిమంతులెవరూ మిమ్మల్ని సమర్థించరు ! ప్రభుత్వాన్ని పడగొడతాం అనే వాళ్ళని ఏమని పిలవాలి ? దేశద్రోహులా ? రాష్ట్ర ద్రోహులా ? బాధ్యతల్ని విస్మరించి హక్కుల కోసమే పోరాడేవాళ్ళను ఎలా పిలవాలి ? సంఘ ద్రోహులా ? స్వార్థపరులా ?"

ఒక్కసారిగా అసహ్యం పెల్లుబికింది శంకరయ్యలో ఎదురుగా కనిపిస్తున్న నిజాన్ని ఒప్పుకోని మూర్ఖుడు ! అడ్డంగా వాదించే వితండవాది ! ఛీఛీ యిలాంటి కొడుకుతో వాదన ఏమిటి ?! మంచి మర్యాదలేకుండా వాగుతాడు తండ్రిని "నీవు" అంటాడు ! పరమశత్రువు కంటే నీచంగా అవమానిస్తాడు ! కృష్ణ — చిన్నప్పుడెంత ముద్దుగా బుద్ధిగా ఉండేవాడు ! ఇప్పుడెందుకిలా తయారైనాడు ?

యౌవనం! వ్యక్తిత్వం!! – ఛీఛీ యువతరం చెడిపోతోంది చీదరించుకొని లోనికిపోయాడు శంకరయ్య

సమ్మె ఉధృతం అవుతోంది సంఘ నాయకుడుగా క్షణం తీరికలేకుండా తిరుగుతున్నాడు శంకరయ్య ఇంటికి ఎప్పుడు వస్తాడో, ఎప్పుడు వెళతాడో ఆయనకే తెలియదు

కృష్ణ దినచర్య కూడా మారింది ఉదయం అంతా యింట్లోనే వుంటాడు సాయంకాలం నాలుగయితే చాలు వెళ్ళిపోతాడు అర్ధరాత్రిగాని యింటికి రావడంలేదు ఒక్కోసారి తెల్లవారేక వస్తున్నాడు కృష్ణ చెడిపోతున్నాడని పార్వతమ్మ భయం కాని కొడుకుని నిలదీసి అడగలేదు తండ్రినే అవమానించే కొడుకు – తల్లిని గౌరవిస్తాడా ? చెబుదామంటే భర్త యింటి పట్టునే ఉండడంలేదు ఎలా చచ్చేది ? అని బాధపడేది పార్వతమ్మ

సమ్మె ముగిసింది ఘనవిజయం సాధించినట్లు ఉప్పొంగిపోయారు ఎన్ జీ. వో. లు. మూడు రోజులుగా హైద్రాబాద్ లోనే వుండిపోయిన శంకరయ్య కొండంత ఉత్సాహంతో తిరిగి వచ్చాడు. ఈ క్షణంలో కొడుకు ముఖం చూడాలని మహా ఉబలాటంగా వుందతనికి కాని కృష్ణ యింటిలోలేడు ఆయన ఉబలాటం చల్లారిపోయింది అప్పుడు రాత్రి పది

కొడుకులో వచ్చిన మార్పు గురించి పార్వతమ్మ భర్తకు చెప్పుకుంది దీర్ఘాలోచనలో మునిగిపోయాడాయన

పదకొండు దాటాక కృష్ణ నెమ్మదిగా తలుపు తట్టాడు అమ్మ తలుపు తెరవగా నిశ్శబ్దంగా లోనికివచ్చాడు

"ఇంత రాత్రివరకూ ఏం చేస్తున్నావ్‌రా ?" గర్జించాడు శంకరయ్య

"ఒక అమ్మాయిని బ్లాక్ మెయిల్ చేస్తున్నా" సూటిగా వచ్చింది సమాధానం ! ఆ స్వరంలో నదురూ బెదురూ లేదు ఖంగు తినేసాడు శంకరయ్య చివరకు తేరుకొని "ఒరేయ్ ! ఒరేయ్ ! ఇదేం పాడుబుద్ధిరా ?! మన యింటా వంటాలేదు చెడబుట్టావురా త్రాష్టుడా ! ఆడపిల్లని బెదిరించి డబ్బు గుంజుతున్నావా ?"

"ఇంటా వంటా లేకపోవడం ఏమిటి నాన్నా ? నీవు బ్లాక్‌మెయిల్ చేయలేదూ ?"


"నేనా ?!!"

"మా కోర్కెలు తీర్చకపోతే ప్రభుత్వాన్ని స్తంభింపచేస్తాం అని బెదిరించి సాధించారుగా ! అది బ్లాక్‌మెయిల్‌కాదా ?"

అంత కోపంలోనూ – కొడుకు తమ సమ్మె విజయం గుర్తించినందుకు కాస్త సంతోషమే కలిగింది శంకరయ్యకు !

మర్నాడు – తమ విజయాన్ని పురస్కరించుకొని పార్టీ చేసుకొని ఎన్ జీ వో లందరూ సినిమాకు వెళ్ళారు ఇంటర్వెల్‌లో బయటకు వస్తూనే కొడుకుని, వాడు చేస్తున్న పనినీ చూసి షాక్ తిన్నాడు శంకరయ్య చుట్టూవున్న మిత్రులు ఎగతాళిగా నవ్వుతోంటే తల వంచుకున్నాడు ఇక సినిమా చూడలేక యింటికిపోయి భార్యమీద చిందులేసాడు "వాడు నా కొడుకా?! నా శత్రువు ! నికృష్టుడు ! త్రాష్టుడు !"

ఆ తిట్లకు అంతూ పొంతూ లేదు –



పదుకొండున్నరకి కృష్ణ యింటికి వచ్చేవరకూ తిట్లవర్షం కురుస్తూనే వుంది

కృష్ణ గుమ్మంలో అడుగు పెట్టగానే –

''ఆగక్కడ! లోనికి వచ్చావో మర్యాద దక్కదు! ఫో బయటకు! నీ ముఖం నాకింక చూపించకు'' గర్జించాడు శంకరయ్య.

లోనికి వేస్తున్న అడుగు బయటకు తీసుకుని గిరుక్కున వెనక్కి తిరిగి చరచర వెళ్ళిపోయాడు కృష్ణ!

హటాత్తుగా జరిగిన ఆ సంఘటనకు పార్వతమ్మేకాదు, శంకరయ్య కూడా దిమ్మెరపోయారు కృష్ణ పట్టుదల యిద్దరికీ తెలుసు కృష్ణ యిక ఈ యింటికి రాడా? శాశ్వతంగా తెగతెంపులు చేసుకున్నాడా?!

జరిగిన సంఘటన నమ్మశక్యంగా లేదు వాళ్లకు

* * *

మర్నాడు శంకరయ్య ఆఫీసుకి వెళ్ళాక రఘు బయలుదేరి అన్న కృష్ణ ఎక్కడ ఉంటున్నాడో వాకబు చేసి వచ్చాడు కుమిలిపోతున్న తల్లికి ధైర్యంచెప్పి అక్కడకు తీసుకునివెళ్లాడు.

అదొక పెద్దగది ఒకవైపు మంచం, చిన్న సూటుకేసు, మరోవైపు కిరాణాసామాను పొట్లాలు ఒక మూల రుబ్బురోలు దాని ముందు కూచుని కృష్ణ–పప్పు రుబ్బుతున్నాడు!

''ఏమిటి బాబూ అది?!'' డగ్గుత్తికతో అడిగింది పార్వతమ్మ.

''శనగపప్పు అమ్మా! . రుబ్బుతున్నా'' నవ్వేశాడు కృష్ణ.

పార్వతమ్మ కన్నీరు పెట్టుకుంది

''నేను తప్పపని చేస్తున్నానా అమ్మా?'' నెమ్మదిగా అడిగాడు.

అమ్మ సమాధానం చెప్పలేదు.

''అలా మంచం మీద కూర్చోండి'' అన్నాడు రుబ్బడం ఆపి

''అంత పప్పు రుబ్బుతున్నావెందుకు బాబూ?''

తల్లికి అసలు విషయం తెలియదని గ్రహించాడు కృష్ణ. లేచి, గది ప్రక్కనే వున్న సందులోనికి వాళ్లని తీసుకెళ్లాడు

అక్కడ నాలుగు చక్రాల తోపుడు బండి వుంది దానిమీద ఒక చివర కిరోసిన్ స్టౌవ్, స్టౌవ్‌మీద పెద్ద మూకుడు ఉన్నాయి

ఆ బండి ఏమిటో గుర్తించిన పార్వతమ్మ కొడుకు చేస్తున్న పని ఏమిటో గ్రహించింది! దీర్ఘరంగా నిట్టూర్చి ''నీకీ ఖర్మ ఎందుకు బాబూ!'' అంది జాలిగా

''దీన్ని నేను కర్మ అనుకోవడం లేదమ్మా! ఈ రోజుల్లో ఉద్యోగం దొరకడం కష్టమే దొరికినా– ఆమ్యామ్యా కోసం అర్రులు చాచే వాళ్ళు, పని ఎగగొట్టి తిరిగే వాళ్ళూ, పని చేయకుండానే జీతం గుంజేవాళ్ళూ, చేయని పని కోసం జీతం పెంచమని సమ్మె చేసేవాళ్ళూ–ఆ ఆఫీసు వాతావరణం నాకు సరిపడదమ్మా! ఆఫీసుల్లో ప్రజాధనం ఎంత దోపిడీ అవుతోందో చూస్తే తల తిరుగుతుంది ఆఫీసులో చేరి ఆ దోపిడీలో భాగం పంచుకోలేను వాళ్ళని ప్రభుత్వం దారిలో పెడుతుందని ఆశించాను ఈ ప్రభుత్వమే కాదు, ఏ ప్రభుత్వమూ– ఈ పని దొంగల్నీ, ప్రజాధనాన్ని దోపిడీ చేసే తెల్ల కాలర్ పెద్దమనుషుల్నీ– దారిలో పెట్టలేదని నిరూపణ అయింది'' అన్నాడు నిస్పృహగా కృష్ణ

కొత్తగా అర్థం అయిన వ్యక్తినిచూసినట్టు కొడుకుని చూసింది పార్వతమ్మ ఆ చూపులో గౌరవం, వాత్సల్యం నిండుగా వున్నాయి

''ఆఫీసుల్లో అందరూ అలా వుండరుకదా! నీమట్టుకు నీవు న్యాయంగా నీ పని చేసుకోవచ్చు కదా!'' అంది పార్వతమ్మ

''ఈ ఆఫీసు సంగతి నీకు తెలియదమ్మా! ఎగ్గొట్టి తిరిగే పందికొక్కుల పని నోరులేని కుందేళ్ళ నెత్తిమీద పడుతుంది తిట్లు, దీవనలు, అరవచాకిరీ– కుందేళ్ళకు! జీతం మాత్రం పందికొక్కులకు! పందికొక్కుల మధ్య కుందేళ్ళు బ్రతకలేవమ్మా! అందుకే ఉద్యోగం

వంటలు

బూతాంగ్

కావలసిన సరుకులు — లేత కొబ్బరి బొండం — ఒకటి, జీడిపలుకులు — ఆరు, ద్రాక్షపండ్లు (ఎండువి) — ఆరు, బాదం పలుకులు — ఆరు, పిస్తాపప్పులు — ఆరు, చారపప్పులు — పది

తయారుచేయు పద్ధతి — ముందుగా పైన రాసిన పప్పులన్నీ సన్నగా చాకుతో ముక్కలు చెయ్యాలి తర్వాత కొబ్బరిబోండాన్ని పగులకొట్టి నీటిని లోపలి గుజ్జుని తీస్కొని ఉంచాలి. గుజ్జుని, నీటిని బాగా కలిసేట్టు కలపాలి

ఒక గ్లాసులో కొద్దిగా అంటే అరస్పూను చెక్కెరవేసి, దాంట్లో మెత్తగా కలిపిన గుజ్జుని, నీటితోసహా కొద్దిగా పోసి, తరిగిన పప్పులను కొంచెం వెయ్యండి మళ్ళీ గుజ్జునీరు పోసి చెంచాతో ఒకసారి కలుపుకోవాలి. కావల్సినవారు రెండు ఐస్ ముక్కల్ని వేసుకోవచ్చు ఇది ఫిలిప్పైన్ వారు త్రాగే సాఫ్ట్ డ్రింక్ వేసవి పానీయం. ఆరోగ్యానికి ఎంతో మంచిది

- వి. వి. రమణ

మైసూర్ దోసె

కావలసిన వస్తువులు — బియ్యం — రెండు కప్పులు, కొబ్బరికాయ (చిన్నది)— 1, పచ్చిమిరపకాయలు — 5, బెల్లం ముక్క — చిన్నది, దోసకాయ — 1, ఉప్పు — తగినంత, కొత్తిమీర— రెండు కట్టలు

చేసే విధానం — బియ్యంను నీటిలో అయిదు లేదా ఆరు గంటలు నానబెట్టాలి నానిన పిండిలో తురిమి ఉంచిన కొబ్బరి, పచ్చి మిరపకాయలు, బెల్లం ముక్క వేసి బాగా మెత్తగా రుబ్బాలి. తరువాత దోసకాయను చిన్న, చిన్న ముక్కలుగా తరిగి దానిని కూడా మెత్తగా రుబ్బి ముందుగా తయారుచేసి ఉంచిన పిండిలో వేసి బాగా దోసెల పిండిలాగా కలపాలి ఉప్పును, కొత్తిమీరను పిండిలో కలపవలెను. స్టవ్‌మీద పెనం పెట్టి దోసెలు పోయాలి. దీనిని వెన్నతో కలిపి తింటే చాలా రుచిగా ఉంటుంది ఈ వంటకాన్ని కర్నాటక ప్రాంతం వారు ఎక్కువగా చేస్తూ ఉంటారు.

— లక్ష్మి పి

అరటిపండు చపాతీలు

కావలసిన వస్తువులు :— బాగా మాగిన అరటిపండ్లు మూడు, గోధుమపిండి 200 గ్రాములు, చక్కెర 100 గ్రాములు, తగినన్ని జీడిపప్పు, ఎండుద్రాక్ష, తగినన్ని పాలు, నెయ్యి 200 గ్రా, చిటికెడు ఉప్పు, ఏలక్కాయలు రెండు

తయారుచేయు విధము — ముందుగా అరటిపండ్లకు పైపొట్టు తీసేసి చిన్న చిన్న ముక్కలుగా తరగాలి. జీడిపప్పు, ఎండు ద్రాక్షలను కూడ సన్నని ముక్కలుగా తరగాలి గోధుమ పిండిని జల్లించి అందులోకి కొంచెం నెయ్యి, అరటిపండ్ల ముక్కలు, జీడిపప్పు ముక్కలు, ఎండుద్రాక్ష ముక్కలు, చిటికెడు ఉప్పు, ఏలక్కాయల పొడి వేసి బాగా కలపాలి తర్వాత పాలల్లోకి చక్కెరను పోసి బాగా కలిపి కరిగించాలి. ఈ పాలను గోధుమపిండి మిశ్రమంలోకి కొద్ది కొద్దిగా పోస్తూ బాగా పిసికి చపాతీల పిండిలా కలిపి వుంచుకోవాలి. పిండిని కాస్సేపు నాననివ్వాలి తర్వాత ఈ పిండితో చపాతీలు వత్తుకోవాలి వీటిని కాలుతున్న పెనంపై వేసి రెండు వైపులా నేతితో కాల్చి తింటే చాలా రుచిగా వుంటాయి. పిల్లలు ఇష్టంగా తింటారు

— శ్రీమతి గార్ల సరస్వతి

బ్రెడ్ పుడ్డింగ్

కావలసిన వస్తువులు —

బ్రెడ్ : 1 పాకెట్, పాలు పావు లీటరు, చక్కెర . 500 గ్రా, పల్చటి కోవా: 250 గ్రా, సారపప్పు 10 గ్రా, కిస్‌మిస్ 5 గ్రా

చేయు విధానం :—

మొదట బ్రెడ్ స్లైస్‌లను నెయ్యితో దోరగా పెనంమీద వేయించుకొనవలెను వేగిన బ్రెడ్‌ను పాలలో నానవేయవలయును. చక్కెరను చిక్కగా పాకంలా తయారు చేసుకొని నానిన బ్రెడ్ స్లైస్‌లపై పోయవలయును పాకం స్లైస్‌లకు బాగా పట్టిన తరువాత ఒక్కొక్క స్లైస్‌ను తీసికొని ఇరువైపులా కోవాను పూసి ఒక పెద్ద పళ్ళెంలో విడివిడిగా స్లైస్‌లను వుంచి మూతపెట్టి సన్నటి సెగలో వుడకనివ్వాలి దింపిన తరువాత ఈ స్లైస్‌లపై సారపప్పును, కిస్‌మిస్‌లను డెకరేట్ చేయవలెను వేడి వేడిగా తింటే ఎంతో రుచి

— బి. శ్యామ

సోవియా కేక్

కావలసిన వస్తువులు —

మైదాపిండి—2 టేబుల్‌స్పూన్స్, పెరుగు—1 స్పూన్, నీళ్లు—5 స్పూన్స్, చక్కెర — పావుకిలో, నెయ్యి—అరకిలో

చేయు విధానము — అరకేజి నెయ్యిలో సగము నెయ్యి కాచి ప్రక్కన ఉంచాలి పైన చెప్పిన కొలతలలో మైదాపిండి, పెరుగు, నీళ్లు, చక్కెర, నెయ్యి కలిపి ఒక దళసరి గిన్నెలో వేసి అడుగంటకుండా కలిపి, ఇంకుతున్నప్పుడల్లా నెయ్యిపోస్తూ ఉండాలి. కొంచెము బ్రౌను కలరులో స్వీట్ గట్టిపడుతుండగా, నెయ్యి రాసిన ప్లేటులోకి కుమ్మరించవలెను ఈస్వీట్‌లో చాలావరకు నెయ్యి బయటకు వచ్చేస్తుంది కనుక, ఆ నెయ్యి తిరిగి మనం వేరే స్వీట్‌కు ఉపయోగించుకోవచ్చు.

— పి. సవిత ★

చేయదలచుకోలేదు నేను. అందుకే నాస్నేహితుని రికమెండేషన్‌మీద బ్యాంక్ ఋణం తీసుకున్నా. వారం రోజుల క్రితమే ఈ వ్యాపారం మొదలు పెట్టాను. ఇందులో మోసం చేయకుండా, దోపిడీ చేయకుండా బ్రతకగలనని అనుకుంటున్నా. ఆ బండిమీద— వేడి వేడి పకోడీ, మసాలావడ లాంటివి అప్పటికప్పుడు చేసి అమ్ముకుంటున్నా సాయంకాలం పార్కువద్ద...రాత్రి సినిమా హాళ్ల వద్ద— నిన్న నాన్న నన్ను చూశారు . అందుకే ఆ చిందులు ! ఆయనలా నేను ప్రజా ధనం దోచుకోడంలేదు ఆయనకంటే గౌరవప్రదంగానే జీవిస్తున్నానని నా భావన...'' తండ్రిని తిడుతు

ఒక కుందేలు కథ

న్నందుకు తల్లికి కోపం వచ్చిందేమోనని ఆమె వైపు ఒకసారి చూసాడు కృష్ణ. ఆమె ముఖం ప్రసన్నంగా వుంది !

సందులోంచి అందరూ గదిలోనికి వచ్చేసారు

''ఈ ఊళ్ళో ఎంతమంది తిండిబోతు లున్నారో, వాళ్ళు — రుచిగా, శుచిగా వుండే తినుబండారాల కోసం ఎలా ఎగబడతారో నీవు చూసి తీరవలసిందేగాని చెబితే నమ్మవు. రెండు రూపాయల వడలు అలా నిలుచుని తినేసే వాళ్ళున్నారు ! రోజా పాతికరూపాయలపైనే లాభం వస్తోంది శలవు రోజుల్లో అయితే మరీ ఎక్కువ మరో రెండేళ్ళలో చిన్న హోటల్ పెడతాను ఇంకో ఐదేళ్ళకు పెద్ద హోటల్ అప్పుడు కాలుమీద కాలేసుకుని దర్జాగా బ్రతకవచ్చు ''

భవిష్యత్తు గురించి ఉత్సాహంగా చెబుతూ హఠాత్తుగా టైమ్ చూసుకున్నాడు కృష్ణ.

''అయ్యో ! మ్యాట్నీ సినిమాకు టైమ్ అవుతోంది'' అంటూ కంగారుగా రుబ్బురోలు ముందు కూర్చున్నాడు.

''లే బాబూ ! నేను రుబ్బుతాను'' అంది పార్వతమ్మ నిశ్చలంగా. ★

ప్రజాభ్యుదయానికి
పాలనా సంస్కరణలు - ప్రజా సంక్షేమ పథకాలు

శ్రీ ఎన్. టి. రామారావు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విజయవంతంగా ఒక ఏడాది పాలన పూర్తిచేసిన సందర్భాన్ని పురస్కరించుకుని సామాన్య ప్రజల శ్రేయో సౌభాగ్యాలకు అనేక పాలనా సంస్కరణలను, సంక్షేమ పథకాలను ప్రకటించింది.

పాలనా సంస్కరణలు :

★ ప్రభుత్వ పరిపాలనను ప్రజలకు మరింత సన్నిహితంగా తీసుకువెళ్ళే ప్రయత్నంగా
★ 1,200 మండలుల ఏర్పాటు.
★ ప్రతి 35,000 నుంచి 55,000 జనాభాకు ఆ గ్రామాలన్నిటికీ అభివృద్ధి కేంద్రంగా ఒక్కొక్కమండలి.
★ రాచరిక పాలనకు అవశేషంగా మిగిలిన గ్రామాధికారుల పదవుల రద్దు వీరి స్థానంలో గ్రామ సహాయకుల నియామకం.

బలహీన వర్గాలకు చేయూత :

★ 1,800 రూ ల కన్న తక్కువ వార్షికాదాయంగల వితంతువులకు నెలకు రూ. 50 లు పింఛను.
★ అనాథలకోసం ఆశ్రయ గృహాలు.
★ వెనుకబడిన తరగతులకు సంబంధించి మండల్ కమిటీ సిఫారసులు పూర్తిగా అమలు.

అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమం :

★ అల్ప సంఖ్యాక వర్గాల వారి సంక్షేమంకోసం ఒక ప్రత్యేక ఆర్థిక సహాయ సంస్థ.
★ అల్ప సంఖ్యాక భాషా వర్గాలవారు అధికంగా వున్న ప్రాంతాల్లో వారి మాతృభాష బోధనకు సౌకర్యాలు కల్పన.

ఇతర సంక్షేమ చర్యలు :

★ 12 సంవత్సరాల లోపు వయసుగల విద్యార్థులకు పాఠశాలకు వెళ్ళి రావడానికి రోడ్డు రవాణా సంస్థ బస్సులలో ఉచితంగా ప్రయాణం చేసే సౌకర్యం.
★ భూమి శిస్తు రద్దు.
★ భారీ పరిశ్రమల కార్మికులకు ఆయా యాజమాన్యం వారి భాగస్వామ్యంతోనూ మధ్యతరహా, లఘు పరిశ్రమల కార్మికులకు ప్రభుత్వ సహాయంతోనూ గృహవసతి.
★ రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు కూడా కేంద్ర ప్రభుత్వోద్యోగులకిచ్చే కుటుంబ సంక్షేమ ప్రోత్సాహకాలు విస్తరింపు.

సంస్కృతీ వికాసం, సినీ పరిశ్రమాభివృద్ధి :

★ క్రీడలు, సంస్కృతి, యువజన సంక్షేమ కార్యకలాపాల అభివృద్ధికి ప్రతిజిల్లాలో ఒక సాంస్కృతిక కేంద్రం.
★ ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమాభివృద్ధికి అనేక ప్రోత్సాహకాలు ప్రకటన.

సమాచార, పౌర సంబంధశాఖ, ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు

DIPR No, 2/PIL/Advt/C4/84.

వింధ్యవాసిని సీరియల్: గోరంతదీపం

27 **(గత సంచిక తరువాయి)**

ఆవేళ విశ్వం ఇల్లు చేరేపట్పటికి రాత్రి పదకొండు గంటలయింది డోర్‌లాక్ వేసుకుని నిద్రపోతోంది రమణ. కూతురి నిద్ర భంగం కాకుండా మెల్లిగా తన దగ్గరున్న డూప్లికేట్‌తో లాక్ తీసుకుని లోపలికి వెళ్ళాడు. ఎంత నిశ్శబ్దంగా వెళ్ళినా, ఒకోసారి రమణ నిద్రలేచి వచ్చేస్తుంది, తండ్రికి భోజనం పెట్టేందుకు. ఇవాళ కాస్త మంచినిద్రలో ఉన్నదేమో మెలకువ రాలేదు

తన గదిలోకి వెళ్ళి బట్టలు మార్చుకున్నాడు విశ్వమూర్తి. డైనింగ్ టేబిల్ మీదున్న గిన్నెల్లోంచి వడ్డించుకుని భోజనం కానిచ్చాడు. ఆయనకిలా ఆలస్యంగా, చల్లబడిన అన్నమూ, కూరలూ కలుపుకుని భోంచేయటం మామూలే కాకపోతే, కూతురు ఎదురుగా ఉండి కబుర్లు చెబుతూ ఉంటే కాస్త రెండు ముద్దలు ఎక్కువగా తింటాడు, అంతే !

సిగరెట్ వెలిగించుకుని, తన గదిలోకి వెళ్ళబోతూ ఒకసారి కూతురు గది గుమ్మంలో నిలుచుని లోపలికి చూసాడు తెల్లటి దుప్పటి కప్పుకుని ప్రశాంతంగా నిద్రపోతోంది రమణ క్రాలకి కట్టివున్న దోమతెర ముడిచి పైకి వేసి వుంది. చిన్నగా నవ్వుకుంటూ వెళ్ళి దాన్ని లాగి కూతురి చుట్టూ సరిగ్గా సర్దేడు "చిన్నప్పటి నించీ ఇంతే ఈ పిల్ల. దోమతెర అంటే గిట్టదు'' అనుకున్నాడు దోమతెరవేస్తే నేను పడుకునేది లేదని పేచీపెట్టే ఏడిచే చిన్న రమణ గుర్తొచ్చిందతనికి

ఆమె నుదుటిమీద చెయివేసి, "ఏమిటో పిచ్చిపిల్ల, పెళ్ళి అయి ఇల్లాలవుతుంది అంటే నమ్మకం కలగటం లేదు'' అనుకుని, వెళుతూ ఫేన్ ఆన్ చేశాడు విశ్వమూర్తి. తను అవతల లయిటు వేసినా, ఏదయినా శబ్దం చేసినా ఆమెకి నిద్రాభంగం అవకుండా తలుపులు దగ్గరికి లాగి పెట్టాడు వాలుకుర్చీలో కూచుని, చేతిలో పీకని పారేసి, మరో సిగరెట్ వెలిగించుకున్నాడు

అతను ఆ సాయంత్రం హరిప్రసాద్ గదికి వెళ్ళి, మాట్లాడాడు. ఆ సంభాషణ గుర్తొస్తోంది ప్పుడు

ఆఫీస్ నించీ ఇద్దరూ కలిసే బయలు దేరారు విశ్వమూర్తి తనతో మాట్లాడాలని చెప్పినప్పుడు, అంతకు ముందు రోజు తనకి, పరశురాంకీ మధ్య నడిచిన సంభాషణ ప్రభావమేనని తెలుసు కాబట్టి ఏం ఆశ్చర్యపోలేదు ఆయన అడిగిన వెంటనే తన ఇంటికి రమ్మని ఆహ్వానించాడు. కానీ, ఆయన ఇప్పుడే వెంట వస్తాడని ఊహించలేదు ఆయన కాస్త టయిం ఇచ్చి వుంటే, కొంచెం ఇల్లు బాగా సర్ది, అరేంజ్‌మెంట్సు చేసుకునేవాణ్ణి కదా అనిపించింది హరికి పోనీ బ్రహ్మచారి ఇల్లు, మర్యాదలు ఎంత మాత్రం ఉంటాయో ఆయనకి మాత్రం తెలీదేమిటి? అని సర్ది చెప్పుకున్నాడు దారి వెంబడి ఇద్దరూ ఏమీ మాట్లాడుకోలేదు ఇంటి దగ్గర దిగి లోపలికి నడుస్తున్నప్పుడు విశ్వం ముఖం సీరియస్‌గా ఉండటం చూసి, ఏదో డీప్‌గా ఆలోచిస్తున్నారులా ఉంది అనుకున్నాడు హరి ఎదురుగా రెండో మనిషి ఉండగా ఆలోచించటం, మౌనంగా వుండటం ఆయన మామూలు అలవాట్లు కాదు తను కూడా ఆయనంత ఆయన మాట్లాడేదాకా, మూడ్‌ని డిస్టర్బ్ చేయకూడదనుకుని మౌనంగానే తలుపు తెరచి లోపలికి నడిచాడు

హరి వెంబడే లోపలికి నడిచిన విశ్వమూర్తి ఒక్కసారి గది చుట్టూ పరికించి చూసి, గోడ వారగా ఉన్న ఒక పేము కుర్చీలో కూర్చున్నాడు

పక్క ఇంటి అబ్బాయి పాలసీసా తెచ్చి ఇచ్చాడు అతిథినలా కూచోబెట్టి తను కాఫీ పెట్టేందుకు లోపలికి వెళ్ళాడు హరి

విశ్వం కూర్చున్న గదికి కుడివయిపు వంట గది, ఎడమవయిపు పడకగదీ ఉన్నాయి 'ఫరవాలేదు, చిన్న ఇల్లు — పొందికగా ఉంచుకున్నాడు' అనుకున్నాడు విశ్వం.

గదిలో మూలగా వేసి ఉన్న రైటింగ్ టేబిల్‌మీద వారగా ఓ కట్ట తెల్లకాయితాలు. పాడ్, పెన్, ఇంక్ బాటిల్ ఉన్నాయి. మరో పక్క రాసిన కాయితాలు నీట్‌గా సర్ది పెట్టిన ఫైళ్ళున్నాయి టేబిల్ కిందుగా ఉన్న ఓ అరలో న్యూస్‌పేపర్లు, మేగజైన్లు వరసలుగా పేర్చి ఉన్నాయి. హరి చాలామటుకు ఆఫీసులో ఎప్పుడో తప్ప, తనతోబాటు ఎంత రాత్రయినా ఉండిపోతుంటాడు అక్కడ అంత పనిచేసి, మళ్ళీ కూర్చుని రాసుకుందుకు వీలు చేసుకుంటూ

జరిగిన కథ — 10 : గుండూరావ్ కూతురు కామేశ్వరిని పెళ్లి చేసుకొంటాడు పరశురామ్. తన భార్య మీనాక్షి కాన్పు కష్టం అయి చనిపోగా విశ్వం బెంగుళూరులో వున్న ఒక ఆంగ్ల పత్రికలో రిపోర్టర్‌గా చేరతాడు 'గోరంతదీపం' అనే వారపత్రికను పరశురామ్, విశ్వం కలసి నెలకొల్పుతారు. హరిప్రసాద్, రమణ ప్రేమించుకుంటారు హరి తనపుస్తకం పబ్లిసిటీ వర్క్‌మీద హైదరాబాదు వెళుతూంటే కరుణ వీడ్కోలు చెప్పను స్టేషన్‌కు వస్తుంది. రైల్లో తన చిన్నతనపు రోజులు జ్ఞప్తికి తెచ్చుకుంటాడు హరి — తన తండ్రి తల్లిని వదిలేయగా తను అనాథగా, తల్లి అక్కడే ఆయాగా ఒక అనాథశరణాలయంలో చేరుతారు తల్లి మరణిస్తుంది. కాలేజీలో చదివే రోజుల్లోనే రావు పరిచయమవుతాడు. హైదరాబాదులో రావుని కలిసిన హరి అతని ప్రవర్తనలో మార్పు రానందుకు చింతిస్తాడు హరి అతనితో తన పని ముగించుకొని అరుణ, రమణ, కరుణలకు ప్రెజెంట్స్ తీసుకొని హైదరాబాదు నుంచి వస్తాడు రమణ మనస్సులో తనకు స్థానం ఉందని తెలుసుకుంటాడు. హరి పుస్తకం 'కదిలే బొమ్మల చరిత్ర'కి న్యూ సాహితి అవార్డు వచ్చింది. ఈ విషయం విని పరశురాం, విశ్వమూర్తి గార్లు సంతోషపడతారు. హరి పుస్తకాన్ని పబ్లిసైజ్ చేసేందుకు టూర్‌కు వెళితే బాగుంటుందని అతనికి సూచిస్తుంది రమణ. పరశురాం హరిని తన కూతురు అరుణని పెళ్లి చేసుకోమని కోరగా హరి తను, రమణ వివాహం చేసుకోడానికి నిశ్చయించుకున్నట్లు చెప్పేస్తాడు. తను రమణ పెళ్లి విషయం ఆలోచించనందుకు చింతిస్తాడు పరశురాం. పరశురాం తమ్ముడు ప్రకాశం కూతురు రమణ ఆ పిల్లను చేరతీసి పెంచుతాడు విశ్వమూర్తి.

డన్నమాట గట్టివాడు, పట్టుదల ఎక్కువ — అని మనసులోనే మెచ్చుకున్నాడు హరిని. అయినా తను మాత్రం అతని వయసులో ఉండగా అలాగే పనిచేసేవాడు కాదూ ? రాత్రుళ్ళు రాత్రులే అలాగే నిద్రలేకుండా వ్యాసాలు, పుస్తకాలు రాస్తూ కూర్చునేవాడు అంత పేషన్సు ఇప్పుడెక్కడుంది ? - అనిపించింది.

ట్రేలో రెండు కాఫీ కప్పులతో వచ్చాడు హరి ఇంతలో

''స్వయంపాకమేనా ?'' చిరునవ్వుతో అడిగాడు కాఫీ తాగటం అయిన తర్వాత.

''ఒకప్పుడు. ఇప్పుడు వీలు అవటంలేదు లెండి ''

కొంచంసేపు ఇద్దరిమధ్యా ఆఫీసు కబుర్లే దొర్లాయి. అసలు విషయం ఎప్పుడు మొదలు పెడతాడా అని ఎదురుచూస్తూనే మాట్లాడు తున్నాడు హరిప్రసాద్.

''ఉదయం పరశురాం మీ విషయం చెప్పగానే, వెంటనే నా రియాక్షన్ ఏమిటో చెప్పమంటావా హరీ అబ్బ! ఇన్నాళ్ళకయినా దొంగలిద్దరూ బయటపడే ధైర్యం చేశారు కదా అని'' అంటూ నవ్వాడు విశ్వమూర్తి.

తనూ నవ్వుతూనే సిగ్గుతో తలవంచేసు కున్నాడు హరిప్రసాద్

''ఆడపిల్ల తండ్రే అడగటం ఆచారం కదా, అందుకనే నే నివాళ నీతో వచ్చింది నీకు మరో ముఖ్యమయిన విషయం చెప్పాలి ఇది రహస్యమూ కాదు. దాచాల్సిందీ కాదు కానీ నీకు నా నోటి ద్వారానే చెపితే నాకు తృప్తిగా ఉంటుంది. రమణ నా స్వంత కూతురు కాదు తనకి నేను పెంపుడు తండ్రిని మాత్రమే ''

హరి ఇది ఎరుగడు. ఆ మాటకొస్తే అసలు రమణకే తెలియని విషయం హరి కెలా తెలుస్తుంది ? అందువల్ల విశ్వం అలా చెప్పిన వెంటనే కొంచం ఆశ్చర్యం వేసింది తప్ప, అతని మనసుకింకేమీ అనిపించలేదు. కొన్ని క్షణాలపాటు ఇద్దరూ మౌనంగా ఉండిపోయారు

ఆయన తనని గురించేమయినా చెబితే వినాలని చూస్తున్నట్లు గ్రహించాడు హరి.

'నేను అనాధశరణాలయంలో పెరిగిన వాడినని మీకు తెలిసేవుంటుంది. నేను ఇంటర్మీడియట్‌లో ఉండగా మా అమ్మ పోయింది అప్పటినుండీ ఒంటరిగానే మిగిలి పోయాను . మీ అమ్మాయి గురించి ఎంతో చెప్పాలని ఉంది కానీ మీ బంగారంలో సుగుణాలు మీకు నేను చెప్పాలా సార్ ! ఆమె నా మనసు నెంత బాగా అర్థం చేసుకుని, నాలో ఒంటరి తనాన్ని పోగొట్టిందీ మాటలలో చెప్పలేను ''

తన మాటలు వింటూ ఉన్న విశ్వమూర్తి దృష్టి, అటువయిపు పుస్తకాల అల్మైరా పైన స్టీల్‌ఫ్రేమ్‌లో ఉన్న ఫోటోమీదే ఉండటం గమనించాడు అదెప్పుడో పాతకాలం నాటిది. దూరానికి సరిగా కనిపించనంతగా మసకబారి పోయింది.

లేచి వెళ్ళి ఫోటో తెచ్చి ముందున్న స్టూల్‌మీదుంచాడు హరి; ఖాళీ కాఫీ కప్పులు తీసి అవతలపెడ్తూ, ''ఈవిడ మా అమ్మ'' అని విశ్వమూర్తి నుద్దేశించి చెప్పాడు.

ఫోటో చేతిలోకి తీసుకోకుండానే కొన్ని క్షణాలపాటు దీక్షగా చూశాడు విశ్వం దానివయిపే. అందులో దాదాపు ఇరవయి సంవత్సరాల వయసున్న అమ్మాయి ఉంది. బాగా చూస్తే ఆమె ముఖంలో హరి పోలికలు తెలుస్తున్నాయి. ముఖాన పెద్ద బొట్టు, ప్రకాశవంతంగా ఉన్న కళ్ళు, నొక్కులు తిరిగిన జుట్టు పత్యేకంగా కనిపిస్తున్నాయి.

అలాగే చూస్తూ ఉన్న విశ్వం ముఖంలో ఏదో మార్పు కన్పించింది హరికి. గబుక్కున ఫోటో అంది పుచ్చుకుని, ''రాజ్యంలా కనిపిస్తోందే'' అని మెల్లిగా గొణుక్కోవటం వినిపిస్తూనే ఉంది.

''మా అమ్మ పేరీయినకెలా తెలుసు ? '' అని ఆశ్చర్యపోవటం హరి వంతు అయింది.

''ఇలా అడుగుతున్నానని మరోలా అనుకో వద్దు. నా అనుమానం నిజం అయితే నీ సందేహం తీరుస్తాను. మీ అమ్మపేరు రాజ్యలక్ష్మి కదూ ? ఆవిడ పుట్టింటివారి ఊరు శింగనమల కదూ ? ''

తనిన్నాళ్ళుగా ఎక్కడో మనసు అడుగున దాచేసిన జ్ఞాపకాలు బయటికి తీయాల్సి వచ్చింది



హరి. "అమ్మ తనకి అన్నగారని చెప్పిన పరశు రాంగారి ప్రాణమిత్రుడు కదూ ఈయన. అందుకనే అమ్మని గుర్తుపట్ట గలిగాడేమో !" అనుకున్నాడు.

"అవునండి. మీరు అనుకుంటున్నది నిజమే. నేను రాజ్యలక్ష్మి కొడుకుని. పరశురాం గారు నాకు మామ అవుతారని తెలుసు. కానీ ఆ మాట బయట పెట్టి, ఆయన సహాయం కోరితే చులకన అవుతానేమోనని ఎవరికీ చెప్పలేదు. మీకు చిన్నప్పుడు తెలుసేమో కదూ మా అమ్మ"

"తెలుసేమిటి బాబూ ! నేనామెని సరి అయిన సమయంలో ఆదుకోగలిగుంటే నీకు తండ్రి నయేవాణ్ణి"అని మనసులోనే అనుకున్నాడు విశ్వమూర్తి.

"అవును. మీ మామయ్యదీ నాదీ ఒకే ఊరు. చిన్నప్పుడు మేమంతా కలిసి ఆడుకున్న వాళ్లం. అవునూ... మీ నాన్న..."

"దయచేసి ఆ విషయం మాత్రం వన్నడగ వద్దండి సార్. ఈ ఫోటో పక్కనే ఉన్న మరో భాగాన్ని చింపేసిన గుర్తులు కనిపిస్తున్నాయి కదూ? అందులోఉన్న వ్యక్తి నా కన్నతండ్రి,నాకు ఆగర్భశత్రువూనూ. ఆ భాగాన్ని చింపి, అగ్గిపుల్ల గీసి అంటించేసాను. ఈ మాటతో నా భావం అర్థం చేసుకోగలరనుకుంటాను."

"మీ అమ్మ తనకో తమ్ముడున్నాడని ఎప్పుడయినా చెప్పినట్లు గుర్తుందా నీకు ?"

"ఊహు .."

"ఆవిడ చెప్పలేదేమో కానీ పరశురాం ఆమెకి పెద్దమ్మ కొడుకు. స్వంత తమ్ముడు ఒకతనుండేవాడు, ప్రకాశం అని."

"ఆయనెక్కడున్నారండి ?"

"అతనెక్కడున్నాడో ఎవరికీ తెలీదు. నువ్వు తెలుసుకోగలిగీ చేసేదేమీ లేదు. నేను పెంచుకుంటున్న నా కూతురికి స్వంత తండ్రి అతను అని మాత్రం నాకు తెలుసు. అంతకు మించి నేనేమీ చెప్పలేను."

ఇదంతా ఏదో మిస్టరీ స్టోరీలా వుంది హరికి. తన తల్లికి స్వంత తమ్ముడున్నాడన్న విషయమే తనకి తెలీదు. ఆయన కూతురు రమణ అయితే మరి అతను, అతని కుటుంబం ఎక్కడున్నారు ? ఈయన ఏమీ అడగొద్దని అంటాడేం ? కొంపదీసి అతనూ, తన తండ్రి లాంటి బుద్ధిమంతుడేనేమో ! అందుకే ఆ పాత కథలు అన్నీ చెప్పడానికి ఈయనకి అయిష్టంగా ఉంది కాబోలు.

పోనీ ఏమయితే ఏం ? అవన్నీ ఆలోచించే రమణకి చేరువయినాడా ? ఇప్పుడెన్ని సంబంధా లున్నట్లు తెలిస్తే మాత్రం, వాటికి తానిచ్చే ప్రాముఖ్యత ఏముంది? తన క్కావలసింది రమణ తన జీవన సహచరి కావటం. అందుకు ఆమె తండ్రి అంగీకరిస్తున్నాడు, చాలు— అను కున్నాడు హరి.

గోరంత దీపం

తరవాత విశ్వం అక్కడ గడిపిన అరగంట వాతావరణం బరువుగానే ఉండి పోయింది.

బయలుదేరాడు విశ్వం, "వెళ్ళొస్తానోయ్ మరి" అంటూ.

"పదండి నేనూ వస్తాను. ఇంటిదాకా, ఇక్కడినించీ నడిచే వెళ్ళవచ్చు" అంటూ బయటి కొచ్చాడు.

"అవును. నిజమే కదూ. ఏమిటో ఇన్నాళ్ళయింది, నీ ఇల్లు దగ్గర్లో ఉందని నాకు తెలియనేలేదు ... అన్నట్లు నేనింటికి వెళ్ళటం లేదు హరీ మళ్ళీ ఆఫీసుకే వెళ్ళాలి. కొంచెం పనుంది ... నువ్వు ... నన్ను డ్రాప్ చేసేపనేం పెట్టుకోవద్దు. నేను వెళతాను" అంటూ జవాబు కోసం చూడకుండా ముందుకు నడిచాడు విశ్వమూర్తి.

28

'ఏమిటో ఆ అబ్బాయితో చెప్పాలనుకున్న మాటలన్నీ, అనుకోకుండా అతను రాజ్యం కొడుకని తెలియటంతో తన మనసులోనే ఉండి పోయాయి' అనుకున్నాడు విశ్వం కాలుతున్న సిగరెట్‌ని ఏష్‌ట్రేమీదుగా పట్టుకుని వేలితో చిన్నగా దులుపుతూ.

నిజానికి విశ్వమూర్తి కిద్దరు కూతుళ్ళు. రమణ ఎంతో, తన చేతులతో ప్రారంభించి నడుపుకొస్తున్న 'గోరంత దీపం' పత్రికా అంతే తన తదనంతరం పత్రిక హరిప్రసాద్ చేతుల్లోకి వెళ్ళాలని అతనెప్పుడో నిర్ణయించుకున్నాడు. తన కూతురిద్దరినీ, యోగ్యుడు, మంచితనమూ తెలివీ కలబోసిన మనసు గలవాడు అయిన వ్యక్తి చేతుల్లో పెట్టగలగటం అతనికెంతయినా ఆనందంగానే ఉంది.

కానీ ... తాను జర్నలిజం పయిపు ఎలా ఆకర్షితుడయిందీ, స్వంత పత్రిక ప్రారంభించక ముందు, బెంగుళూరులో మరో పత్రికలో పని చేసే రోజుల్లో, తన ఆలోచనలు, 'గోరంత దీపం' మొదటి సంచిక వెలువరించిన రోజు మొదలు ఈనాటివరకూ, తన అనుభవాలు, ఎదుర్కొన్న క్లిష్టపరిస్థితులూ — అన్నీ హరికి వివరించి చెప్పాలని ఉంది. నిజానికివన్నీ చెప్పాలంటే, కొన్ని గంటల సమయం కూడా చాలదు. కొన్ని రోజులపాటు చెప్పగలదు తను పోనీ ఓ దీర్ఘమయిన ఉత్తరం రాస్తే — అనిపించింది విశ్వానికి

తనకిప్పుడప్పుడే ఎలాగూ నిద్ర వచ్చేలాగా లేదు. ఇప్పుడే మొదలుపెడితే రాయటం అనిపించింది జ్ఞాపకాలు నెమరువేస్తూ, కళ్ళు మూసుకుని అలాగే ఉండిపోయాడు కొంతసేపు.

* * *

సరిగ్గా పదిహేను సంవత్సరాల క్రితం, జూన్ ఒకటవ తేదీ 'గోరంత దీపం' మొదటి సంచిక వెలువడింది.

నాలుగు పేజీల పత్రిక నింపేందుకు నెల రోజుల క్రితం నించీ మేటర్ రెడీ చేస్తున్నాడు విశ్వం అప్పట్లో తనకో అసిస్టెంటును కూడా ఉంచుకునే అవసరం కూడా కనిపించలేదు. రిపోర్టర్, సబ్ ఎడిటర్, ఎడిటర్ అన్నీ తనే అన్నమాట పత్రికకి.

ఎన్నో రోజులు ఆలోచించి, దేశ కాల పరిస్థితులను సమీక్షిస్తూ చక్కని సంపాదకీయం వ్రాసి పెట్టాడు అందుకు కనీసం పదిసార్లయినా వ్రాసి చింపేసి పదకొండోసారి సంతృప్తి పడ్డాడు. దానికి తోడు పరశురాం సలహాలు "అమ్మో మరీ ఇంత బరువుగా ఉంటే ఎవరూ చదవరేమో విశ్వం ?" అనో, "అబ్బే ! మరీ ఇంత చిన్నదిగా, హైస్కూలు కాంపోజిషన్‌లా ఉందేం ?" అనో, కావాలనే తనని తమాషా పట్టించేవాడు. భావానికి తగిన పదాలు వెతుక్కోవటంలో, ఇలా రాస్తే మరీ సిల్లీగా కనిపిస్తుందేమో అని ఒకసారి అనిపిస్తే, మరోలా రాస్తే డొంక తిరుగుడుగా అనిపిస్తుందేమో అని తోస్తుంది

ఇక మొదటి పేజీలో మాటర్ ఏం వేస్తే అప్పీలింగ్‌గా ఉంటుంది అని ఎంతో తర్జన భర్జనలు పడాలిసి వచ్చింది. బానర్, హెడ్‌లైన్ టైపులు, 'గోరంత దీపం' టైటిల్ డిజైన్ అన్నీ పరశురాం సెలక్షన్ చేశాడు. చివరకు, అమధ్యే ముగిసిన చైనా యుద్ధంలో ఓ కాలు, చెయ్యీ పోగొట్టుకున్న, కాప్టెన్ ఫోటోతో, ఇంటర్వ్యూ ఫీచర్ వేసేందుకు నిర్ణయించాడు. కాప్టెన్ రాజారాం, స్వంత ఊరు కర్నూలే. ఇంటర్వ్యూ ఇచ్చేందుకు సంతోషంగా అంగీ కరించాడు అతను.

మాటర్ అంతా కంపోజ్ చేయటం అయింది విశ్వమూర్తి ప్రతీ ఒక్క ప్రూఫు జాగ్రత్తగా దిద్దుకుని సరి చూసుకున్నాడు. మరుసటి రోజు పేపర్ ప్రింటింగ్‌కి వెళుతుంది. ఆవేళ నెహ్రూజీ మరణవార్త దేశప్రజలందర్నీ దుఃఖసాగరంలో ముంచేసింది.

కిరోసిన్ పొగలో కాన్సర్!

జపానులో ఇండ్లలో ఎక్కువగా కిరోసిన్ హీటర్లనే ఉపయోగిస్తున్నారు. ఈ హీటర్ల నుండి వెలువడే పొగలో కాన్సరునుకలిగించగల విషపదార్థాలున్నట్లు కనుగొన్నారు. అయితే ఇవి ఎంతమేరకు ఉంటే కాన్సరును కలిగించగలవో ఇంకా నిర్ధారించలేదు. అయితే ఈ వార్త ఆందోళనను కలిగిస్తున్నది. కిరోసిన్ హీటర్లు ఉన్న గదుల్లో కిటికీలు మూసి నపుడు కాన్సరును కలిగించే డినైట్రో పైరిన్లు ఉన్నట్లు మాత్రం పరిశోధనల్లో తేలింది !

విశ్వానికి ఏం చేయాలో అర్థం కాలేదు. అసలు పేపర్ ప్రచురణ ఆపు చేసేస్తే అనిపించింది ఆరోజు ఇరవయి ఏడో తారీఖు. ఇంక మూడు రోజులకి మార్కెట్‌లో కొత్త పత్రిక వస్తే మాత్రం ఎవరు పట్టించుకుంటారు ? ఎవరు కొని చదువుతారు ?

ఇది చూసిన పరశురాం, ''అంతగా బెంబేలు పడతావేం విశ్వం ? ఎప్పుడూ నాకు ధైర్యం చెప్పేవాడివి నువ్విలా అయిపోయావేం ? ముందు మొదటి పేజీ మాటర్ మార్చేసెయి నెహ్రూజీ లైఫ్‌సైజు ఫోటో బ్లాకు నేను ఎలాగయినా దొరికేలా చూస్తాను మిగిలిన స్పేస్ నువ్వు నింపేదారి చూడాలి అలాగే ఎడిటోరియల్ కూడా మార్చేస్తే బాగేమో !... ఇంతవరకూ వచ్చి వెనుకడుగు వేయటం ఏమిటి? ముందు జరగాల్సింది చూడు . నన్నేం సహాయం చేయమంటావో చెప్పు చేస్తాను '' అని ధైర్యం చెప్పాడు

ఎలాగయితేనేం పత్రిక అనుకున్నంతకన్నా చక్కని గెటప్‌తో మొదటి సంచిక తయారయింది. వూళ్ళో ఉన్న పుస్తకాలు, పత్రికల షాపులన్నింటికీ సప్లయి చేసిన కాపీలు అతి సులభంగా అమ్ముడుపోయాయి దాంతో తన శక్తిమీద తనకి కొంత విశ్వాసం ఏర్పడింది విశ్వం మనసులో. ఆ నెల రెండో సంచికని తయారు చేయటానికి రెట్టింపు ఉత్సాహంతో పనిచేశాడు పత్రికని ఆకర్షణీయంగా, మంచి పేరును ఏర్పరచుకునే విధంగా ఎలా తయారుచేయాలా అనే ఎప్పుడూ అతని ఆలోచన.

స్వలాభం అంటే ఏమిటో తెలియకుండా, పత్రికలు నడిపి, తను సత్యమని నమ్మిందాన్ని, అందరికి తెలియజెప్పే ప్రయత్నంలో ఏ అడ్డంకులు వచ్చినా లెక్కచేయక ముందుకు సాగిన పదానంద్ వంటి గొప్ప సంపాదకులు, వారి పత్రికల గురించి, విశ్వమూర్తి ఎన్నో పుస్తకాలలో చదివాడు. రాయలసీమలో ప్రతీ ఇంట్లోకి వెళ్ళాలి తన 'గోరంత దీపం' అన్న సంకల్పాల్ని మనసులో నిలుపుకుని పత్రికని ప్రారంభించాడు. అందులో ప్రతీ అక్షరమూ, పదమూ, వాక్యమూ అర్థవంతంగాను, ప్రజోపయోగకారిగానూ ఉండాలని తీర్మానించుకున్నాడు. ఇందులో వ్యాపార దృష్టికి తావే వద్దు అని గట్టిగా పట్టుబట్టాడు.

అందుకే చాలా రోజులు ప్రకటనలు వేయకుండానే పత్రికని నడుపుకునివచ్చాడు ఏ వ్యాపారం చేసినా, లాభనష్టాలు నిక్కచ్చిగా బేరీజు వేసే పరశురాంకి మాత్రం ఇది అసంతృప్తిగా ఉంది. పేపరు సర్క్యులేషన్ బాగా పెరుగుతోంది చాలా మంది, మీ పత్రికని వారపత్రిక చేయరాదా అని కూడా అడుగుతున్నారు. ఇంతవరకూ గోరంత దీపం, కర్నూలుకే పరిమితం అవటాని క్కారణం పబ్లిష్ అయిన కాపీలు, అక్కడ డిమాండుకే సరిపోతూ ఉండటమే. కొన్ని నెలల పాటు అడ్వాన్సులు లేకుండా అన్ని షాపులకీ వీళ్ళ కాపీలు ఇచ్చినా, తర్వాత మెల్లిగా పాపు వాళ్లే మాకు ఇన్ని కాపీలు కావాలి అని పోటీలు పడి అడుగుతున్నారు ప్రతీ సంచికని. పరిస్థితి ఇంతగా అభివృద్ధి అవుతున్నా లాభాలు అంతగా కన్పించటంలేదు. న్యూస్‌ప్రింట్ ఖరీదు, ప్రింటింగ్ ఖర్చులే డబ్బుని మింగేస్తున్నాయి. పోనీ కాపీ ఖరీదుని పెంచుదామా అన్నా దానివల్ల వచ్చేలాభంకన్నా, సేల్స్ తగ్గితే నష్టమే హెచ్చుగా వస్తుంది.

ప్రకటనలు తీసుకుంటే తప్ప లాభం లేదనిపించింది పరశురాంకి. విశ్వాన్ని ఎలాగయినా ఒప్పించాలని నిర్ణయించుకున్నాడు

''ఈ పద్ధతిలో నువ్ పేపర్ రన్ చేస్తే రెండేళ్ళు, మహాఅంటే మూడేళ్ళు — అంతే ఆ పయిన మూత వేసెయ్యాలిసిందే,'' అని చెప్పాడొక రోజు, విశ్వమూర్తికి.

పరశురాం బొత్తిగా అలా అనెయ్యటం అవమానంగా తోచింది విశ్వానికి. ''ఏరా ? అంత చేతకాని వాణ్ణనుకున్నావా ? ఓహో నీకూ భాగం వుంది కదూ ? నువు పెడుతున్న దానికి లాభం తగినంత అందటం లేదని నీ బాధ. నా భావాలు, నా పద్ధతులు నావి. నువ్వయినా మరొకరయినా అందులో కల్పించుకోవటం నేను భరించను నా బాధ్యతేమిటో నాకు తెలుసు. అంతగా అవసరం అయితే, నాకున్న ఆస్తి అంతా అమ్మేసి అయినా నా పత్రికని నిలబెట్టుకుంటాను, తెలుసా ? ''


''ఇదే గదా నీతో వచ్చిన చిక్కు ? ఇప్పుడు నేనేమన్నానని అంత కోపం ? నేను చెబుతున్నది మంచికేగానీ, నీకు చెడుపేరు తేవటానికి కానే కాదని అర్థం చేసుకోవేం !

అసలు నేనొక మాట చెబుతాను. కోపం తెచ్చుకోకుండా విను విశ్వం. నీకెన్ని అయిడియాలు, అయిడియల్సు ఉన్నా ఏవీ డబ్బులేకుండా సాధించలేవు కొంత డబ్బు మనం మదుపు పెట్టేమంటే, నువ్వెన్నయినా చెప్పు, మనం చేస్తున్నది వ్యాపారమే అవుతుంది. దాన్ని అలాగే, అంటే ఆ దృష్టితోనే చూడాలి, ఎన్నాళ్ళయినా, ఎన్నేళ్ళయినా, నా పత్రికకి లిమిటెడ్ సర్క్యులేషన్ చాలు, ఇవిలాగే వన్‌మాన్ ఎస్టాబ్లిష్‌మెంటుగా వుండిపోవాలని నువ్వనుకుంటే, అదే స్వార్థం అనిపించుకుంటుంది నేనొక్కణ్ణే కష్టపడి అన్ని పనులూ చేసుకుంటాననుకోవటం కాదు గొప్ప. నీతోబాటు నలుగురికి ఉద్యోగాలివ్వగల స్థితికి ఎదగాలి నువ్వూ, నీ పత్రికా, అదీ గొప్పతనమంటే.

నీ పేపర్‌కి ప్రత్యేకంగా ఓ ప్రెస్ ఉంటే ఎంతో ఉపయోగం అంతో ఇంతో కాస్త లాభాలు వచ్చేదారి చూడకపోతే ప్రెస్ కొనటం ఎప్పటికి చేయగలమంటావు ? అయినా నేనేమంత పాపం చెయ్యమంటున్నాను ? కొన్ని ప్రకటనలు తీసుకుంటే మంచిది అంటున్నాను. అంతకు అంత కోపమూ అయితే ఎలా ?

నీ మొండి పట్టుదల మానేసి ఆలోచించావంటే, నీకు మాత్రం అర్థం కాదూ నేనెందుకు చెబుతున్నానో !'' నిస్పృహగా అన్నాడు పరశురాం

స్నేహితుడి మాటలన్నీ నిదానంగా విన్నాడు విశ్వం. అతను తనని ఎలా అయినా అతని పాయింటు అర్థం చేసుకుందుకు ఇలా చెబుతున్నాడా అనీ అనుమానం లేకపోలేదు తనకి. ఎందుకంటే తన మిత్రుడెంత వ్యాపారదృష్టి గలవాడో తనకి తెలుసు



కానీ పరశురాం చెబుతున్నదాంట్లో కొంత నిజం ఉన్నదేమో అని అన్పించింది. అతను మాటమాటకీ 'నీ పేపర్' అని ఉపయోగించి తన స్వార్థాన్ని ఎత్తి చూపుతున్నాడా అన్పించింది. అయినా, తనున్నా పోయినా తన పత్రిక నాలుగు కాలాలపాటు ఇలా నడవాలంటే, ఫైనాన్షియల్ బాక్‌గ్రౌండ్ సరిగ్గా ఉన్నదీ లేనిదీ చూసుకోవటమూ ముఖ్యమే కదా! తను సంఘసేవ ఆశయంగా పత్రికని ప్రారంభించినా, కొన్ని సంఘాలకీ, ప్రజలకీ, తన పాఠకులకీ అవసరమయిన, ఉపయోగకరమయిన సందేశాల నిచ్చే ప్రకటనలు తీసుకుంటే మాత్రం తన ఆశయానికేం ముప్పవస్తుంది! అనీ అన్పించింది చివరికి.

ఎలాగయితేనేం, మిత్రులిద్దరూ ఒకే అభిప్రాయానికి వచ్చారు. అయినా మిత్రుడి మాటలకి తాను అంత సులభంగా లొంగినట్లు కన్పించటం విశ్వంకి ఇష్టంలేదు

''నువ్వు మంచి చేయబోతుంటే నేనేదో అడ్డుపడుతున్నట్లు మవ్వెందుకనుకోవాలి. నీ ఇష్టానుసారమేకానీ. అయితే ప్రకటనలు పట్టుకొచ్చేవని నాకు మాత్రం చెప్పద్దు. అదేదో నువ్వే చూసుకో. ట్వంటీ పర్సెంట్ స్పేస్ ఇవ్వగలను,'' అన్నాడు.

విశ్వం ఈ మాత్రం ఒప్పుకోవటమే పదివేలు అనుకున్నాడు పరశురాం అప్పటికే షుమారుగా పర్క్యులేషన్ పికప్ చేసిన 'గోరంత దీపం'లో ఇరవయి శాతం స్పేస్ నింపే ప్రకటనలు రావటం ఏమీ కష్టం అవలేదు.

పత్రికలో స్పేస్ సెల్లింగ్, బిల్లింగ్, కలెక్షన్ విషయాలు చూసుకుందుకు, ఒక క్లర్క్‌ని కూడా వేసుకున్నారు

* * *

'గోరంత దీపం' మెల్లిగా, కర్నూలుదాటి, జిల్లాలో కొన్ని ముఖ్యమయిన టవున్లలోకి వెళుతోంది. కొత్త ప్రెస్ కొనాలా, సెకండ్ హాండ్ ఎక్కడయినా ప్రయత్నించుదామా అని మిత్రులిద్దరూ ఆలోచనలు చేస్తున్నారు

అప్పుడొక తమాషా జరిగింది

'న్యూస్ ప్రింట్' సాంక్షన్ విషయమయి పనిమీద హైదరాబాదు వెళ్ళాడు విశ్వమూర్తి.

నరసింగరావు పేటలోనే మరో గదిలో తన ఆఫీసు ప్రత్యేకంగా ఏర్పరచుకున్నాడువిశ్వమూర్తి ఒక్కటే గది రెండు భాగాలుగా చేసి ఉంది బయటికున్న ముందు భాగంలో క్లర్కు కృష్ణ కూర్చుని పని చేసుకుంటాడు లోపలిది ఎడిటర్ గది అన్నమాట.

ఆ నెల వెళ్ళాల్సిన రెండో సంచిక మేటర్ అంతా కంపోజ్ అయి తయారుగా ఉంది. అడ్వర్టయిజ్‌మెంట్స్ అన్నీ అరేంజ్ మెంటు

గోరంత దీపం

సరిగ్గా చూసుకోమ్మని కృష్ణకి చెప్పి వెళ్ళాడు విశ్వం.

ఆ వేళ చేయాల్సిన కొన్ని బిల్స్ తయారు చేస్తూ కూర్చుని ఉన్నాడు కృష్ణ. ఇంతలో పద్నాలుగు పదిహేను సంవత్సరాల కుర్రవాళ్ళు నలుగురు వచ్చి గుమ్మం ముందు నిలబడటం కన్పించింది.

ఆశ్చర్యంగా చూశాడు కృష్ణ. ''ఏం కావాలబ్బాయి?'' అనడిగాడు. ''గోరంత దీపం'' ఆఫీసు ఇదేనా అండి?''

''బయట తాటికాయలంతేసి అక్షరాలతో రాసిన బోర్డు ఉంది కదా? ఇంకా అనుమానం ఎందుకు?... ఇలా రండి. ఏం కావాలి మీకు?''

''మేం ఎడిటరుగార్ని చూడొచ్చునా అండి''

పాపం! మనిషి!!

ఈ సృష్టిలో
ఒకొక్క జంతువుకి
ఒకొక్క ప్రాముఖ్యత వుంది.
కుక్కకి
విశ్వాసం!
గాడిదకి
సహనం!
గుర్రానికి
వేగం!
సింహానికి
రాజసం!
ఇవన్నీ చూస్తూ కూడా
మనిషి
ఇంకా
వెనకబడే వున్నాడు.

— ''సింహం''

''వారు ఊళ్ళోలేరు అయినా ఆయనతో ఏం పనో నాకు చెప్పండి. ఫరవాలేదు'' ఈ కుర్రాళ్ళకి విశ్వంగారితో ఏం పనా అని ఆశ్చర్యపోతూనే అడిగాడు కృష్ణ.

నలుగుర్లో కాస్త చురుకుగా కనిపిస్తున్న ఒక అబ్బాయి ముందుకొచ్చి, ''మరే, .. మేమొక ప్రకటన ఇవ్వాలని వచ్చాము సార్'' అన్నాడు వినయంగా

ఇది మరీ వింతగా ఉంది

''ముందిలా వచ్చి కూర్చోండి... ఊ ఇప్పుడు చెప్పండి మీరెవరు? ఏం ప్రకటన ఇవ్వాలని వచ్చారు?''

మొదట మాట్లాడిన అబ్బాయే ''మేము నంద్యాల గవర్నమెంటు హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులము హైదరాబాదు ఎక్స్‌కర్షన్ వెళుతూ, కర్నూల్లో ఒకరోజు దిగాము పోయిన వారంలో మా హెడ్‌మాస్టారు పోయారు పాపం ఆయన మహా దొడ్డమనిషి లెండి వారి ఫొటో ఒకటి మీ పేపర్లో వేసి, వారి స్మృతికి అంజలి పట్టాలని అనుకున్నాం మరి దానికెంతమాత్రం ఛార్జి అవుతుందో చెబితే ''

''ఓహో! అలాగా. అయ్యో పాపం మరి పోయిన వారం హెడ్‌మాస్టారు పోతే, ఈ వారం ఎక్స్‌కర్షన్ బయల్దేరారు ''

''ఏం చేస్తాం సార్ మాకెవరికీ ఇష్టం లేదు కానీ బస్ అదీ ఏర్పాటుచేసి, అడ్వాన్సు కూడా ఇచ్చేసారు ఎప్పుడో అందుకే తప్పని సరిగా బయలుదేరాము'' విచారం ధ్వనించింది చెబుతున్న అబ్బాయి స్వరంలో

'పాపం వాళ్ళ మాష్టారిమీద ఎంత భక్తి వున్నదో ఈ అబ్బాయిలకి బుద్ధిమంతుల్లా ఉన్నారు పేపర్లో మాస్టరి ఫొటో వేసేందుకు స్వంతంగా డబ్బు ఖర్చు చేయటానికి సిద్ధపడి వచ్చారు,' అనుకున్నాడు కృష్ణ జాలిగా

''ఫొటో ఏదీ?'' అన్నాడు

కవర్లో ఉంచి జేబులో భద్రంగా దాచుకున్న పాస్‌పోర్టు సైజు ఫొటో ఒకటి అందించారు అబ్బాయిలు

అందుకున్నాడు కృష్ణ పూర్తిగా బట్టతల, పెద్ద పెద్ద మీసాలు, బూరెబుగ్గలు, కుడిబుగ్గ మీదుగా ఓ గాటు, లాల్చీలోంచి కనిపిస్తున్న లావాటి మెడలో పులిగోళ్ళచైను - ఏమిట వాలకం చూస్తే పెద్ద పైల్మాన్‌లా ఉన్నాడే. ఈయనేం హెడ్ మాస్టరబ్బా! అనుకున్నాడు ఆశ్చర్యంగా

''రూపం చూసి ఆశ్చర్యంగా ఉందా మీకు. ఆయనొక కొమ్ములు తిరిగిన వస్తాదుకూడా సుమండి ఆయన పేరు చెబితేనే మా వూళ్ళో అంతా హడల్ అనుకోండి'' ముక్కుమీదికి జారుతున్న కళ్ళజోడుని తోసుకుంటూ చెప్పాడొక అబ్బాయి


బిల్ రాసి అందించాడు కృష్ణ నలుగురి జేబుల్లో ఉన్న రూపాయినోట్లు బయటికి తీసి చేర్చి లెక్కపెట్టి అందించారు ''థాంక్స్ సార్ వెళ్ళొస్తాం తప్పకుండా వేస్తారు కదూ?''

''ఓ షూర్ బిల్‌కూడా వేసేశారు గదా?'' అని పంపించేశాడు వాళ్ళని తను ప్రెస్‌కివాల్సిన అడ్వర్టయిజ్‌మెంట్ స్పేస్‌లో కొంత ఖాళీ ఉన్నట్లు గుర్తొచ్చింది హఠాత్తుగా ఇకనేం, ''ఈ 'ఆబిచ్యురీ' వేస్తే సరి పాపం! పోయినవారమే పోయేడట'' అనుకుని బ్లాక్ మేకింగ్‌కి ఇద్దామని బయలుదేరాడు ముందుగా అనుకున్న విధంగా, విశ్వం రాకముందే పత్రిక ప్రింటింగ్ అయిపోయింది.

(ఇంకా వుంది)

తండ్రి మనసు

ప్రతాప రవిశంకర్



"రండి మామయ్యగారూ" అన్నది సువర్చల గేటు నెట్టుకుని లోపలకు వస్తున్న శేషాచలాన్ని చూసి ..

గుమ్మందగ్గరకు వచ్చిన తర్వాత ఆయన చేతిలోనించి సంచీ తీసుకుని కాళ్లు కడుక్కోటానికి నీళ్లు ఇస్తూ "కులాసాయేనా?" అనడిగింది

"ఆ" అంటూ ఆయన నీళ్లు అందుకున్నాడు.

లోనికివెళ్లింది సువర్చల

"ఎవరూ వచ్చిందీ ?" అడిగాడు గుర్నాధ శర్మ.

"చిన్న మామయ్యగారు" అన్నది సువర్చల సంచీని గోడవారగా వుంచి

"బాగున్నావా అన్నయ్యా" అంటూ లోపలకు వచ్చాడు శేషాచలం

"నువ్వా శేషూ . ఎక్కడినించీ రావటం?" అన్నాడాయన.

"రెండోవాడు సుదర్శనం ఇంటినించే" అన్నాడు అన్నయ్య ఎదురుగా కూర్చుంటూ కుర్చీలో –

"సుదర్శనం ఇంట్లో అంతా బావున్నారా ?"

"ఆ అందరూ నిక్షేపంగా వున్నారు" అన్నాడు సువర్చల ఇచ్చిన మంచినీళ్లు అందుకుంటూ –

"బావున్నారా మామయ్యా" అంటూ వచ్చి శేషాచలాన్ని పలకరించింది ఆ ఇంటికి రెండో కోడలు అనసూయ.

తల వూపాడు శేషాచలం

సాయంత్రం నాలుగ్గంటల సమయం . కిటికీ లోనించి పలుచని ఎండ లోపలకు పడుతోంది

కోడళ్లిద్దరూ లోపలకు వెళ్లిపోయారు వారిభర్తలు ఇంకా ఆఫీసులనించి ఇంటికి తిరిగి రాలేదు. ఇంకో అరగంట తర్వాతగానీ వారి పిల్లలు స్కూలునించి తిరిగి రారు.

పదినిముషాల తర్వాత అనసూయ రెండు గ్లాసులతో హార్లిక్స్ తీసుకువచ్చి ఇద్దరు మామగార్లకీ ఇచ్చి వెళ్లిపోయింది.

తండ్రి మనసు

తన అన్నయ్య కోడళ్ల మర్యాదలూ, వారి వినయ విధేయతలూ చూస్తుంటే శేషాచలానికి గుండెల్లో ఏదో ముల్లు గుచ్చుకున్నట్టు అనిపించింది

"ఊ ఏమిటిరా విశేషాలు ?" అడిగాడు గుర్నాధశర్మ తమ్ముడిని

"ఏమున్నాయ్ నా కొడుకులిద్దరికి నేను భారమయి పోయాను నిన్నటివరకూ రెండోవాడి దగ్గర వున్నాను ఈరోజు వాడు కూడా నాకు తన ఇంట్లో చోటు లేదని చెప్పేశాడు భార్య మాటలు విని చిన్నకోడలు శారద కూడా ఉదయమే చెప్పేసింది ఎక్కడికయినా వెళ్లి పొమ్మని వేరే దారి లేకపోతే అడుక్కుని బతకమన్నది పెద్దవాడు తన ఇంటి గుమ్మం తొక్కవద్దని ఎప్పుడో చెప్పేశాడు కదా ! ఎటు వెళ్లాలో తెలీక ముందుగా ఇక్కడికి వచ్చాను హు వంట్లో శక్తి వున్నంతకాలం నా పిల్లలు నా సంసారం అంటూ వాళ్లకోసం తాపత్రయపడి పోయాను అందుకు ప్రతిఫలంగా వాళ్లిద్దరు నాకు ఈ గతి పట్టించారు" అన్నాడాయన విచారంగా

కొడుకులిద్దరూ తన తమ్ముడిని ఇళ్లలో నించి గెంటివేశారని వినగానే గుర్నాధశర్మ హృదయం బాధతో కొట్టుకున్నది

ఆయన ఆ రోజుల్లోనే చదువుకుని మాస్టరు ఉద్యోగం సంపాదించాడు శేషాచలం అంతగా చదువుకోలేదు అందుకే కిరాణాషాపులో పని చేస్తూ చాలీచాలని సంపాదనతో కొడుకులిద్దరినీ పెంచాడు పెద్దకొడుకు సోమేశ్వర్ ఇంటర్ వరకు చదువుకుని ఓ గవర్నమెంటాఫీసులో ఉద్యోగం సంపాదించాడు రెండో కొడుకు సుదర్శనం అంతగా చదువుకోలేదు తండ్రిలాగే ఓ ఫ్యాన్సీషాపులో పనికి కుదిరాడు

శేషాచలం భార్య ఆరేళ్లక్రితమే ఓ జబ్బుతో పోయింది గుర్నాధశర్మ కొడుకులిద్దరూ బాగానే చదువుకున్నారు పెద్దకొడుకు విశ్వనాధంకు రెవెన్యూ డిపార్టుమెంటులో ఉద్యోగం రెండో కొడుకు గోపాలంకి బ్యాంకులో ఉద్యోగం అంతా కలిసే వుంటున్నారు నాలుగేళ్లక్రితం గురున్నాధశర్మ భార్య గుండెపోటుతో చనిపోయింది అప్పటి నించీ కోడళ్లిద్దరూ ఆయన అనసరమేమిటో గుర్తిస్తూ ఆయన మనసు నొచ్చుకోకుండా సేవలు చేస్తున్నారు కొడుకులిద్దరూ తండ్రిని అపురూపంగా చూసుకుంటున్నారు

అన్నదమ్ములిద్దరి జీవితాలకి అంతటి వ్యత్యాసం వుండటం గుర్నాధశర్మకి చాలా మనస్తాపాన్ని కలిగించింది

"నేను నిజంగా చాలా అదృష్టవంతుడనిరా శేషూ నా కొడుకులూ, కోడళ్లూ నన్నో దేవుడిగా చూసుకుంటున్నారు ఈ అదృష్టానికి నేనెంతో గర్వపడుతున్నాను వృద్ధాప్యంలో వారి ప్రేమ, అభిమానం నాకో వరంగా భావిస్తున్నాను" అన్నాడు గుర్నాధశర్మ తమ్ముడితో—

"అవును ఇక నా దృష్టిలో నావాళ్లంతా లేనట్టే వాళ్లు మరమనుషులు ఇక నాజీవితం ఇలా వెళ్లిపోవలసిందే" అన్నాడు శేషాచలం బాధగా

వాళ్లలా మాట్లాడుకుంటున్నప్పుడే పిల్లలు స్కూలునుంచి వచ్చారు వస్తూనే శేషాచలాన్ని చూసి "చిన్న తాతయ్యా" అంటూ ఆయన దగ్గిరికి వచ్చారు వాళ్లందరినీ నవ్వుతూ పలకరించాడు శేషాచలం

ఆరుగంటలు కావస్తున్నప్పుడు విశ్వనాధం—గోపాలం ఇంటికి వచ్చారు! వస్తూనే తండ్రితో మాట్లాడుతున్న శేషాచలాన్ని చూసి సంతోషంగా నవ్వుతూ పలకరించారు

వారి అభిమానం ఆయనికీ సంతోషాన్ని కలిగించింది

కొంచెం సేపటి తర్వాత గుర్నాధశర్మ కొడుకులిద్దరికీ, కోడళ్లకీ శేషాచలం కొడుకులు తండ్రిపట్ల చూపిన ఆదరణ గురించి వివరంగా చెప్పాడు వాళ్లంతా ఆయన అనుభవించిన బాధలకు ఎంతో నొచ్చుకున్నారు

"బాబాయ్ ఇకనువ్వు వాళ్ల గురించి మరచిపో ఈ రోజునించీ నువ్వు కూడా మా కుటుంబంలో ఒకడివి మేమే నీ కొడుకులం అనుకో ఈ ఇల్లు నీ ఇల్లే అనుకో నువ్వు మాకు భారం కాదు ఏరా గోపాలం ఇకనించీ బాబాయి మనతోటే వుంటానికి నీకేమైనా అభ్యంతరమా ?" అన్నాడు విశ్వనాధం

"నాకేం అభ్యంతరం లేదు బాబాయ్ మనతోనే కలిసి వుండటం నాకూ సంతోషమే" అన్నాడు గోపాలం

భర్తలిద్దరూ ఆ ఇంటి కోడళ్లనుకూడా

మనవి

డాక్టర్ సలహాలు, ప్రశ్నావళి శీర్షికలకి ప్రశ్నలు పంపేవారు తాము పంపే శీర్షిక పేరు రాసి కేరాఫ్ సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగర్, విజయవాడ – 520 003 అన్న చిరునామాకి పంపాలి. రాసిన వారి పూర్తి పేరు, చిరునామా యివ్వడం ఎంతైనా అవసరం. —సం.

అడిగారు శేషాచలాన్ని ఆ ఇంట్లో వుంచుకోవటం గురించి.

"ఆయన నిజంగానే ఈ కుటుంబంలో మనిషి. మా మామగారి తమ్ముడు మాకు చిన్న మామగారు. ఇక ఆయన మన ఇంట్లో వుండటం మాకు అభ్యంతరం ఎలా అవుతుంది? మాకు ఇష్టమే ఈ ఇంట్లో ఆయనకు ఏ నష్టమూ రాకుండా చూసుకునే బాధ్యత మాది" అన్నారు కోడళ్లు

అప్పుడు శేషాచలం నిజంగానే ఏడ్చాడు వాళ్లందరి ఆప్యాయత, అనురాగం ఆయన్ని కదిలించివేశాయి తన తండ్రినేకాకుండా తనని కూడా తండ్రిలాగే చూసుకుంటామని తమ కుటుంబంలో ఒకడిగా భావించిన వాళ్లందరి సహృదయత ఆయనచేత కంటతడి పెట్టించింది.

తమ్ముడి భుజంమీద చెయ్యివేసి ఆప్యాయంగా నొక్కుతూ "ఒరేయ్ శేషూ అసలు నేనే నిన్ను నాతోపాటే ఈ ఇంట్లో వుండమని అందామనుకున్నాను కాని ఈ సంసార రథాన్ని లాగుతున్న మనుషులు వాళ్లు అందుకే వాళ్ల అభిప్రాయమేమిటో తెలుసుకున్న తర్వాతనే ఈ విషయం గురించి నేను మాట్లాడదామను కున్నాను వాళ్ల అభిప్రాయమేమిటో చెప్పారు కదా! ఇప్పుడు నాకు ఇంకా గర్వంగా వుంది నా కొడుకులనూ, కోడళ్లనూ చూస్తుంటే" అన్నాడు.

చిన్న తాతయ్య ఇక ఎప్పటికీ తమఇంట్లోనే వుంటాడని తెలుసుకున్న పిల్లలుకూడా ఎంతో సంతోషం వ్యక్తపరిచారు.

అప్పటికి శేషాచలం ఆ ఇంటికి వచ్చి మూడు నెలలయ్యింది ఈ మూడు నెల్లలోనూ ఆయన మనసు ఎంతగానో కుదుట పడింది తన అన్న కొడుకులూ, కోడళ్లూ ఆయన్ని ఎంతో ప్రేమగా చూసుకుంటున్నారు ఆయనకి ఎటువంటి బాధా కలగకుండా ప్రవర్తిస్తున్నారు చివరికి పిల్లలు కూడా శేషాచలం అంటే ఎంతో అభిమానాన్ని చూపుతున్నారు

ఆయనకి నిజంగా స్వర్గంలో వున్నట్టుగా వున్నది తను కన్న కొడుకులూ, కోడళ్లతో వీళ్లందరినీ పోల్చుకున్నప్పుడు ఆయనకు నిజంగా ఎంతో ఆశ్చర్యం కలిగింది

వాళ్లు సొంత తండ్రిని ఎంతో సులభంగా ఇంట్లోనించి గెంటివేశారు

కాని- వీళ్లు తన సొంత తండ్రితో సమానంగా తనని చూసుకుంటున్నారు

ఏమిటిదంతా?

నెల రోజుల క్రితం ఒకరోజు సాయంత్రం శేషాచలానికి వున్నట్టుండి ఆయాసం ముంచుకు వచ్చింది

చాలా బాధ పడిపోయాడు

వెంటనే అప్పుడు ఇంట్లోనే వున్న గోపాలం డాక్టర్ని ఇంటికే తీసుకువచ్చాడు ఆయన రాసి ఇచ్చిన మందులను అప్పటికప్పుడు తీసుకు వచ్చాడు.

రెండ్రోజుల్లో శేషాచలం మామూలు మనిషి అయినాడు

తనకు ఎన్నోసార్లు ఇలాగే వస్తే తను బాధపడుతుంటే తన కొడుకులు చూస్తూవూరు కున్నారుగానీ ఒక్కసారికూడా డాక్టర్ని పిలవలేదు మందులు ఇప్పించలేదు

ఏమయినా కొంతవరకు తను అదృష్టవంతుడినని అనుకున్నాడు శేషాచలం

* * *

"ఇప్పుడెందుకురా విశ్వనాథం ఈ డబ్బులు" అన్నాడు శేషాచలం.

"పర్వాలేదులే తీసుకో బాబాయ్ నీ బట్టలు బాగా పాతబడిపోయాయి నీకు ఇష్టమైన బట్టలు కొనుక్కో" అని నూట పాతికరూపాయలు ఇచ్చాడు విశ్వనాథం

శేషాచలం వద్దన్నా విశ్వనాథం బలవంత పెట్టాడు. ఆయనకు తీసుకోక తప్పలేదు

సాయంత్రం ఆరుగంటల సమయంలో శేషాచలం బట్టలు కొనుక్కోటానికి బజారుకు వెళ్లాడు

రోడ్లన్నీ బాగా రద్దీగావున్నాయి జనంతో

మెల్లగా నడుస్తున్న శేషాచలానికి మందుల షాపులోంచి బయటకు వస్తున్న రెండో కొడుకు సుదర్శనం కనిపించాడు

అతనుకూడా తండ్రిని చూశాడు ఇద్దరూ ఒకరికొకరు ఎదురయ్యారు

సుదర్శనం మొహం బాగా వాడిపోయి వున్నది! ఏదో విషాదంలో మునిగిపోయిన వాడిలా కనిపించాడు

"ఏరా. అంతా బావున్నారా?" అనడిగాడు శేషాచలమే కొడుకుని.

"ఏం బాగుండడం పెద్దవాడికి వున్నట్టుండి పెద్ద జబ్బు ముంచుకు వచ్చింది పొద్దున్నే. వాడిని అక్కడే ఆస్పత్రిలోచేర్పించాము డాక్టరు మందులురాసి ఇచ్చాడు అర్జంటుగా తెమ్మని. నా దగ్గర పది రూపాయలకు మించి లేవు. ఈ మందులు వంద రూపాయలు అవుతాయట. ఎక్కడా అప్పు దొరకలేదు. చివరకు నాకు తెలిసిన ఒకాయన ఓ చీటీ రాసి ఇచ్చాడు ఈ వూర్లో తనకు తెలిసిన మందుల షాపు వాళ్ళున్నారని వాళ్ల దగ్గరకు వెళ్లాను ఈ మందులు వాళ్ల షాపులో లేవుట ఇప్పుడు ఏం చెయ్యాలో తెలీక తిరుగుతున్నాను" అన్నాడు విచారంగా—

కొడుకు చెప్పిన మాటలు వినగానే ఒక్కసారి గతాన్నంతా మరచిపోయి ఆయన తండ్రి మనసు ద్రవించింది.

తన కొడుక్కు ఎంత కష్టం వచ్చింది?


"అయ్యో అలాగా." అన్నాడుబాధగా—

ఆ తర్వాత ఆయన ఒక్క క్షణం ఏదో ఆలోచించి జేబులోవున్న మాటపాతికరూపాయలు తీసి కొడుకు చేతిలో వుంచుతూ "వెళ్లు త్వరగా మందులు కొనుక్కుని వెళ్లు." అన్నాడు

గబుక్కున ఆ డబ్బులు తీసుకున్న సుదర్శనం తండ్రిని ఏమీ అడగలేదు ఆయన యోగక్షేమాల గురించి అడగలేదు గబగబా వెళ్లిపోయాడు.

శేషాచలం తృప్తిగా శ్వాస పీల్చాడు ఆయన తండ్రి మనసు కుదుటపడింది

తన కొత్త బట్టల గురించి విశ్వనాథం అడక్కముందే ఆ మాటపాతిక రూపాయలనూ బజార్లో ఎవడో జేబు కొట్టాడని చెప్పాలను కున్నాడు శేషాచలం రోడ్డుమీద నడుస్తూ ★



హైదరాబాద్ నోట్‌బుక్

నిరసనలు, సమ్మెలు :

జనవరి రెండు, మూడు వారాలను నిరసనలు, సమ్మెల వారాలుగా భావించవచ్చు. రోడ్డు రవాణా సంస్థ కార్మికుల సమ్మె, విద్యార్థుల నిరసన, గ్రామోద్యోగుల నిరసన, మండలాల నిర్మాణానికి నిరసన, ముఖ్యమంత్రిపై హత్యా ప్రయత్నానికి నిరసన, కొండపల్లి పరారీలో పోలీసుపై జరిగిన అన్యాయానికి నిరసన, కాకతీయ విశ్వవిద్యాలయంలో పోలీసుల దౌర్జన్యానికి నిరసన, ఎన్. టి. రామారావు ప్రభుత్వ పథకాలకు నిరసన— ఒకటేమిటి? బోలెడు నిరసనలు. ఈ నిరసనలు, సమ్మెలతో బాధపడేది జనం. ప్రతి ప్రభుత్వం నెలకొన్నప్పుడూ, అడపాదడపా సమ్మెలు ఆనవాయితీ అయింది. ఆ మధ్య జపాను నుంచి వచ్చిన ఒక పెద్దమనిషిని కలుసుకొన్నాను— జపానువాడు సుమండీ. ఇక్కడి సమ్మెలకు, నిరసనలకు ఆశ్చర్య పడ్డాడు. జపానులో నిరసన మన దేశంలోలాగ చూపరట. ఎక్కువ పనిచేసి నిరసన తెలుపు తారట. ఇది మనకు అభూయిత్యంగా కనిపించ వచ్చుగాని, ఒకవిధంగా మంచిదేనేమోననిపిస్తుంది. వస్తువులను పాడుచేయడం వల్ల, పని మానడం వల్ల కలిగే నష్టం మనకే కదా! ఈ జాతి సమగ్రదృష్టి మనకింకా అలవాటు కాలేదు. పరిపాలన ప్రభుత్వం అనగానే పరాయిది అనే భావం మనకు ఇంకా పోలేదు; ఒకతరం స్వతంత్ర పాలన జరిగినా, పార్టీ ప్రభుత్వం మారగానే శత్రువుల పరిపాలన అనే భావమూ ఏర్పడింది. ఈ కుమ్ములాటలు లేక రెండుపార్టీల ప్రభుత్వం ఏర్పడితే బాగుండునేమో! పోటాపోటీలతో మంచి చేయవచ్చు. ఇప్పుడు ఎదిరి పార్టీని కూల్చడమనే భావం తప్ప మరొకటి లేదు.

ఆంధ్రప్రదేశ్ మ్యాజిక్ ఫెస్టివల్:

వంశీ ఆర్ట్స్ థియేటర్, రేలంగి ఆర్ట్స్ అకాడెమీ ఆధ్వర్యంలో డాక్టర్ బి.వి. పట్టాభిరాం నిర్వహణలో జనవరి 7, 8 తేదీలలో రవీంద్ర భారతిలో తొట్టతొలిగా ఆంధ్రప్రదేశ్ మ్యాజిక్ ఫెస్టివల్ జరిగింది. 12 మంది ప్రముఖ ఇంద్ర జాలికులు ప్రదర్శనలిచ్చారు. సమాచార పౌర సంబంధ, సాంస్కృతిక శాఖల కమిషనర్ శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్ ఈ ఉత్సవాన్ని ప్రారంభిస్తూ, ఇంద్రజాలం అందరికీ ఆనందం కలిగించే విద్య అని, చిన్నతనంలో తాముకూడ మ్యాజిక్ నేర్చుకొందామనుకున్నామని, సరైన గురువు లేక ఇంద్రజాలికుడు కాలేకపోయానని అన్నారు. ఈ విద్యావ్యాప్తికి చేతనయినంత సహాయం చేస్తామని అన్నారు. ముఖ్య అతిథి డాక్టర్ సి. నారాయణరెడ్డి తమ ప్రసంగంలో ''మ్యాజిక్ ప్రపంచంలో ప్రతిచోట వుంది. కవిత్వంలోను వుంది. కవులు తమ రచనాశక్తితో పాఠకులను ఊహాలోకాలకు తీసుకుపోయి, అక్కడ విహరిస్తున్నట్లు భ్రమ కలిగిస్తారు. మెజీషియనులు ప్రేక్షకులను మాయాలోకాలకు తరలిస్తారు. అంతే తేడా'' అన్నారు. సభకు పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్ శ్రీ ఆర్. ప్రభాకరరావు అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్ మెజీషియనుల తరపున శ్రీ బి. వి. పట్టాభిరాం ప్రభుత్వానికి వినతి పత్రం సమర్పించారు. అందులో మ్యాజిక్ కళను ప్రభుత్వం గుర్తించి, ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేయడంలో ఇంద్రజాల ప్రదర్శనాలకు అవకాశమివ్వాలని, ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. శ్రీయుతులు ఉండేలు మాలకొండారెడ్డి, జె. రాజారావు, ప్రభాకర్ గుప్తా ప్రసంగించారు. మొదటిరోజు శ్రీయుతులు ఆర్. ఎల్. రాజు, ఎస్. ఎన్. రాజగోపాలన్, ఆర్.ఆర్. రావు ప్రధాన ప్రదర్శనలు జరిపారు. విరామ సమయంలో శ్రీ అర్వల్, కుమారి సూర్య కుమారి, ఎన్. మనోహరరావు మాయా వినోదం చూపారు. రెండవరోజు శ్రీయుతులు బి. వి పట్టాభిరాం, ధన్‌రాజ్ జైన్, మోహన్‌మీనన్ తమ హస్త లాఘవంతో ప్రేక్షకులను ఆనందింపజేశారు. విరామ సమయంలో శ్రీయుతులు గణేశ్ గుప్త, జి. ఉమాపతి, కృష్ణారావు ఇంద్రజాలం ప్రదర్శించారు. ఉత్సవ ప్రారంభంలో శ్రీ వంశీ రామరాజు స్వాగతం చెప్పగా, చివరన శ్రీ పట్టాభిరాం వందన సమర్పణ చేశారు.

ప్రముఖుల విగ్రహాలు :


హుసేన్ సాగర్ కట్టవెంబడి వరసగా ఆంధ్ర ప్రముఖుల విగ్రహాలను నెలకొల్పాలని ముఖ్యమంత్రి శ్రీ రామారావు ఆలోచిస్తున్నట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం చెరువుగట్టునిండా వ్యాపార ప్రకటనలున్నాయి. వాటిని చూడలేక జనం విసుగెత్తిపోతున్నది. కాని, మద్రాసు బీచిలో తమిళ నాయకుల ప్రతిమలు నిలిపినట్టుగా మాత్రం వద్దు. మెరీనా బీచిలో కణ్ణకి విగ్రహం నెలకొల్పారు. కణ్ణకి అతిలోక సుందరి అయినదని కావ్యవర్ణన కాని మెరీనా కణ్ణకి వెంట్రుకలు విరబోసుకొని, అందెను విసిరివేస్తూ, అలనాటి మధురనుకాక చెన్న నగరాన్ని శపిస్తున్నట్టుగా వుంది. పాశ్చాత్యులలాగ మనం మన పెద్దల చిత్రాలనుగాని, రూపాలను గాని భద్రపరచుకొనే అలవాటులేదు. ఏవో ఊహా రూపాలు కల్పించుకొని, వారికి అపచారం చేస్తున్నాము. అలా జరక్కుండా చూడాలి. బ్రతికివున్నవారి విగ్రహాలు ప్రతిష్ఠించరాదని అమెరికాలో నియమం వుందట. అలాటి నియమం మనమూ పాటించాలి. ఎంతటి గొప్పవాడయినా, బతికున్నవారికి విగ్రహాలు వద్దు. చిత్రాలులేని తిక్కన వంటి వారి విగ్రహాలను ప్రతిష్ఠించేటప్పుడు రాష్ట్రంలో ప్రముఖ పురాతత్త్వవేత్తలతోను, చరిత్రకారులతోను, పండితులతోను చర్చించడం అవసరం. ఇప్పటి వేషభాషలతో ఆనాటి వారిని నిరూపించరాదు. పాత వేషభాషలు తెలుపగల కావ్యాలు మనకు హంస వింశతి, శుకసప్తశతి వంటివి కొన్నే ఉన్నాయి. పాత శిల్పాలు, చిత్రాలు వున్నాయి. నేటి గాంధీజీ విగ్రహాలు, మరికొందరు పెద్దల విగ్రహాలు వారి పోలికలు లేక దిష్టిబొమ్మలుగా తయారయినవి చాల చోట్ల కనిపిస్తాయి. అలాటి గతి మన ప్రాచీన ప్రముఖులకు పట్టకూడదు.

ఉపశ్రుతి :

ఈసారి రిపబ్లిక్ దినోత్సవాల అలంకృత శకటాలలో మన రాష్ట్రానికి ప్రాతినిధ్యం లేక పోవడం విచారంగా లేదటండీ ?— అన్నారు నాతో ఒకరు. మరేం ఫరవాలేదు. ఏటా మన ప్రతినిధులు లంబాడీ తాండాలే కదా! ఈసారి లేనంత మాత్రాన వచ్చిన అవమానమేమీ లేదు లేండి— అన్నారు మరొకరు.

— తిరుమల రామచంద్ర ★

ఆంధ్రప్రదేశ్ మొదటి మేజిక్ ఫెస్టివల్ సందర్భంగా ప్రదర్శన ఇస్తున్న ప్రొ. ఎన్. మనోహరరావు




దగ్గరకొచ్చి
గమనించండి
SUPER
RIN
STRIKES WHITER
NEW PERFUME
కొత్త
సూపర్ రిన్
ముచ్చటైన కొత్త రాపర్!
తాజాదనం చిందే సరికొత్త సువాసన!
సూపర్ రిన్
చిమ్ముతూన్న మరింత తెల్లదనం
దీనికి సరిపడే డిటర్జంట్ బిళ్ళ మరొకటి లేదు!
హిందుస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి
LINTAS RIN 75 2315 TL

గ మ ని క

గేయాలు పంపేవారు వాటితో తపాలా కార్డు జత పరచవలసి వుంటుంది. గేయాలు త్రిప్పి పంపబడవు. గేయాలు, కవితలు సాధ్యమైనంత క్లుప్తంగా వుండటం మంచిది. —సం.

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada-3, Editor : S. Radhakrishna.

అవీ–ఇవీ–అన్నీ

నవరంగ్ చిత్రకళానికేతన్ పోటీలు

నవరంగ్ చిత్రకళానికేతన్, వెల్లటూరు వారు 1984 ఏప్రిల్‌లో 14వ అఖిలభారత బాలల చిత్రకళా ప్రదర్శనము, 11వ అఖిల భారత ఔత్సాహిక చిత్రకళా ప్రదర్శనలు, 5వ ప్రాంతీయ చిత్రకళా ప్రదర్శనలని నిర్వహించనున్నట్లు కార్యదర్శి తెలియచేశారు. వివరాలకి శ్రీ వెల్లటూరి పూర్ణానందశర్మ, సెక్రటరీ, నవరంగ్ చిత్రకళా నికేతన్, వెల్లటూరు – 522 257, వయా తెనాలి, గుంటూరు జిల్లాకి రాయవచ్చు.

క ళా సా గ ర్

ఇటీవల కళాసాగర్ (మద్రాసు) ఆధ్వర్యంలో సాంగ్ అండ్ డ్రామా డివిజన్ (కేంద్ర రేడియో సమాచారశాఖ) కళాకారులు ప్రయోజనాత్మకమైన సాంఘిక సంగీత నృత్య నాటకం ప్రదర్శించారు.





మురికిపూడిలో జరిగిన కమలనాభుడు మెమోరియల్ నాటక కళాపరిషత్‌లో ఉత్తమనటి కుమారి క్రాంతికి బహుమతి ప్రదానం చేస్తున్న కళాసదస్సు అధ్యక్షుడు శ్రీ కె. నారాయణమూర్తి.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రచయిత, దర్శకులు శ్రీ జంధ్యాల నాటక రచయిత శ్రీ చెర్వు ఆంజనేయశాస్త్రిని, దర్శకత్వం వహించిన సాంగ్ అండ్ డ్రామా డివిజన్ డెప్యూటీ డైరెక్టర్ శ్రీ పి. యస్. రామారావును, సంగీత దర్శకులు శ్రీ టి. చలపతిరావును అభినందించగా కళాసాగర్ వారు వారిని పూలమాలలతో సత్కరించారు.

కార్యక్రమం ఆరంభంలో స్వాగతం పలికిన కళాసాగర్ సంయుక్త కార్యదర్శి శ్రీ ఎ. వి. సాయిప్రసాద్ నాటక ప్రదర్శనానంతరం వందన సమర్పణ చేశారు. —(ఒ. వి.)

"బ్లూ స్టార్ మద్దతు ఉన్నదంటే ఇక లేనార్డ్‌కు తిరుగులేదని నాకు ముందే తెలుసు!"






అవును మరి. ఏర్‌కండీషనింగ్‌లోనూ, రిఫ్రిజిరేషన్‌లోనూ వారిది అగ్రగణ్య కంపెనీ కదా!
నిజమంటే! వారి పేరేకాదు వారి పని కూడా గొప్పదే 35 అంతస్థుల ఫైవ్ స్టార్ హోటలొక దానికి వారు చేసిన పూర్తి ఏర్‌కండీషనింగూ, బ్రహ్మాండమైన 20 కూలింగ్ రూములకు రిఫ్రిజిరేషనూ నేను స్వయంగా చూశాను. అంతెందుకు, లెనార్డ్ మీద ఈసారి నా టెస్ట్‌మ్యాచిని కూడా పందెం కాయడానికి నేను సిద్ధం!


లేనార్డ్‌లోని కంప్రెసర్ కూడా జగజ్జెట్టియే!
అంతా ఆ కంప్రెసర్ మీదే ఆధారపడి ఉంది మరి చెడిపోవడాలూ, చికాకులూ ఊహుఁ, అసలుండవు దాని గట్టితనమూ, నమ్మకమైన పనీ చూస్తే యిక దిగులనేమాటే ఉండదు. జగజ్జెట్టీ అంటే యిక తిరుగేముంటుంది. అందుకే, నాకూ, మా శ్రీమతికీ కూడా అదంటే అంత యిష్టం. ఇక ఫ్రెండ్సంతా వచ్చి, వంతులపై వంతులు నడుస్తూ ఉంటే మాత్రమేం, మా కంప్రెసర్ చల్లగా తోడు పలుకుతూనే ఉంటుంది.

నిలవ భోజనమైనా నిమ్మళంగా, తాజాగా ఉంటుంది!
భోజనం విషయంలో పట్టింపులన్నీ వదిలేశా అందుకే శ్రీమతికి మరీ సంతోషం అయినా, రుచులు సరిగ్గా ఉండి, కూరలన్నీ తాజా తాజాగా ఉంటే యిక నేను మాత్రం గొణగడందేనికి!



థాంక్యూ బ్లూస్టార్!
మా లేనార్డ్ ఎప్పుడేగాని ఇబ్బందనేది పెట్టి ఎరగదు అయినా అవసరమంటూ వస్తే ఫోనెత్తి 'హలో' అంటే చాలదూ, సేవ హాజరు కావడానికి!





లేనార్డ్ 5 సైజుల్లో దొరుకుతుంది—ఆటోమాటిక్ డీఫ్రాస్ట్‌తోటి 286, 165 లీటర్లు, 135, 90, 65 లీటర్లు 165 లీటర్లలో డబుల్‌డోర్ మోడల్ కూడా లభిస్తుంది వీటితో దేశవ్యాప్తంగా ఉన్న బ్లూస్టార్ సేవా సౌకర్యం.

LEONARD®
FROM ★ BLUE STAR

బ్లూస్టార్-ఏర్‌కండీషనింగ్ మరియు రిఫ్రిజిరేషన్‌లో అగ్రగణ్యులు

SIMOES/BS/L/83A TEL


ఉన్నతమైన నాణ్యత
ప్రియలోనే వుంది
priya
ఎన్నిక చేసిన దినుసులన్నీ సమపాళ్లలో
మేళవించి అద్భుతమైన రుచులతో
రూపొందించినవే ప్రియ పచ్చళ్ళు.
మీ భోజనానికి సంతృప్తి సరిజోడు-ప్రియ
ఈనాడే మీ ప్రియను మీ ఇంటికి తీసుకువెళ్ళండి.
ఎంతో రుచి... ఎంతో రుచి... ప్రియ
ప్రియ ఫుడ్స్
ప్రైవేట్ లిమిటెడ్
Marketed by:
MARGADARSI MARKETING
PRIVATE LIMITED